




www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

విజయవాడ సిటీ







సోమవారం | 16-12-2019 | పేజీలు: 12 + 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 | సంచిక (Issue) : 241

శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: పంచమి తె. 3.40 తదుపరి షష్ఠి; నక్షత్రం: ఆశ్లేష రా. 2.48 తదుపరి మఖ; వర్జ్యం: సా. 4.10-5.41; దుర్ముహూర్తం: మ. 12.33-1.17, మ. 2.45-3.28; అమృతఘడియలు: రా. 1.16-2.48; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 5.40

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananatapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad | Bangalore and Chennai



గ్రామంలోని ఆలయం వద్ద సమావేశమైన గ్రామస్థులు

## మా ఊరి జోలికి రావొద్దు

**యురేనియం సర్వేపై జనాగ్రహం**

ఆర్.కొత్తపల్లిలో గ్రామస్థుల సమావేశం

ప్రాణం పోయినా గ్రామాన్ని వీడబోమని స్పష్టీకరణ

10



## ఆ.. ఒక్కటీ అడగొద్దు!

భూముల రీ సర్వేకు తాజా రూల్స్ ఒప్పుకోవు

మరోసారి డీఐఎల్ఆర్ఎంపీ స్పష్టీకరణ


'నవోదయ' రామ్మోహనరావు

## ఇక లేరు

**అనారోగ్యంతో విజయవాడలో తుదిశ్వాస**

**తెలుగునాట పుస్తక ప్రదర్శనలకు ఆద్యుడు**

**లబ్ధప్రతిష్ఠులైన దిగ్గజాలతో అనుబంధం**

విజయవాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రచురణల రంగాన్ని అత్యున్నత స్థాయిలో నిలబెట్టి, కవులు, కళాకారులతో తన 'నవోదయ'ను సాహిత్య కేంద్రంగా నడిపిన నవోదయ పబ్లిషర్స్ అధినేత అట్లూరి రామ్మోహనరావు (85) ఇక లేరు. కొంత కాలంగా అస్వస్థతతో ఉన్న ఆయన ఆదివారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో విజయవాడ మొగల్రాజపురంలోని తన నివాసంలో కన్నుమూశారు. నవత అధినేత బోసు సోదరి ఝాన్సీ, రామ్మోహనరావు సతీమణి. వీరికి ఒక కుమారుడు, కుమార్తె. కుమారుడు సుధాకర్ ఐదేళ్ల క్రితం మృతిచెందారు. కుమార్తె శోభ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. 1934వ సంవత్సరంలో కృష్ణాజిల్లా

మిగతా 9వ పేజీలో...

# ఎస్.. బాస్!

**కొందరు ఐఏఎస్ అధికారుల అత్యుత్సాహం**

**ప్రభుత్వ పెద్దలు ఆదేశించడమే ఆలస్యం**

- అడ్డగోలుగా అమలు చేస్తున్న వైనం
- యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- తప్పని తెలిసీ సచివాలయ భవనాలకు, వాటర్ ట్యాంకులకు వైసీపీ రంగులు
- పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీది అదే తీరు
- హైకోర్టు మొట్టికాయలు..
- కోట్లకొద్దీ ప్రజాధనం రంగులపాలు
- తాజాగా ఉపాధి నిధులు మెటీరియల్‌కు మళ్లింపు
- కేంద్రం వాటిని ఆపేస్తే పరిస్థితేంటి?



రాష్ట్రంలోని కొంత మంది ఐఏఎస్ అధికారుల్లో 'ఎస్ బాస్' తత్వం ఎక్కువవుతోందన్న విమర్శలు నానాటికీ పెరుగుతున్నాయి. ప్రభుత్వంలోని పెద్దలు, మంత్రులు గానీ.. ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు గానీ ఆదేశించడమే తరువాయి.. వీరు అత్యుత్సాహం చూపించి అడ్డగోలుగా అమలు చేసేస్తున్నారు. అది నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో కూడా చూడడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా.. గ్రామీణ ప్రజలతో మమేకమై ఉన్న పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో అది స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపణలొస్తున్నాయి. ప్రభుత్వ ఖర్చుతో పంచాయతీ భవనాలకు వైసీపీ రంగులు వేయడంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేయడంతో ఇప్పుడు ఆ రంగులన్నీ చెరిపేయాల్సిన పరిస్థితి. దీనివల్ల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ భవనాలకు సాధారణంగా తెల్ల రంగు వేస్తుంటారు. వాటికి ఒక పార్టీకి చెందిన రంగులు ఇదివరకు ఎక్కడా వేయలేదు. గత ప్రభుత్వంలో కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కొన్ని చోట్ల అప్పటి టీడీపీ కార్యకర్తలు నిర్మించిన భవనాలకు అత్యుత్సాహం చూపించి పసుపు రంగు వేసుకున్నారు. ఇది తప్పని తెలిసినా.. అప్పట్లో కార్యకర్తల అత్యుత్సాహాన్ని ప్రభుత్వంలో ఉన్న వారు కాదనలేకపోయారు. అంతేతప్ప పసుపు రంగు వేసి తీరాలని అధికారికంగా నాటి ప్రభుత్వం ఆదేశాలివ్వలేదు. అయితే ఇప్పుడు రాష్ట్రంలో వైసీపీ రంగులతో అధికారిక భవనాలను ముంచెత్తారు. పంచాయతీరాజ్ కమిషనర్, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) ఈఎన్‌సీ ఏకంగా వైసీపీ జెండాలో

మిగతా 2వ పేజీలో...



## ఫాస్టాగ్.. గోలగోల!

**తొలిరోజే తీవ్ర గందరగోళం**

'కృష్ణా' టోల్ ప్లాజాల్లో మొరాయించిన రీడర్లు

ఫాస్టాగ్ లేన్లలోనూ నిలిచిన వాహనాలు

రాష్ట్రవ్యాప్తంగా 55% మాత్రమే ఫాస్టాగ్‌లు!

కీసర టోల్‌గేట్ వద్ద బారులు తీరిన వాహనాలు. (ఇన్‌సెట్) హ్యాండ్ మెషిన్‌తో స్కానింగ్

3

# పౌరసత్వ సవరణపై జామియా రణరంగం


ఢిల్లీలో ఆందోళనకారులు నిప్పు పెట్టడంతో తగులబడుతున్న బస్సు

**ఢిల్లీలో విద్యార్థులు, ప్రజల నిరసన**

**3 బస్సులు.. 100కు పైగా బైకుల దహనం**

పోలీసుల లాఠీచార్జ్.. బాష్పవాయు ప్రయోగం

వర్సిటీలోకి ప్రవేశించి దాదాపు 100 మంది విద్యార్థుల్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు!

బెంగాల్‌లో 5 జిల్లాల్లో ఇంటర్నెట్‌పై నిషేధం

న్యూఢిల్లీ/ కోల్‌కతా/గువాహటి, డిసెంబరు 15: పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా హోరెత్తిన నిరసన ప్రదర్శనతో.. ఢిల్లీలోని జామియా మిలియా యూనివర్సిటీ రణరంగంలా మారింది. విద్యార్థులు, ప్రజలు కలిసి

మిగతా 12వ పేజీలో...

### హింస వెనుక విపక్షాలు



మా నిర్ణయం 1000% కరెక్ట్: మోదీ

అవసరమైతే చట్టంలో మార్పులు: షా



## ఉల్లి సాగుతో కోటీశ్వరుడు!

**అప్పుల రైతు దశ మారింది**

**15 లక్షల పెట్టుబడి.. 20 ఎకరాల్లో సాగు**

**240 టన్నుల దిగుబడి.. 1.68కోట్ల రాబడి**

**అప్పులు తీర్చి ఇల్లు కట్టుకుంటానన్న రైతు**

బెంగళూరు, డిసెంబరు 15: ఉల్లి ధరలు సామాన్యుడి కంట నీళ్లు తెప్పిస్తున్నాయిగానీ.. అప్పుల్లో ఉన్న ఒక రైతు పంట పండించాయి! నెల రోజులు తిరిగేలోపు కోటీశ్వరుణ్ని చేసేశాయి!! కర్ణాటకకు చెందిన మల్లికార్జున అనే రైతు కథ ఇది. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా దొడ్డసిద్దవ్వనహళ్లికి చెందిన మల్లికార్జున (42).. చాలామంది రైతుల్లాగానే అప్పు చేసి సాగు చేసే సేద్యగాడే! కొన్నాళ్ల క్రితం తన జీవితంలోనే అత్యంత సాహసోపేత నిర్ణయం

మిగతా 12వ పేజీలో...

## 31 లోపు ఆధార్-పాన్ లింక్ తప్పనిసరి

న్యూఢిల్లీ, డిసెంబరు 15: డిసెంబరు 31లోపు పాన్ నెంబరును ఆధార్‌కార్డుతో తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలని ఆదాయపన్ను శాఖ ప్రకటన విడుదల చేసింది. పాన్-ఆధార్ అనుసంధానానికి గడువును ఇప్పటికే అనేకసార్లు పొడిగించారు. తాజాగా డిసెంబరు 31ని డెడ్‌లైన్‌గా నిర్ణయించారు. పాన్ నెంబరును 56768కి ఎస్ఎంఎస్ చేయడం ద్వారా, ఆదాయపన్ను శాఖ వెబ్‌సైట్ incometaxindiaefiling.gov.in ద్వారా ఆధార్ కార్డుకు అనుసంధానం చేసుకోవచ్చు.

# డీఎస్సీ నియామకాలు ఇంకెప్పుడు?



ఎదురుచూపులు

## నోటిఫికేషన్ ఇచ్చి ఏడాది దాటినా పట్టదు

- కోర్టు కేసులు సాకుగా చూపుతూ కాలయాపన
- నెలల తరబడి సాగదీత
- క్లియర్‌గా ఉన్న 6 వేలకుపైగా పోస్టులు
- మొత్తం ఒకేసారి చేస్తామంటూ సాకులు

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీచర్ పోస్టుల భర్తీ విషయంలో ప్రభుత్వ వైఖరి పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవసరమైన సంఖ్యలో టీచర్లు లేక పాఠశాలలు సతమతమవుతున్నా... విద్యార్థులకు అరకొర బోధనే జరుగుతోందని తెలిసినా నియామకాలు చేపట్టేందుకు చిత్తశుద్ధి చూపడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం 2018 అక్టోబరు 26న డీఎస్సీ-2018 నోటిఫికేషన్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, మున్సిపల్, రెసిడెన్షియల్, వెల్ఫేర్, మోడల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న దాదాపు 7,902 టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఈ ప్రకటన ఇచ్చింది. విద్యార్హతలతో పాటు రకరకాల కారణాలతో అభ్యర్థులు కోర్టుకెక్కారు. గత ప్రభుత్వ హయాంలోనే చాలా కేసులు ఓ కొలిక్కి వచ్చాయి. చిన్న, చిన్న కేసులు కొన్ని ఇంకా పరిష్కారం కాలేదు. ఈలోగా సాధారణ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారటం వంటి పరిణామాలు జరిగాయి. ఏ ప్రభుత్వం వచ్చినా టీచర్ పోస్టులను భర్తీచేయాలి. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు అభ్యర్థుల నుంచి వినిపిస్తున్నాయి. నోటిఫికేషన్ విడుదలై ఏడాదికిపైగా గడిచినా నియామకాలు చేపట్టకుండా అధికార యంత్రాంగం దోబూచులాడుతోందని

మిగతా 9వ పేజీలో...



## 500 డీఎడ్ కాలేజీలు క్లోజ్?!

10

**కన్వీనర్ కోటాలో 21% సీట్లే భర్తీ**

సెమిస్టర్‌తో అడ్మిషన్ల మందగమనం

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని ప్రభుత్వం

కాలేజీలు నడపలేం: యాజమాన్యాలు






## నేడు సభకు ఇంగ్లిష్ మీడియం బిల్లు



2


కాపు పిక్నిక్‌లో ప్రసంగిస్తున్న విజయసాయిరెడ్డి

## కాపుల పిక్నిక్కా వైసీపీదా..?

ఆత్మీయ సమావేశంలో నేతల ఆగ్రహం

వేదికపై సాయిరెడ్డికి చోటుపై అభ్యంతరం

మంత్రి ముత్తంశెట్టిపై తీవ్ర అసహనం

తానూ కాపునేనన్న వైసీపీపీ నేత

నెల్లూరులో రెడ్లను కాపులంటారని వ్యాఖ్య

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాపుల ఆత్మీయ సమావేశంలో వైసీపీ సీనియర్ నేత, పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి పాల్గొనడంపై వివాదం చోటుచేసుకుంది. ఇతర కులాల వారిని ఆహ్వానించడంతోపాటు వేదికపైకి ఎక్కించి జ్యోతి ప్రజ్వలన చేయించడం పట్ల కార్యక్రమానికి హాజరైన వారంతా అభ్యంతరం వ్యక్తంచేశారు. అందుకు కారణం మీరేనంటూ మంత్రి ముత్తంశెట్టి (అవంతి) శ్రీనివాసరావును చుట్టుముట్టి నినాదాలు చేశారు. విశాఖ జిల్లాలోని కాపు, తెలగ, బలిజ, తూర్పుకాపు, మున్నూరుకాపు, ఒంటరి కులాలకు చెందిన వారంతా కాపుసేన ఆధ్వర్యంలో కంబాలకొండ వద్ద ఆదివారం

మిగతా 2వ పేజీలో...



10

## సీఎం గారూ.. తక్షణమే తేల్చండి!

సీపీఎస్‌పై కాలయాపన తగదు

టక్కర్ నివేదిక ప్రకారం వెంటనే రద్దు: జేఏసీ



పరంజ్యోతి

# పుణ్యకాల ద్వారం.. ధనుర్మాసం



ఆరోగ్యకారకుడైన సూర్యుడు ధనూరాశిలో ప్రవేశించే పుణ్యకాలం 'ధనుర్మాసం'. రాత్రి సమయం దీర్ఘంగా ఉంటూ పగటి సమయం తక్కువగా ఉండే శీతాకాలం.. సాయం సంధ్య వేళ మొదలుకొని బ్రాహ్మీ ముహూర్తం వరకూ సాధనకు అనువైన మాసం. గోదాదేవి ఈ మాసంలోనే తన పూల అర్చనలతో, పాశురాలతో విష్ణువును అర్చించింది. ఆధునిక కాలంలో పరమపవిత్రమైన అయ్యప్పదీక్ష సింహభాగం ఈ మాసంలోనే చేస్తారు. ధనూరాశిలో రవి ఉండే ఈ కాలం సౌరమానరీత్యా 'ధనుర్మాసం'గా పేరొందింది. ఈ రాశిలో మూల-పూర్వాషాఢ-ఉత్తరాషాఢ మొదటిపాదాల నక్షత్రాలు సంచరిస్తాయి. రవి దేహకారకుడు. మనిషి శరీరం, ఆరోగ్యంపై ఆయన ప్రభావం చూపిస్తాడు. పోషణ వస్తువులకు సూర్యుడే శక్తిగా మారతాడు. ధనస్సు రాశిలోని మూలా నక్షత్రం ప్రభావం వల్ల రవి సూక్ష్మతత్వం పొంది ప్రార్థన, పారాయణకు కారణభూతుడవుతాడు. మూల.. కేతు నక్షత్రం కావడం వల్ల మోక్షమార్గానికి దారిపడుతుంది. పూర్వాషాఢ శుక్రుని నక్షత్రం. ఉత్తమత్వాన్ని కలిగించే గ్రహం. అలాగే ఉత్తరాషాఢ సూర్య నక్షత్రం. ఈ మూడూ నిరుతి, విశ్వదేవ, బ్రహ్మ అధిదేవతలుగా కలిగిన నక్షత్రాలు. ఇవన్నీ మనిషి అంతర్ముఖుడు అయ్యేందుకు దోహదపడే కారకాలు. అయితే వీటిని నడిపించే 'విష్ణుతత్వం', ఈ మాసానికి మూలకేంద్రం.

విష్ణుతత్వ సాధనకు అనుగుణమైన వాతావరణం ఈ మాసంలో ఉండి, సాత్విక శక్తులకు దారిని ఏర్పరుస్తుంది. అందువల్ల 'ఆహార శుద్ధౌ సత్వశుద్ధి' అన్నట్లుగా దాని సాధనకు తగినట్లు ఆహార నియమాలను భారతీయ ధర్మ శాస్త్రాలు, ఆయుర్వేదం నిర్దేశించాయి. ఇది విష్ణుప్రీతికర మాసం అయినందున ప్రధానంగా విష్ణువు ఆరాధన ఉంటుంది. ఈ మాసంలో విష్ణు సహస్రనామ, భాగవత పారాయణం చేయడం మంచిది. ఇక.. ధనుర్మాసంలో స్త్రీలు ప్రభాతకాలంలో ముంగిళ్లలో కళ్లాపు జల్లి, ముగ్గులు తీర్చి, వాటి మధ్య ఆవుపేడతో చేసిన గొబ్బిళ్లు పెడతారు. తమిళ, కేరళ ప్రాంతాల్లో ఆచరించే కాత్యాయనీ వ్రతమే తెలుగు ప్రాంతంలో గొబ్బి పూజగా మారిందని చెప్తారు. "సుబ్బీ గొబ్బెమ్మా".. అంటూ యువతులు గొబ్బి తట్టడం ఆచారం. ఈ గొబ్బిళ్లు భూగోళానికి ప్రతీకగా చెప్తారు. పసుపు రంగుల బీరపూల అలంకారం ప్రకృతికి సూచిక.

మానవులకు సకల సదుపాయాలు కల్పించే భూదేవిని అర్చించేదే గొబ్బిపూజ. చుట్టూ తిరగడం అంటే భూమి చుట్టూ ప్రదక్షిణ చేయడమే. అయితే ఈ ధనుర్మాసోత్సవాలు శైవ, వైష్ణవ భేదాలు లేకుండా అనాది నుండి నడుస్తున్నట్లు ఎందరో పరిశోధకులు తేల్చారు. కాబట్టే శైవ, వైష్ణవ సంప్రదాయాల్లో కన్పించే అయ్యప్ప ఆరాధన, శివుని నిర్గుణతత్వం వైపు తీసుకెళ్లే శివరాత్రి ఆరాధనకు ఈ మాసంలోనే బీజం పడుతుంది. ముఖ్యంగా మార్గళివ్రతం ద్వారా గోదాదేవి ఈ మాసంలో 'విష్ణుతత్వం' చేపట్టి తన పాశురాల్తో స్వామిని మెప్పించి ఆయనలో ఐక్యం అయ్యింది.

- డా॥ పి.భాస్కరయోగి

(నేటి నుంచి ధనుర్మాసం ఆరంభం)



రంపచోడవరం మండలం ఫోక్సుపేట పంచాయతీ కార్యాలయం ముందు ఉన్న గాంధీజీ విగ్రహానికి వైసీపీ రంగు వేసిన దృశ్యం

## మహాత్మా గాంధీ విగ్రహానికీ
# వైసీపీ రంగు

రంపచోడవరం, డిసెంబరు 15: జాతిపిత మహాత్మా గాంధీపై కూడా వైసీపీ రంగు పడింది. తూర్పుగోదావరి జిల్లా రంపచోడవరం మండలం ఫోక్సుపేట పంచాయతీ కార్యాలయానికి రంగులువేసిన వారు ఆ కార్యాలయం ముందు ఉన్న మహాత్మా గాంధీ విగ్రహంచుట్టూ ఉన్న సిమెంట్ దిమ్మెకు అదే రంగును వేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఎస్.. బాస్!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న రంగులను ఆయా భవనాలకు వేయాలని మెమో జారీచేశారు. ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులు వేయకూడదని ఐఏఎస్ అధికారి అయిన కమిషనర్‌కు, ఇంజనీర్‌గా సుదీర్ఘ అనుభవమున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీకి తెలియనిది కాదు. త్వరలో స్థానిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో వైసీపీ రంగులు ప్రభుత్వ కార్యాలయాలకు వేస్తే ఈసీ అభ్యంతరం చెబుతుందని.. వాటన్నిటినీ చెరిపివేయిస్తుందని వారికి తెలుసు. ప్రభుత్వ పెద్దలు ఆ మేరకు ఆదేశించినా వారికి నచ్చజెప్పి ఇలాంటి చర్యలను నియంత్రించే అవకాశమున్నప్పటికీ ఆ పని చేయలేదు. గత ప్రభుత్వంలో ఈ శాఖలో పనిచేసిన ఐఏఎస్ అధికారుల తీరు, ఇప్పటివారి శైలి చూస్తే వ్యత్యాసం తేటతెల్లమవుతోంది.

**వారలా.. వీరిలా..**

2014కి ముందు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శిగా రెడ్డి సుబ్రమణ్యం పనిచేశారు. అప్పట్లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. గ్రామాల్లో ఉపాధి మెటీరియల్ పనులు చేపట్టేందుకు వర్క్స్ కమిటీలకు అవకాశమివ్వాలని ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఒత్తిడి తెచ్చారు. ఎక్కువ మంది సర్పంచ్‌లు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఉన్నారన్న ఉద్దేశంతో తమపార్టీ వారికి పనులు దక్కించుకునేందుకు వారిలా వ్యవహరించారు.ఉపాధి పథకం పూర్తిగా గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో చేపట్టాల్సి ఉన్నందున.. చట్ట వ్యతిరేకమవుతుందని రెడ్డి సుబ్రమణ్యం అంగీకరించలేదు. ప్రజాప్రతినిధులకు నచ్చజెప్పారుకూడా. 2014లో నవ్యాంధ్రలో టీడీపీ ప్రభుత్వం వచ్చాక.. చింతకాయల అయ్యన్నపాత్రుడిని ఈ శాఖ మంత్రిగా నియమించారు. గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల అవినీతి ఎక్కువైందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో నియమించినవారు రాజకీయంగా బలపడ్డారని... వారిని తొలగించాలని పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఆయనకు మొరపెట్టుకున్నారు. దీనిపై అప్పటి కమిషనర్ శశిభూషణ్‌కుమార్‌తో మంత్రి చర్చించారు. ప్రస్తుతం ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, వారి కృషితోనే రాష్ట్రానికి ఏటా అవార్డులు వస్తున్నాయని, పైగా ఇప్పుడు క్షేత్రస్థాయి సిబ్బందిని తొలగిస్తే కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేస్తుందని.. నిధుల ప్రవాహం తగ్గిపోతుందని శశిభూషణ్ చెప్పారు. దరిమిలా ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించడం వీలుకాదని అయ్యన్న అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యేలకు, ప్రజాప్రతినిధులకు తేల్చిచెప్పారు. అదీ ఆ అధికారుల నిబద్ధత. సీఎంగా జగన్మోహన్ రెడ్డి పగ్గాలు చేపట్టాక.. సరిగ్గా అందుకు భిన్నంగా జరిగింది. ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించాలని ఎక్కడికక్కడ డ్వామా పీడీలపై ఒత్తిడి తెచ్చి తీసేశారు. ఆ స్థానాల్లో వైసీపీ కార్యకర్తలను నియమించుకున్నారు. చాలా చోట్ల అధికారులే అత్యుత్సాహం చూపి మీ మనుషులను తీసుకురండి.. ఇప్పుడున్నవాళ్లను తొలగిద్దామంటూ స్థానిక నేతలకు సూచనలు ఇస్తుండడం గమనార్హం. నేతల ప్రాపకం కోసం అధికారులు ఇలాంటి సలహాలిస్తున్నారని విమర్శలొస్తున్నాయి.

**ఉపాధి నిధుల మళ్లింపు..**

ఉపాధి హామీ పథకంలో గత ప్రభుత్వంలో మాజీ సర్పంచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామాల్లో భారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దీనికి సంబంధించిన నిధులను కేంద్రం ఇటీవల విడుదల చేసింది. అయితే బకాయిలు చెల్లించకుండా జగన్ ప్రభుత్వం ఆ నిధులన్నిటినీ ఇతర అవసరాలకు మళ్లించింది. గ్రామాల్లో ఈ బకాయిలు చెల్లించకపోతే ఇక ఉపాధి పనులు నిర్వహించడం సాధ్యం కాదని ప్రభుత్వ పెద్దలకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు నచ్చజెప్పలేకపోయారు. దీంతో ఇప్పుడు గ్రామాల్లో ఉపాధి పథకంలో గ్రామ సచివాలయాల నిర్మాణాలు చేపట్టడానికి ఎవరూ ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

## ఆరు నెలలు ఆపేసి..

గ్రామాల్లో ఆరు నెలలపాటు అభివృద్ధి పనులు ఆపేసిన జగన్ ప్రభుత్వం ఇప్పుడు ఉన్నట్లుండి ఉపాధి పథకం వేగవంతం చేసే పనిలో పడింది. ఈ క్రమంలో ఆ పథకం నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఈ పథకం కింద మార్చి లోపు సుమారు రూ.2 వేల కోట్ల మేర మెటీరియల్ కాంపోనెంట్ నిధులు వినియోగించుకునేందుకు మన రాష్ట్రానికి అవకాశముంది. దీంతో భవన నిర్మాణ పనులు, సిమెంట్ రోడ్లు తదితర నిర్మాణ పనులు చేపట్టాలి. అందుకు విరుద్ధంగా మట్టి పనులకు మెటీరియల్ నిధులు ఖర్చు చేసేందుకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.700 కోట్లతో పేదల ఇళ్ల స్థలాలను చదును చేసేందుకు ఉపాధి నిధులు ఖర్చుచేయాలని నిర్ణయించారు. ఈపథకం కింద ఇళ్ల స్థలాల చదునుకు కేంద్రం అనుమతించింది. ఇళ్ల స్థలాలను, పాఠశాలల మైదానాలను చదును చేసేందుకు పూర్తిగా కూలీలను వినియోగించాలని నిబంధనలున్నాయి. ట్రాక్టర్లకు లోడింగ్, అన్‌లోడింగ్‌కు కూలీలను వినియోగించి, ట్రాక్టర్ల అద్దె మాత్రం మెటీరియల్ నిధులతో చేపట్టాలి. ఇందుకు భిన్నంగా ఇప్పుడు గ్రామీణాభివృద్ధి అధికారులు ఇళ్ల స్థలాల చదునును పూర్తి మెటీరియల్ నిధులతో చేపట్టాలని నిర్ణయించారు. మార్చిలోపు వీలైనన్ని మెటీరియల్ నిధులను వాడుకోవాలనే ఉద్దేశంతో ఈ పనులు చేపడుతున్నారు. గ్రామాల్లో వైసీపీ కార్యకర్తలు కాంట్రాక్టర్లుగా మారి ఇప్పటికే అంచనాల రూపకల్పనలో బిజీగా ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని అధికారులు దగ్గరుండి మరీ ప్రోత్సహిస్తున్నారు. కూలీలు చేయాల్సిన పనులకు భారీ ఎత్తున మెటీరియల్ నిధులు వినియోగిస్తే కేంద్రం అభ్యంతరం వ్యక్తం చేయడంతో పాటు మెటీరియల్ నిధులు ఆపేసే అవకాశం ఉంది. అధికారులు ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులకు ఎందుకు చెప్పడం లేదో తెలియడం లేదు. కొత్త ప్రభుత్వంలో కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు కొంత దూకుడుగా వ్యవహరించినా.. నిబంధనలు అతిక్రమించకుండా సమన్వయం చేయాల్సింది అధికారులే కదా! వారు తమ బాధ్యతను నిర్వర్తించడం లేదని తోటి అధికారులే అభిప్రాయపడుతున్నారు.



## కాటేసిన కరెంటు!

▸▸ విద్యుదాఘాతంతో కాడెద్దులు, రైతు మృతి

ప్రొద్దుటూరు, డిసెంబరు 15: పొలంలో కలుపు తీస్తుండగా, ప్రమాదశాత్తూ విద్యుత్ తీగలు తగిలి కాడెద్దులతో పాటు ఓ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. కడప జిల్లా రాజుపాళెం మండలం అర్కటవేముల వ్యవసాయ క్షేత్రంలో ఈ విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నడిపి గురివిరెడ్డి (62)కి బండలాగుడు పోటీలంటే ఇష్టం కావడంతో ఒంగోలు గిత్తలను కొనుగోలు చేశాడు. సేద్యం పనులు కూడా వాటితోనే చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో మినప చేనులో కలుపు నివారణ పనులు చేసేందుకు ఆదివారం తెల్లవారుజామున ఇనుప ఫ్రేంతో తయారు చేసిన నాగలి(ఇనుప గుంటక) కట్టి ఎద్దులను పొలంలోకి తోలుకువెళ్లాడు. ఆ సమయంలో ఒక్కసారిగా ఎద్దులు బెదిరి గట్టుమీదకు ఎక్కాయి. దీంతో పైనున్న విద్యుత్తు వైర్లకు నాగలి తగిలి విద్యుత్ షాక్ కొట్టింది. గురివిరెడ్డితోపాటు, రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి.

## మరదలిపై తుపాకీ!

▸▸ 'రైతుభరోసా'లో వాటా అడిగినందుకు అఘాయిత్యం



నిందితుడు కృష్ణ

పాడేరురూరల్, డిసెంబరు 15: రైతుభరోసా నిధుల్లో తమకు రావాల్సిన వాటా ఇవ్వాలని కోరిన మరదలిపై ఆమె బావ నాటు తుపాకీతో కాల్పులు జరిపాడు. విశాఖపట్నం జిల్లా హుకుంపేట మండలం రంగశీల గ్రామంలో కలకలం రేపిందీ ఘటన. హుకుంపేట ఎస్‌ఐ అప్పలనాయుడు కథనం ప్రకారం.. కిల్లు కృష్ణ, బలరాం అన్నదమ్ములు. వీరి పేరిట భూమి పట్టా ఉండడంతో ఇటీవల రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన రైతుభరోసా నిధులు అధికారులు కృష్ణ ఖాతాలో జమచేశారు. అందులో తమ వాటా ఇవ్వాలని కృష్ణను బలరాం భార్య కొండమ్మ కోరింది. దానికి అతడు అంగీకరించకపోవడంతో మాటామాటా పెరిగింది. కోపంగా ఇంట్లోకి వెళ్లిన కృష్ణ నాటు తుపాకీ తీసుకొచ్చి మరదలిపై కాల్పులు జరిపాడు. ఉలిక్కిపడిన ఇరుగుపొరుగు వారు బయటికి వచ్చేసరికి కృష్ణ పారిపోయాడు. తీవ్రగాయాలపాలైన కొండమ్మను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఆమె శరీరంలో తూటాలు ఉండిపోవడంతో పరిస్థితి విషమంగా ఉందని గుర్తించిన వైద్యులు హుటాహుటిన విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. నిందితుడు కృష్ణ ఆదివారం రాత్రి స్టేషన్‌కు వచ్చి లొంగిపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## మాతృభాషను విస్మరించొద్దు

▸▸ ఆంగ్లంతో ఉద్యోగాలు వస్తాయనుకోవడం భ్రమ

▸▸ దేశంలో మితిమీరిన రాజకీయ అరాచకత్వం

▸▸ సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత మంగలేశ్ దబ్రాల్



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): హిమాలయ పర్వత సానువుల్లో పుట్టి, పెరిగి హిందీ సాహితీ లోకంలో ఒక ప్రత్యేక స్థానాన్ని పొందిన ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్టు, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత మంగలేశ్ దబ్రాల్. ఒక సమావేశంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులతో పాటు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టనుండటంపై తన అభిప్రాయాలను సూటిగా వ్యక్తంచేశారు. "దేశానికి మహాకవి శ్రీశ్రీ వంటి గొప్ప సాహితీవేత్తను అందించిన తెలుగు ప్రాంతానికి రావడం చాలా ఆనందంగా ఉంది. నేను ఇక్కడికి రావడం ఇదే తొలిసారి. అయితే తెలుగు సాహిత్యంతో నాకున్న అనుబంధం ప్రత్యేకమైంది. 'మహాప్రస్థానం' ఆంగ్ల అనువాదం చదివాను. భారతీయ సాహితీ రంగాన్ని ప్రభావితం చేసిన సంస్థల్లో విరసం ప్రముఖ పాత్ర పోషించిందనడంలో సందేహం లేదు. కేంద్రంలో కొలువుదీరిన నేతలకు హిందీ తప్ప మిగతా భారతీయ భాషల గురించి అవగాహన లేదనిపిస్తోంది. దేశంలో 23 అధికార భాషలున్నాయి. లిపి ఉన్న భాషలు దాదాపు 300కుపైనే. ఇక వెయ్యికిపైగా భాషలకు లిపి లేదు. వాటన్నింటినీ విస్మరించి హిందీని మిగతా ప్రాంతాలపై రుద్దే ప్రయత్నం చేయడం పద్ధతికాదు. ఏపీ ప్రభుత్వం పాఠశాల విద్యలో పూర్తిగా ఆంగ్ల భాషా మాధ్యమాన్ని ప్రవేశపెడుతున్నట్లు తెలిసింది. ప్రతి విద్యార్థికీ ఆంగ్లభాషా నైపుణ్యం అత్యవసరం. అలాగని మాతృభాషను విస్మరించడం తగదు. అలా చేయడం మన అస్తిత్వాన్ని మనమే చేజేతులా చెరిపేసుకున్నట్టే. విద్యాబోధనలో మూడు భాషల ఫార్ములాను పాటిస్తే బావుంటుంది. మాతృభాషా బోధనను విస్మరించడం ఒక అనాలోచిత చర్య. ఇంగ్లీషు వస్తే ఉద్యోగాలు వస్తాయనుకోవడం భ్రమ. దీనివల్ల పేదరికం తగ్గుముఖం పడుతుందనుకోవడం కూడా అపోహే.'

### నేడు సభకు ఇంగ్లిష్ మీడియం బిల్లు

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియాన్ని చట్టబద్ధం చేసే బిల్లును ప్రభుత్వం సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిసింది. వచ్చే విద్యాసంవత్సరం నుంచే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఆరో తరగతి వరకూ ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఆపై దశలవారీగా పదో తరగతి వరకూ దీనిని అమలు చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయం. దీన్ని చట్టబద్ధం చేయడానికి విద్యాశాఖ ముసాయిదా బిల్లును రూపొందించింది. దీనిపై శనివారం సీఎం జగన్ వద్ద సమీక్ష జరిగినట్లు తెలిసింది. ఇంగ్లిష్ మీడియంపై పలువురు విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, రాజకీయపార్టీల ప్రతినిధులు హైకోర్టులో పిల్ దాఖలుచేశారు. ఇంగ్లిష్ మీడియంపై అభ్యంతరాలతోపాటు, తెలుగుభాషను కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. వీటిలో తెలుగు లాంగ్వేజ్ తప్పనిసరి చేయాలన్న డిమాండ్ ఉంది. ఈ అంశాన్ని బిల్లులో పొందుపరచాలని సీఎం ఆదేశించినట్లు తెలిసింది. ఒకటి నుంచి ఆరో తరగతి వరకూ ఇంగ్లిష్ మాధ్యమం ఉన్నా, తెలుగు భాష అనేది ఒక ప్రత్యేకమైన సబ్జెక్టుగా తప్పనిసరి చేస్తూ బిల్లులో పొందుపరిచినట్లు సమాచారం.

# కాపుల పిక్నిక్కా.. వైసీపీదా..?

(మొదటి పేజీ తరువాయి)

ఆత్మీక కలయిక పేరుతో పిక్నిక్ ఏర్పాటుచేసుకున్నారు. దీనికోసం పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ఉదయం పది గంటల నుంచే నగరంతోపాటు రూరల్ ప్రాంతం నుంచి కాపులంతా అక్కడకు చేరుకున్నారు. రిటైర్డ్ డీజీపీ సాంబశివరావు తదితరులు హాజరై ప్రసంగించారు. సరిగ్గా 12 గంటల సమయంలో మంత్రి ముత్తంశెట్టి అక్కడకు చేరుకున్నారు. ఆయనతోపాటు ఎంపీ విజయసాయిరెడ్డి, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయ్‌ప్రసాద్, వైసీపీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణశ్రీనివాస్ తదితరులు నేరుగా వేదికపైకి ఎక్కి కుర్చీల్లో కూర్చున్నారు. ఈ క్రమంలో విజయసాయిరెడ్డితో మంత్రి జ్యోతిప్రజ్వలన చేయించడంతో అక్కడున్న వారంతా తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. 'ఇది కాపుల పిక్నిక్కా లేక వైసీపీ పిక్నిక్కా...' అంటూ ఆందోళనకు దిగారు. 'రాజకీయ లబ్ధి కోసం కాపులు కాని వారిని వేదికపై కూర్చోబెట్టి, కాపులను అవమానపరుస్తారా? వారిని తక్షణం కిందికి దింపాలి' అని కాపు యూత్ శ్రేణులతోపాటు మరికొందరు నినాదాలు చేశారు. విజయసాయిరెడ్డి మైక్ తీసుకుని 'నేను కూడా కాపునే. నెల్లూరు జిల్లాలో రెడ్లను కాపులుగానే పిలుస్తారు. నా పదో తరగతి సర్టిఫికెట్‌పై ఓసీ కాపు అని ఉంటుంది. కావాలంటే చెక్ చేసుకోండి' అని అన్నారు. అయినా నిరసనలు ఆగకపోవడంతో కొద్దిసేపు ఉండి ఆయన వెళ్లిపోయారు.

**మంత్రిని కాబట్టే సహనంగా ఉన్నా...**

విజయసాయిరెడ్డిని కారు ఎక్కించిన మంత్రి తిరిగి వేదిక వద్దకు వస్తున్నపుడు కూడా కొంతమంది నిరసన తెలుపుతూ నినాదాలు చేస్తూ ఆయన్ను చుట్టుముట్టారు. దీనిపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వేదికపైకి వెళ్లి మైకు తీసుకుని ఆవేశంగా మాట్లాడారు. 'జిల్లాలో 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు గెలిస్తే ఒక్కడికి.. అదీ అవంతి శ్రీనివాసరావుకే మంత్రి పదవి ఇచ్చారు. అర్థమైందా? అదీ నేనంటే. మంత్రి పదవిలో ఉన్నాను కాబట్టే సహనంతో ఉంటున్నాను. బ్యాక్‌గ్రౌండ్ లేక కాదు. దయచేసి నా సహనాన్ని పరీక్షించకండి. రిజర్వేషన్లు, ఇంకొకటి మాట్లాడడానికి ఇది కరెక్టు సమయం కాదు' అని అన్నారు. అయినా నిరసనలు ఆగలేదు. ఈ సందర్భంగా పలువురు 'జై కాపు... వంగవీటి మోహన్‌రంగా అమర్ రహే...', 'గుడివాడ గురునాథరావు అమర్ రహే...' అని నినాదాలు చేస్తూ వారిద్దరూ ఉన్న ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. గందరగోళం నేపథ్యంలో చాలామంది మధ్యాహ్నం భోజనం కూడా చేయకుండానే వెనుదిరిగారు.



ఒంగోలులోని కొత్తపట్నం రైతు బజారు వద్ద బారులు తీరిన ప్రజలు

### ఉల్లి.. సొమ్మసిల్లి

ఉల్లి కష్టాలు కొనసాగుతున్నాయి. ధర దిగిరాకపోవడంతో సబ్సిడీపై ప్రభుత్వం ఇచ్చే ఉల్లిపాయల కోసం ప్రజలు రైతు బజార్ల వద్ద బారులు తీరుతున్నారు. వణికించే చలిలో వేకువజాము నుంచే వేచి ఉంటున్నారు. ఆదివారం ఒంగోలు కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని రైతుబజారు వద్దకు ఓ మహిళ వచ్చారు. వేకువజాము నుంచే లైనులో నిల్చున్న ఆమె ఉదయానికి నీరసంతో కళ్లు తిరిగి కింద పడిపోయింది. అక్కడున్న వారు ఆమెకు సపర్యలు చేశారు. కొంతసేపటికి తేరుకున్న ఆ మహిళ ఉల్లిపాయలు కొనుగోలు చేయకుండానే ఇంటిబాట పట్టింది.

- ఒంగోలు (కార్పొరేషన్)

## లోకం తీరు




### చలికాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| అనంతపురం | 18.0 | 29.7 |
| గుంటూరు | 18.1 | 30.3 |
| హైదరాబాద్ | 19.2 | 29.0 |
| విశాఖపట్నం | 19.2 | 30.2 |
| విజయవాడ | 21.2 | 30.0 |
| నెల్లూరు | 23.5 | 30.6 |

### దక్షిణకోస్తా, రాయలసీమలో వర్షాలు

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతం నుంచి తమిళనాడు, దానికి ఆనుకుని రాయలసీమ, కోస్తాపైకి తూర్పుగాలులు వీస్తున్నాయి. వీటి ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో మేఘాలు ఆవరించాయి. దక్షిణకోస్తా, సీమలో వర్షాలు కురిశాయి. ఆదివారం ఉదయం వరకు సత్యవేడులో 6, తొట్టెంబేడు, శ్రీకాళహస్తి, చిత్తూరులో 3సెం.మీ. వర్షపాతం నమోదైంది. నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి పడమర దిశగా పయనించి ఆదివారానికి మాల్దీవుల వద్ద కేంద్రీకృతమై ఉంది. బంగాళాఖాతంనుంచి తేమగాలులు వీస్తుండడంతో రానున్న 24గంటల్లో కోస్తా, సీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని, మేఘాలు ఆవరించడంతో రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా 1-2 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది.



### అసోం.. నయా కశ్మీర్!

ప్రస్తుతం దేశంలో వ్యూహాత్మక కీలక ప్రాంతాలు రెండు. ఒకవైపు జమ్మూకశ్మీర్. మరోవైపు కొత్త కశ్మీర్.. అసోం!

- అధిర్ రంజన్ చౌధురి, కాంగ్రెస్ నేత



### పెద్దనోట్ల రద్దు లాంటిదే!

జాతీయ పౌరుల జాబితా(ఎన్‌ఆర్సీ)ను దేశవ్యాప్తంగా అమలు చేస్తామంటున్నారు. పౌరసత్వానికి సంబంధించి ఇది పెద్ద నోట్ల రద్దు లాంటిదే. అంతిమంగా బాధపడేది నిరుపేదలు, బడుగువర్గాలే.

- ప్రశాంత్ కిశోర్, రాజకీయ వ్యూహకర్త

### 3 వారాల్లో ఎముకలు అతికించే బ్యాండేజీ

న్యూయార్క్, డిసెంబరు 15 : విరిగిన ఎముకలు మూడువారాల్లోనే అతుక్కునేలా చేయగల సరికొత్త బ్యాండేజీని అమెరికాలోని డ్యూక్ వర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధిచేశారు. సాధారణంగా.. విరిగిన ఎముకల భాగాన్ని శరీరంలోని వ్యాధి నిరోధక వ్యవస్థకు చెందిన 'అడినోసిన్' అనే జీవ అణువులు మోహరిస్తుంటాయి. అవి ఎంత ఎక్కువ సేపు గాయమైన ప్రదేశంలో ఉంటే అంత వేగంగా ఎముకలు పెరిగి, రక్తనాళాలకు అయిన గాయాలు మానుతాయి. అయితే ఎముకలు విరిగిన భాగాల్లో 'అడినోసిన్' అణువులు ఎక్కువ సమయం పాటు నిలవవు. కొత్తగా అభివృద్ధిచేసిన బ్యాండేజీలోని 'బోరోనేట్స్' అనే జీవపదార్థం, గాయమైన ప్రదేశంలో దీర్ఘకాలం పాటు ఉండేలా 'అడినోసిన్'ను నిలువరిస్తుంది. దీంతో విరిగిన ఎముకలు వేగంగా పెరిగి, క్షతగాత్రుడు అతి త్వరగా కోలుకుంటాడు.

### పదిగంటల ఆహార ఫార్ములాతో మధుమేహం, హృద్రోగాలకు చెక్!

వాషింగ్టన్, డిసెంబరు 15 : మధుమేహం, గుండె జబ్బులు దరిచేరవద్దని అనుకుంటున్నారా? అయితే రోజులో నిర్దిష్టంగా 10 గంటల సమయాన్ని కేటాయించుకొని.. ఆ వ్యవధిలోనే ఆహారం తినాలని అమెరికా వైద్యనిపుణులు సూచిస్తున్నారు. ఆహార నియమాలను పాటిస్తూనే, కంటినిండా నిద్ర, వైద్యుల సూచనల మేరకు మందుల వాడకం జరిగితే ఆరోగ్యపరమైన సత్ఫలితాలు ఉంటాయని చెబుతున్నారు. ఈవిధంగా చేసినవారిలో పొత్తి కడుపు, నడుము భాగాల్లో కొవ్వు పేరుకుపోయే రేటు గణనీయంగా తగ్గినట్లు అధ్యయనంలో గుర్తించారు. ఇవే ఆహార అలవాట్లు కొనసాగిస్తే దీర్ఘకాలంలో శరీర బరువు తగ్గి, రక్తపోటు, రక్తంలో చక్కెర మోతాదు అదుపులోకి వస్తాయన్నారు. ఫలితంగా గుండెజబ్బు, మధుమేహం ముప్పు తగ్గుతుందన్నారు.

# పలు రైళ్లు రద్దు

▸ ఈశాన్య రాష్ట్రాల్లో ఆందోళనల ప్రభావం...

విశాఖపట్నం/రాజమహేంద్రవరం, డిసెంబరు 15: కేంద్రం పౌరసత్వ సవరణ బిల్లు తీసుకొచ్చిన నేపథ్యంలో అసోం, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాలలో చెలరేగిన ఆందోళనల ప్రభావం రైళ్ల రాకపోకల మీద పడింది. ఈశాన్య ప్రాంతాలలో రైళ్లను దగ్ధం చేస్తుండటంతో శని, ఆదివారాలలో పలు రైళ్లు రద్దయ్యాయి. శనివారం ఏడు రైళ్లను రద్దు చేసిన సెంట్రల్ రైల్వే, ఆదివారం మరికొన్ని రైళ్లను రద్దుచేసింది. వివిధ ప్రాంతాల నుంచి బయలుదేరాల్సిన పూరీ-చెన్నై (22859), తిరుపతి-హౌరా (20890), హైదరాబాద్-హౌరా ఈస్ట్‌కోస్ట్ (18646), చెన్నై-పూరీ (22860), చెన్నై-హౌరా కోరమాండల్ (12842), సికింద్రాబాద్-గౌహతి (12513), యశ్వంత్‌పూర్-హౌరా దురంతో (12246), యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్ (12864), వాస్కోడిగామా-హౌరా (18048) ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు. అలాగే 16వ తేదీన యశ్వంత్‌పూర్-హౌరా (12246), చెన్నై-పూరీ ఎక్స్‌ప్రెస్ (22860), మైసూరు-హౌరా (22812), 17వ తేదీ ఎర్నాకుళం-హౌరా (22878) ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు.

## సినీనటి రేవతికి సావిత్రి అవార్డు

▸ కృష్ణ చైతన్యకు ఘంటసాల పురస్కారం


పురస్కారాలతో రేవతి, కృష్ణ చైతన్య

గుంటూరు(సాంస్కృతికం), డిసెంబరు 15: ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్ర వేసిన మహానటి సావిత్రి పురస్కారం అందుకోవడం ఆనందంగా ఉందని సినీనటి రేవతి అన్నారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మహానటి సావిత్రి, అమర గాయకుడు ఘంటసాల జీవిత సాఫల్య పురస్కారాల సభ ఆదివారం జరిగింది. సావిత్రి పురస్కారంతో రేవతిని, ఘంటసాల పురస్కారంతో గాయకుడు కృష్ణ చైతన్యను ఘనంగా సత్కరించారు. రేవతి మాట్లాడుతూ.. సావిత్రి పురస్కారం అందుకోవడం తన పూర్వ జన్మ సుకృతం అన్నారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఘంటసాల జీవిత చరిత్ర సినిమాలో ఘంటసాల పాత్ర ధరించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

## త్రిపురాంతకం నిందితుడికి 21 రోజుల్లో శిక్ష విధించాలి: లోకేశ్

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): "దిశ చట్టం ప్రకారం త్రిపురాంతకం ఘటన నిందితుడికి 21 రోజుల్లోనే శిక్ష పడేలా చూడాలి. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి" అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ డిమాండ్ చేశారు. ఆయన ఆదివారం ట్విటర్‌లో స్పందించారు. "జీవం పోసే ఆమెకు జీవించే హక్కుని హరిస్తున్నారు మృగాళ్లు. ప్రతిరోజు మహిళలపై జరుగుతున్న అత్యాచర ఘటనలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. దిశ బిల్లు ఆమోదం పొందిన రోజు ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో యువతిపై ఓ ఉన్మాది అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన నన్ను తీవ్రంగా బాధించింది. దిశ చట్టంపై ప్రజల్లో అవగాహన పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి" అని లోకేశ్ ట్వీట్ చేశారు.

## తక్కువ ధరకే బంగారమంటూ మోసం

▸ రూ.11లక్షలకు టోకరా

మంగళగిరి క్రైమ్, డిసెంబరు 15: తక్కువ ధరకే బంగారం విక్రయిస్తామంటూ ఓ వ్యక్తి నుంచి రూ.11 లక్షలు తీసుకుని పరారైన ఘటన గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరులో ఆదివారం జరిగింది. మంగళగిరి రూరల్ సీఐ శేషగిరిరావు కథనం మేరకు... పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన గారపాటి కుమార్ కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వారం రోజుల క్రితం ఓ గుర్తు తెలియని వ్యక్తి టీస్టాల్ వద్ద కుమార్‌తో పరిచయం పెంచుకున్నాడు. తనకు తెలిసిన వ్యక్తి మంగళగిరి వద్ద తక్కువధరకే బంగారం విక్రయిస్తుంటాడని చెప్పి కుమార్‌ను నమ్మించాడు. ఈ నేపథ్యంలో మంగళగిరి చేరుకున్న కుమార్ గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన మేరకు ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో మంగళగిరి మండలం ఆత్మకూరు-ఇప్పటం రోడ్డు వద్దకు చేరుకున్నాడు. అప్పటికే అక్కడ ఉన్న ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అనిల్ వద్ద ఉన్న రూ.11 లక్షలు తీసుకున్నారు. అదే సమయంలో మరో ముగ్గురు పోలీస్ యూనిఫాంలో అక్కడ ప్రత్యక్షమయ్యారు. వారందరూ కలిసి అనిల్‌ను బెదిరించి కారులో ఎక్కించుకుని జాతీయ రహదారి పక్కనే ఉన్న మిడ్‌వ్యాలీసిటీ వద్ద వదిలి విజయవాడ వైపు వెళ్లిపోయారు. మోసపోయాయని గ్రహించిన అనిల్ మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు.



చిల్లకల్లు టోల్‌గేట్ వద్ద నగదు వరుసలో వాహనాలు

ఫాస్టాగ్ లైనులో నిలిచిన వాహనాలు

## 'కృష్ణా' టోల్ ప్లాజాల్లో మొరాయించిన రీడర్లు

▸ తొలిరోజు తీవ్ర గందరగోళం

▸ ఫాస్టాగ్ లేన్లలోనూ నిలిచిన వాహనాలు

▸ రాష్ట్రవ్యాప్తంగా 55శాతం మాత్రమే ఫాస్టాగ్‌లు!

విజయవాడ (ఆంధ్రజ్యోతి), కంచికచర్ల, డిసెంబరు 15: ఫాస్టాగ్ అమలు తొలిరోజు వాహనదారులకు ఇక్కట్లు తప్పలేదు. ప్రధానంగా కృష్ణా జిల్లాలోని టోల్‌ప్లాజాల వద్ద ఆదివారం ట్యాగ్ రీడర్లు సరిగా పనిచేయకపోవటంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. వాహనాలు సాఫీగా వెళ్లే పరిస్థితి లేకపోవడంతో వాహనచోదకులు గోలగోల చేశారు. దీంతో.. టోల్ ప్లాజాల సిబ్బంది హ్యాండ్ మెషీన్లతో ట్యాగ్‌లను రీడ్ చేయాల్సి వచ్చింది. సాంకేతిక వ్యవస్థ సరిగా లేకపోవటంతో ఫాస్టాగ్ అంటించిన వాహనాలు కూడా లేన్లలో నిలిచిపోవాల్సి వచ్చింది. ముఖ్యంగా విజయవాడ నగరం చుట్టూ వలయం మాదిరిగా ఐదు టోల్‌ప్లాజాలున్నాయి. కలపర్రు, పొట్టిపాడు, దవులూరు, చిల్లకల్లు, కీసర టోల్‌ప్లాజాల్లో సింహభాగం ఫాస్టాగ్‌ను రీడింగ్ చేసే వ్యవస్థలు సరిగా పనిచేయకపోవటం వల్ల ఇబ్బందులు తలెత్తాయి. 65వ నంబరు జాతీయ రహదారిపై.. కీసర టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఈ మార్గంలో పెరిగిన వాహనాల రద్దీకి ఇక్కడున్న నాలుగు లైన్లు చాలటం లేదు. వీకెండ్స్‌లో రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల కలపర్రు, కీసర దగ్గర ఎప్పుడూ ఈ సమస్య ఉంటుంది. పైగా, ఈ టోల్ ప్లాజా కీసర గ్రామం మధ్యలో ఉండటంతో టోల్‌గేట్‌లో లైన్ల సంఖ్యను పెంచటానికి వీలు పడటం లేదు. ఒక లేన్ క్యాష్ లేనుగా ఉండటంతో.. ఫాస్టాగ్ లేన్‌లోకి వెళితే డబుల్ టోల్‌చార్జీ వసూలు చేస్తారన్న భయంతో.. క్యాష్ లేన్ మీద ఒత్తిడి పడింది. అయితే ఆ లైనులో వెళ్లిన వాహనాలకు.. మొదటి రోజు కావటంతో ట్యాగ్ లేనప్పటికీ నగదు తీసుకుని పంపిస్తున్నారు.

### జనవరి వరకు గడువు ఉన్నా..!

వాస్తవానికి కేంద్రం జనవరి వరకు గడువు పొడిగించింది. ఫాస్టాగ్ లేన్లలో కూడా క్యాష్ చెల్లించి వెళ్లే అవకాశం కల్పించింది. అయితే వాహనదారులకు ఈ సమాచారం తెలియక గందరగోళం తలెత్తుతోంది. అన్ని టోల్‌ప్లాజాల వద్ద క్యాష్ లేన్ ఒక్కటే ఉంచారు. చిల్లకల్లు టోల్‌గేట్‌లో రెండువైపులా ఏడేసి లైన్లు ఉండగా, ఆరు లైన్లను ఫాస్ట్‌టాగ్ చేశారు. దీంతో వాహనాలు ఆగకుండా వెంటనే ముందుకు సాగుతున్నాయి. నగదు లైన్లలో మాత్రం వాహనాలు బారులు తీరుతున్నాయి. గుంటూరు జిల్లా కాజా టోల్‌గేట్ దగ్గర మాత్రం అన్నీ క్యాష్ లేన్‌లే ఉన్నాయి. కాగా, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 55శాతం మాత్రమే ఫాస్టాగ్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. తొలిరోజు ఆలస్యానికి ఇదీ ఓ ప్రధానకారణం. నూరుశాతం సక్సెస్ కావాలంటే కేంద్రం కూడా తక్షణమే ఫాస్టాగ్‌ల కొరత నివారించాల్సిన అవసరం ఉందని వాహనదారులు సూచిస్తున్నారు.

## దేవుడికే శఠగోపం!

▸ పంచలోహ విగ్రహాలు చోరీచేసిన పూజారి

▸ ప్రభుత్వ ఉద్యోగి సహా నలుగురి అరెస్టు

పంచలోహ విగ్రహాలను పరిశీలిస్తున్న సీసీఎస్ డీఎస్పీ



ఒంగోలు(క్రైం), డిసెంబరు 15: దేవుడికే శఠగోపం పెట్టాలని చూసిన పూజారి కటకటాల పాలయ్యాడు. ప్రకాశం జిల్లా కొరిశపాడు మండలం తమ్మవరం కాశీవిశ్వేశ్వర స్వామి, రాచపూడిలోని చిదంబరేశ్వర దేవాలయాల్లో చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. ఆలయ పూజారితో పాటు మరో ముగ్గురిని అరెస్టుచేశారు. వారిలో ఒకరు ప్రభుత్వ ఉద్యోగి కాగా మిగిలిన ఇద్దరు కృష్ణాజిల్లాకు చెందినవారు. ఒంగోలు సీసీఎస్ డీఎస్పీ ఎ.ప్రసాద్‌కుమార్ కథనం మేరకు... క్రీ.శ.11-14 శతాబ్దంలో జిల్లాలో పలు శైవక్షేత్రాలు నిర్మించిన చోళులు వాటిలో పంచలోహ విగ్రహాలను ఉంచారు. తమ్మవరం కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయం, రాచపూడిలోని చిదంబరేశ్వర దేవాలయాల్లోనూ ఈ పురాతన విగ్రహాలు ఉన్నాయి. తమ్మవరం గ్రామానికి చెందిన తమ్మవరపు మల్లికార్జున, ఆయన సోదరుడు చలపతి ఈ గుళ్లల్లో పూజారులుగా చేస్తున్నారు. ఈ విగ్రహాలపై కన్నేసిన మల్లికార్జునరావు వాటిని విక్రయించి సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న సమయంలో గుప్తనిధుల కోసం అన్వేషించే అలవాటున్న ఒంగోలు డీఈవో కార్యాలయంలో అటెండర్‌గా పనిచేసే షిగినాల రాజేశ్‌తో పరిచయమైంది. కృష్ణాజిల్లా గుడివాడ కొత్త బైపాస్ వద్ద నివాసం ఉండే మహ్మద్ హిదయ్‌తుల్లా, రెడ్డిగూడేనికి చెందిన కొప్పుల ప్రసాదరావు కూడా వీరితో కలిశారు. నలుగురూ కలిసి గత నెల 21న చిదంబరేశ్వర ఆలయంలో వీరభద్రస్వామి, కాశీవిశ్వేశ్వర ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను చోరీ చేశారు. మరో పూజారి చలపతి ఫిర్యాదు మేరకు కొరిశపాడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. దొంగిలించిన విగ్రహాలను చెన్నైకి చెందిన వ్యక్తులకు విక్రయించేందుకు ఆదివారం ఒంగోలులోని దక్షిణ బైపాస్ వద్ద కారులో వేచి ఉన్న మల్లికార్జునరావుతో పాటు మిగిలిన ముగ్గురినీ అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద ఐదు విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు.

## ముగిసిన గొల్లపూడి అంత్యక్రియలు


నివాళులర్పిస్తున్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

చెన్నై, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దిగ్గజ నటుడు, రచయిత గొల్లపూడి మారుతీరావు పార్థివదేహానికి ఆదివారం అంత్యక్రియలు ముగిశాయి. ఆయనకి కుటుంబ సభ్యులు, పలువురు సినీ, తెలుగు ప్రముఖులు కన్నీటి వీడ్కోలు పలికారు. గురువారం ఉదయం మారుతీరావు కన్నుమూసిన విషయం తెలిసిందే. స్థానిక టి.నగర్‌లోని నివాసం నుండి అంతిమయాత్ర నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం కన్నమ్మపేట శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు. అంతకుముందు ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు, ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, సీనియర్ నిర్మాతలు ఏకాంబరేశ్వరరావు, కాట్రగడ్డ ప్రసాద్, పలువురు తెలుగు సంఘాల ప్రతినిధులు గొల్లపూడి భౌతిక కాయానికి నివాళులర్పించారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మాలకొండయ్య

వెలిగండ్ల, డిసెంబరు 15: అప్పుల బాధ తట్టుకోలేక ప్రకాశం జిల్లాలో ఓ రైతు శనివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. వెలిగండ్ల మండలం కొటాలపల్లికి చెందిన మాదిరెడ్డి చినమాలకొండయ్య (61) తన ఐదెకరాల పొలంలో గతేడాది మిర్చి, పత్తి సాగు చేశాడు. కరువు కారణంగా పెట్టిన పెట్టుబడైనా రాలేదు. చేసిన అప్పులు తీర్చలేక కొంతకాలంగా తీవ్ర మనోవేదనలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు మాల్యాద్రి ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ చెప్పారు.


కొల్లేటి పర్యటనకు వచ్చిన నీలం సాహ్ని

## కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం: సీఎస్

కైకలూరు, డిసెంబరు 15: కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని ప్రభుత్వ ముఖ్య ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని అన్నారు. కుటుంబసభ్యులతో కలిసి ఆమె ఆటపాకలోని పక్షుల కేంద్రాన్ని ఆదివారం సందర్శించారు. కొల్లేరు విశిష్టత, పక్షులు ఏఏ దేశాల నుంచి వలస వస్తాయి, పక్షుల రక్షణకు చేసిన ఏర్పాట్లను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నీలం సాహ్ని విలేకరులతో మాట్లాడుతూ సహజ సిద్ధంగా ఏర్పడిన ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, వివిధ దేశాల నుంచి వేలకిలోమీటర్లు ప్రయాణించి కొల్లేరు తరలి రావడం ఈ ప్రాంత విశిష్టతకు నిదర్శనమని చెప్పారు. పర్యాటకంగా దీనిని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామని తెలిపారు. పక్షులను తిలకించేందుకు ఏర్పాటు చేసిన బోట్ సౌకర్యాలను పునరుద్ధరించేందుకు అటవీశాఖ ముఖ్య కార్యదర్శితో చర్చించినట్టు తెలిపారు. త్వరలోనే పర్యాటకులకు అనువుగా ఉండే విధంగా పక్షుల కేంద్రంలో బోట్ షికారు ఏర్పాటు చేస్తామని సాహ్ని వెల్లడించారు.

## హెచ్‌ఆర్‌ఎఫ్‌కు నూతన కార్యవర్గాలు

అమలాపురం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగురాష్ట్రాల మానవహక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) ముగింపు మహాసభ ఆదివారం తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో జరిగింది. ఈ సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నూతన కార్యవర్గాలను ఏకగ్రీవంగా ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా యుజీ శ్రీనివాసులు(కర్నూలు), ప్రధాన కార్యదర్శిగా కె.సుధ(విశాఖపట్నం), తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా జి.మాధవరావు(నిజామాబాద్), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎస్.తిరుపతి(జమ్మిగుంట)లను ఎన్నుకున్నారు. రెండు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులుగా ఎస్.జీవన్‌కుమార్ (హైదరాబాద్), ఎ.చంద్రశేఖర్(అనంతపురం), వి.వసంతలక్ష్మి(హైదరాబాద్), వీఎస్ కృష్ణ(విశాఖపట్నం)లను ఎన్నుకున్నారు. మానవహక్కుల వేదిక ప్రచురణల సంపాదకుడిగా ఎన్ఎన్ శ్రీనివాసరావు, సంపాదకవర్గ సభ్యునిగా నామాడి శ్రీధర్, టి.హరికృష్ణలు ఎన్నికయ్యారు.

## స్టోరీ టెల్లర్ నా ఫ్యాషన్: దర్శకుడు రాజమౌళి



రాజమహేంద్రవరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): 'స్టోరీ టెల్లర్ నా ఫ్యాషన్. సక్సెస్ అనేది ఫ్యామిలీ నుంచి మొదలవుతుంది. ఎవరైనా సరే కుటుంబ నైతిక మద్దతును తీసుకోవాలి. అప్పుడే విజయం వరిస్తుంది' అని ప్రముఖ సినీ దర్శకుడు రాజమౌళి అన్నారు. దీప్తి అలూమినీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం సమీపంలోని బొమ్మూరు కొండపై ఆదివారం జరిగిన 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో ఆయన మాట్లాడారు. కొవ్వూరుకు చెందిన దీప్తి స్కూల్‌లో రాజమౌళి చదువుకున్నారు. ఆయనతో చదువుకున్న ఆర్ఎస్ఆర్ ఇన్‌ఫ్రా ఎండీ రంకిరెడ్డి గోపాలకృష్ణ తదితరులు విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజమౌళి మాట్లాడుతూ స్కూల్ రోజుల్లోనే కథలు చెప్పడం తనకు అలవాటుగా ఉండేదని, అది ఇవాళ వృత్తి అయిందన్నారు.

## అత్యాచార నిందితుడిపై కఠిన చర్యలు

▸ ప్రకాశంలో బాధితురాలి కుటుంబానికి మంత్రుల పరామర్శ

మార్కాపురం, డిసెంబరు 15: మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేశ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత స్పష్టం చేశారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలోని ఓ గ్రామంలో శుక్రవారం రాత్రి అత్యాచారానికి గురైన యువతి కుటుంబ సభ్యులను మంత్రులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం ఇస్తుందని పేర్కొంటూ తొలి విడత రూ. 25వేల చెక్కు అందజేశారు. కాగా.. నిందితుడి కుటుంబసభ్యులకు, బాధితురాలి కుటుంబానికి మధ్య వివాదం జరిగిన నేపథ్యంలో ఎర్రగొండపాలెం సీఐ మారుతీకృష్ణ ముందు జాగ్రత్తగా ఆదివారం గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటుచేశారు.

## నిర్భయంగా 'ఆయేషా' నిందితులు : హైమావతి

న్యూఢిల్లీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆయేషా మీరా హత్య కేసు ఇప్పటికీ కొనసాగుతోందని, నిందితులు నిర్భయంగా వాయిదాల పేరుతో సమాజంలో తిరుగుతున్నారని ఆంధ్ర ప్రదేశ్ బాలల హక్కుల కమిషన్ ఛైర్‌పర్సన్ హైమావతి పేర్కొన్నారు. కొన్ని కేసుల్లో నిందితులు సాక్ష్యాధారాలున్నప్పటికీ పై కోర్టులను ఆశ్రయించడానికి అవకాశం ఇవ్వడం ఎంతవరకు సమంజమో ఆలోచించాలని సూచించారు. ఆదివారం ఆమె ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ... చట్టాలు ఉన్నప్పటికీ అమలు చేయడంలో జాప్యం కారణంగా దోషులు సమాజంలో తిరుగుతూ అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, నేరం జరిగినప్పుడు వెంటనే తీర్పు వెలువడితేనే దోషులు తప్పించుకోబోరని, హైకోర్టులకు ఆశ్రయించబోరని స్పష్టంచేశారు. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో తీసుకొచ్చిన ఏపీ దిశ చట్టం ఆడపిల్లలు, మహిళల భద్రతకు ఆయుధంగా పనిచేస్తుందని.. 21 రోజుల్లో తీర్పు వెలువడడం అన్నది హర్షించదగ్గ విషయమని ఆమె పేర్కొన్నారు.


స్వాత్మానందేంద్ర సరస్వతికి పట్టువస్త్రాలు అందజేస్తున్న దృశ్యం

## అంజన్న దర్శనం.. సకలపాప హరణం

▸ స్వాత్మానందేంద్ర సరస్వతి

చక్రాయపేట/వల్లూరు, డిసెంబరు 15: గండి వీరాంజనేయస్వామిని దర్శించుకున్నా, స్మరించుకున్నా సకల పాపాలు తొలగి అష్టైశ్వర్యాలు కలుగుతాయని విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. ఆదివారం కడప జిల్లా చక్రాయపేట మండలంలోని గండి వీరాంజనేయస్వామి దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ గురుప్రసాద్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఆయనను పట్టు వస్త్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. హిందూ ధర్మ ప్రచార యాత్రలో భాగంగా కడప జిల్లాలోని అనేక క్షేత్రాలను దర్శించానని, ఈ నేపథ్యంలో ఆదివారం గండి క్షేత్రానికి వచ్చినట్టు తెలిపారు. గండికి వచ్చిన భక్తులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో దివ్య సందేశాన్ని అందించి తీర్థప్రసాదాలు ఇచ్చారు. అంతకు ముందు ఆయన వల్లూరు మండలంలోని పుష్పగిరి దేవస్థానంలోని లక్ష్మీ చెన్నకేశవ సంతాన మల్లేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నేడు తిరుపతిలో 'త్రిగళావధానం'

తిరుపతి(కల్చరల్), డిసెంబరు 15: తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో సోమవారం 'త్రిగళావధానం' నిర్వహించనున్నారు. అమెరికాకు చెందిన అట్లాంట తెలుగు సాహిత్య సంస్కృతి, టీటీడీ సంయుక్తాధ్వర్యంలో సంగీత-సాహిత్యాల సమ్మేళనంగా మధ్యాహ్నం 2గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. సంగీత సాహిత్యావధానులు పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, రాంభట్ల పార్వతీశ్వరశర్మ, పాలడుగు శ్రీచరణ్ (అమెరికా) ఈ త్రిగళావధానం చేయనున్నారు.



# వివిధ

సాహిత్య వేదిక vividha@andhrajyothy.com



## కవుల కవి

తెలుగు కవిత్వాన్ని మలుపు తిప్పిన గొప్ప కవుల్లో ఇస్మాయిల్ ఒకడు. శ్రీశ్రీ కవిత్వంలో అంతర్లీనంగా ఛందస్సు, ప్రవాహ గతితో కూడిన శబ్దాల కూర్పు ఉంటుంది. సంస్కృత పద భూయిష్టమైన భాషే శ్రీశ్రీ కవిత్వానికి ఆలంబనం. కానీ ఇస్మాయిల్ వాడిన భాష పూర్తిగా వాడుక భాష. ఆ భాషలో పదాల ఆడంబరం ఉండదు. పదచిత్రాల అల్లిక మాత్రం ఉంటుంది. శ్రీశ్రీ శబ్దాన్ని ధరిస్తే, ఇస్మాయిల్ శబ్దాన్ని హరించాడు. యువకుడిగా ఉన్నప్పుడు కృష్ణశాస్త్రి కవిత్వం ఇస్మాయిల్‌ని కట్టిపడేసింది. అదే సమయంలో ఇస్మాయిల్‌ని శ్రీశ్రీ భావజాలం ఒక వెల్లువలా ముంచెత్తింది. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీల ప్రభావం నుండి బైటపడటానికి చాలా యేళ్ళపాటు కవిత్వం రాయకుండా ఉండిపోయాడు ఇస్మాయిల్. తదనంతర కాలంలో 'పంచేంద్రియాల్ని స్పృశించే ఒక అద్భుత సాధనంగా తన కవిత్వాన్ని మలచుకున్నాడు. 1960 ప్రాంతాల్లో అతడు ప్రారంభించిన ఈ కవితా ప్రక్రియ 1980ల నాటికి ఉత్కృష్ట స్థితికి చేరుకొంది.

కవిత్వం జ్ఞానేంద్రియాల్ని స్పృశిస్తుందనటానికి ఇస్మాయిల్ కవితల్లోంచి ఒక ఉదాహరణ: "అర్ధరాత్రి కిటికీ లోంచి/ వానగుర్రం తోక విసురు/ మొహానికి తగిలి/ నిద్రలేచి కూచున్నాను."

ఇక్కడ ముఖాన్ని తాకిన వానగుర్రం తోక దెబ్బని మనమూ అనుభూతిస్తాం.

"కిటికీలోంచి చూస్తే/ వెలుతురు నిండిన బెజ్జాలతో/ పిల్లంగోవిలా ఊళ వేసుకుంటూ/ దూసుకుపోతోంది రైలు."

ఇక్కడ రాత్రివేళ వెలుగుతోన్న లైట్లతో పరిగెడుతోన్న రైలు బోగీల సముదాయాన్ని 'వెలుతురు నిండిన బెజ్జాలతో కూడిన పిల్లన గ్రోవి' అంటూ వర్ణించాడు. ఇలా ఏక కాలంలో కవితా పంక్తుల్ని శ్రవ్య, దృశ్యమానం చేయటం ఇస్మాయిల్‌కే చెల్లింది.

> తొలినాళ్ళల్లో యువకుడిగా ఉన్నప్పుడు కృష్ణశాస్త్రి కవిత్వం ఇస్మాయిల్‌ని కట్టిపడేసింది. అదే సమయంలో ఇస్మాయిల్‌ని శ్రీశ్రీ భావజాలం ఒక వెల్లువలా ముంచెత్తింది. కృష్ణశాస్త్రి, శ్రీశ్రీల ప్రభావం నుండి బైటపడటానికి చాలా యేళ్ళపాటు కవిత్వం రాయకుండా ఉండిపోయాడు ఇస్మాయిల్. తదనంతర కాలంలో పంచేంద్రియాల్ని స్పృశించే ఒక అద్భుత సాధనంగా తన కవిత్వాన్ని మలచుకున్నాడు. మన కళ్ళ మీది కటకటాల్ని చెరిపేశాడు. మన అంతర్ బాహిర్లోకాల్ని ఒకటి చేశాడు.

ఇంద్రియాలకి సంబంధించిన అనుభవంగా కవిత్వాన్ని సృజించటాన్ని ఆంగ్లంలో- 'పొయెట్రీ ఆఫ్ ఎక్స్‌పీరియన్స్' అంటారు. ఈ కోవకి చెందిన కవిత్వంలో వ్యర్థపదాలుకానీ, శబ్ద డాంబికంకానీ ఉండవు. సూదిమొన లాంటి సునిశితమైన శైలీ, ఒకానొక అనుభవాన్ని 'అనుభవంగా' అందించటానికి అవసరమైన 'సున్నితత్వం'తో కూడిన శిల్పమూ ఉంటాయి.

1960-70 ప్రాంతాల్లో రాసిన తన కవిత్వాన్ని 'చెట్టు నా ఆదర్శం' పేరిట ప్రకటించాడు ఇస్మాయిల్. అప్పటికి ఇటువంటి కవిత్వంతో పరిచయం లేని కారణంగా పాఠక లోకాన్ని విశేషంగా ఆకట్టుకొంది. ఈ సంపుటిలోని కవితల సంఖ్య కేవలం 'పద్నాలుగు' మాత్రమే! ఈ కొద్దిపాటి కవితలతోనే తనదైన 'ముద్ర' వేశాడు కనుకనే అతణ్ని 'చెట్టు కవి' అనే పేరుతో సంబోధించటం ప్రారంభించారు ఆనాటి సాహిత్యకారులు. ఇస్మాయిల్‌కి చెట్లంటే మహాప్రేమ. "చెట్ల సాయం లేకుండా/ చేరువకెలా వస్తాయి/ నింగీ నేలా?" అని ప్రశ్నిస్తాడు.

'చెట్టు నా ఆదర్శం' కవితలో చెట్టుని సగం పురుగు, సగం పిట్ట అంటూ అభివర్ణించాడు ఇస్మాయిల్:

"తరు చాపము వీడిపోయి/ గురి మరచిన బాణంలా/ తిరుగాడును పిట్ట"

"ధరణి గుట్టు తెరవబోయి/ బిరడాలో ఇస్క్రూలా/ ఇరుక్కొన్న పురుగు"

"పురుగు సగం, సగం పిట్ట/ ధరను చొచ్చి, దివిని విచ్చి/ విరులు తాల్చు తరువు"

- ఇంత గొప్పగా జీవితాన్ని చెట్టుతో పోల్చి జీవన సత్యాన్ని ఆవిష్కరించాడు ఇస్మాయిల్.

ఇస్మాయిల్ కవిత్వంలో చిత్రమైన పదచిత్రాలెన్నో తటస్థిస్తాయి. ఉదాహరణకి: 'గొంతులో క్రీనీడలు', 'నీడల స్క్రూలు', 'పీతడెక్కల చంద్రుడు', 'స్వరాల చల్లటి పిట్టలు', 'గట్లులేని గగనం', 'జ్ఞాపకాల సాలెగూళ్ళు', 'కళ్ళ మీది కటకాలు', 'స్వరాల చల్లటి పిట్టలు', 'చీకటి చర్మం', 'పిట్టకూతొకటి రాయిలా వచ్చిపడింది', 'రాత్రి బ్లాంకెట్టు', 'గుచ్చుకున్న గాలిముల్లు'... ఇత్యాది.

ఇస్మాయిల్ తనకి తారసపడిన సంఘటనలూ, దృశ్యాల్నే కాదు, తన జీవితంలో ప్రతి చిన్న చిన్న విషయాల్ని కూడా కవిత్వంగా మలిచాడు. యూరప్‌కి వెళ్ళిన సందర్భంలో పికాసో, వాన్గోల వంటి చిత్రకారుల గురించి అద్భుత గీతాలు రాశాడు. పారిస్‌లోని సైన్ నది గురించి కూడా! అలాగే ప్రపంచ యుద్ధాల మూలంగా విధ్వంసానికి లోనైన పారిస్ నగర ఉత్థానం గురించి రాసిన కవిత ఎంతో ప్రాచుర్యం చెందింది: "ఇటిక మీద ఇటిక పేర్చి/ ఈ మహానగరాన్ని నిర్మించారు./ ఐతే, అది బతక లేదు./ అప్పుడు/ చెస్ట్‌నట్ చెట్ల వరసల/ పచ్చటి బాకుల్ని/ ఆ శవం గుండెల్లోకి/ కస్సుమని దింపారు./ అప్పుడది లేచి/ అద్భుతంగా పాడింది."

'గాడిద'పై ఇస్మాయిల్ రాసిన కవిత జగత్ప్రసిద్ధం. అదేమిటంటే, "జగతిలోని దుఃఖాలన్నీ/ మూటకట్టినట్లుంది./ భూమి గాడిదని మోస్తుందో/ గాడిదే భూమిభారాన్ని మోస్తుందో/ తెలీకుండా ఉంది."

ఇస్మాయిల్‌ని తెలుగులో ఏ కవితోనూ పోల్చలేము. ఏ భాషలోకి అనువదించినా ఆ భాషకి చెందిన కవిత్వంగా ఒదిగిపోయే తత్త్వం ఇస్మాయిల్ కవిత్వానిది. జీవితపుట ఆఖరి క్షణం వరకూ కవిత్వం రాస్తూనే ఉన్నాడు. తన కవిత్వాన్ని 'జీవితోత్సవం'గా తీర్చిదిద్దాడు. జీవన చరమాంకంలో ఎన్ని ఒడిదుడుకులకీ, కష్టనిష్ఠూరాలకి లోనైనా చలించలేదు. 'వైరు జలపాతం' గురించి రాసిన కవితలో- "దూకుళ్ళకీ, పరవళ్ళకీ అడుగున/ ఎంత గట్టిగుండెలుండాలో/ సుంత బోధపడింది నాకు" అన్నాడు. జీవన పర్యంతం అదే హృదయ దృఢత్వం! అదే స్థిరచిత్తం! ఎప్పుడూ కుంగిపోలేదు.

సహస్ర జలపాతాల పాతాల్ని సుహాస ఫేనంగా మార్చేయగల స్థితప్రజ్ఞుడు కనుకనే-"సెలయేరా, సెలయేరా!/ గలగలమంటో నిత్యం/ ఎలా పాడగలుగుతున్నావు?// చూడు, నా బతుకు నిండా రాళ్ళు/ పాడకుంటే ఎలా?" అన్నాడు ఇస్మాయిల్. అంతేకాదు. ఇంకో కవితలో- "ఎరుపెక్కే/ ఇవాళ్టి సంధ్యకానీ/ నలుపెక్కి వచ్చే నిరాశాంధంకానీ/ నా మనస్సులో/ ఆనందపు తెరచాపలెత్తి/ అనవరతం సాగిపోయే/ ఈ కాంతి పడవల్ని/ ఆర్పలేదనుకుంటాను". ఎంతో స్థిరంగా అంతకంటే దృఢంగా పలికాడు. తన జీవితానికి కానీ, కవిత్వానికి కానీ అతడు నిర్దేశించుకున్న లక్ష్యమూ అదే! అంతే కాదు, "ఈ అందానికీ/ ఆనందానికీ/ అంతెక్కడ?" అంటూ జీవన ప్రహేళికని విప్పాడు 'పజిల్' అనే కవితలో!

ఇస్మాయిల్ ఎవర్నీ తన శిష్యులుగా పేర్కొనలేదు; భావించనూ లేదు! 1980, 90ల మధ్య కాలంలో తెలుగు కవిత్వం కొత్త దారులు వెతుక్కొంటున్నప్పుడు ఆనాటి యువకవులకి ఇస్మాయిల్ ఒక దీపస్తంభంగానూ, దిక్సూచిగానూ నిలిచాడు. విన్నకోట రవిశంకర్, శిఖామణి, బివివి ప్రసాద్, యదుకుల భూషణ్, ఆకెళ్ళ రవి ప్రకాష్, బొల్లోజు బాబా లాంటి యువకుల్తో పాటు ముకుంద రామారావు లాంటి సీనియర్‌లంతా 'ఇస్మాయిల్ ఇస్కూలు'కి చెందిన కవులే! కాబట్టే ఇస్మాయిల్ 'కవుల కవి'. అందులోనూ ఆధునిక కవుల్లో అత్యంత ఆధునిక కవి కూడా! అతడు మన కళ్ళ మీది కటకటాల్ని చెరిపేశాడు. మన అంతర్ బాహిర్లోకాల్ని ఒకటి చేశాడు. అందుకే అతడు మన కాలపు మహాకవిగా గుర్తించబడ్డాడు.

■ రవూఫ్

98490 41167

## అసమ్మతి నాటకం



1.
నడుస్తూ నడుస్తూ పడిపో. దెబ్బ తగల్నే లేదని సంతోషిస్తూ కూర్చోకు. ఇంకాసింత దూరం నడిచి యీ సారి కచ్చితంగా దెబ్బ తగిలేట్టే పడిపో. చూసి నడవలేవా అంటారు వాళ్ళు. లేదు, చూస్తూ చూస్తూనే పడిపోయానని చెప్పు. చూస్తూ చూస్తూనే దెబ్బ తాకించుకున్నానని కూడా చెప్పు. పడిపోవడంలోని భయం అనేదొకటి వుందే, దాని కళ్ళల్లోకి పది చూపుల బాణాలు వదులు. భయాన్ని కూడా ప్రేమిస్తానని చెప్పేయ్. పడిపోయే పాదాలకే పరిపరి దండాలు అనీ చెప్పేయ్ కచ్చితంగా-

2.
రాత్రిళ్ళు నిద్రపట్టడం లేదని యెవరికీ చెప్పకు యిక నించి- యీ రాత్రి అన్నం తినలేదని గుర్తొచ్చి నిద్రపట్టలేదని శాంతి సందేశం పంపించనే వద్దు పిచ్చి గుండెకి- నిద్రని ఛిద్రం చేయడానికే చీకట్లోకి దూసుకెళ్తున్నానని చెప్పు. కళ్ళు చించుకున్నా చెదరిపోని చీకటీ, కాసింత వెలుతురునే పండగ చేసుకునే రాత్రీ వద్దే వద్దని చెప్పు. కళ్లని కాగడాల్లా వెలిగించే క్షణం కోసం కాచుక్కూర్చో. కావాలనే నిద్రని వెలివాడకి పంపించానని చాటించేయ్ ధీమాగా-

3.
యెక్కడో లెక్క తప్పిందనో, యేదో గాడిలో పడలేదనో వేళ్ళ మీద అంక గణితం వల్లించకు ఇకపైన- లెక్క తప్పాలి. తప్పాలి పదిసార్లు- గాడి తప్పాలి తప్పాలి వందసార్లు. వొకే వొక్క జీవితంరా నీది, దాన్ని గానుగెద్దు చేయద్దురా-

4.
యేమీ పర్లేదు. రోగాలూ రొప్పులూ, తుపాన్లూ, దెయ్యం గాలులూ వస్తే రానీ. యెదురెళ్ళి వాటికి ప్రేమ పాటలు వినిపించేయ్, ఆకాశానికి పిచ్చి పట్టేలా- యెవరికీ అర్థం కాక పోయినా పర్లేదన్న భరోసాతోనే- ధూళి రేపే జైత్రయాత్రలూ, మిన్ను ముట్టే వికాసాలూ వెలుగులూ సుప్రభాతాలూ చాల్లే యిక చాల్లే-

5.
యీ క్షణం నించి
యీ
చరిత్రంతా
వోడిపోయిన చేతి వేళ్ళ సందుల్లోంచి జారిపోయే ఇసక.
వోడిపో చిత్తుగా
మిగిలిపో చిత్తుప్రతిగా-

■ అఫ్సర్

afsartelugu@gmail.com

### ధనికొండ హనుమంతరావు శతజయంతి
ధనికొండ హనుమంతరావు శతజయంతి వేడుకలు, రచనల ఆవిష్కరణ, సదస్సు కార్యక్రమాలు డిసెంబర్ 16 ఉ.10.30గం.లకు మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ, మెరీనా ఆవరణ, బీచ్‌రోడ్, చెన్నైలో జరుగుతుంది. ముఖ్య అతిథి, గ్రంథావిష్కర్త కె. శ్రీనివాస్, అధ్యక్షులు మాడభూషి సంపత్ కుమార్. సభలో విరించి, జి. లక్ష్మి, ధనికొండ శ్రీధర్, వివినమూర్తి, జి. సుధ తదితరులు పాల్గొంటారు. సభలో ధనికొండ రచనలు ఆరింటి ఆవిష్కరణ జరుగుతుంది.

- ధనికొండ శ్రీధర్

### 'ఒక ఆలోచన - ఒక అవలోకన'
నామిని సుబ్రమణ్యం నాయుడు సంపాదకత్వంలో వరదరాజ నగర్ వెల్ఫేర్ & డెవలప్‌మెంట్ సొసైటీ ప్రచురించిన 'మానవీయ విలువల పునరుద్ధరణ కోసం... ఒక ఆలోచన ఒక అవలోకన' పుస్తకం ఆవిష్కరణ డిసెంబర్ 20 సా.5గం.లకు తిరుపతిలో ఆవిష్కరిస్తారు. ఆవిష్కర్త శాసనసభ్యుడు భూమన కరుణాకరరెడ్డి.

- సాకం నాగరాజ

### 'ఇమ్మతి' సాహిత్య విమర్శ
పసునూరి రవీందర్ సాహిత్య విమర్శ సంపుటాలు 'ఇమ్మతి', గ్లోబలైజేషన్ సాహిత్య విమర్శ పుస్తకాల ఆవిష్కరణ సభ డిసెంబర్ 21న రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. పిల్లలమర్రి రాములు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, సూర్య ధనుంజయ్ నాయక్, కాసుల ప్రతాపరెడ్డి, గుండెడప్పు కనకయ్య తదితరులు పాల్గొంటారు.

సింగిడి

### 'రివాజు' తెలంగాణ కథ
సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్‌ల సంపాదకత్వంలో తెలంగాణ కథ-2018 'రివాజు' సంకలనం ఆవిష్కరణ రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయం, హన్మకొండలో డిసెంబర్ 22 ఉ.10.30గం.లకు జరుగుతుంది. గిరిజా మనోహర్‌బాబు, కాత్యాయని విద్మహే. బన్న అయిలయ్య, అన్వర్ తదితరులు పాల్గొంటారు.

సింగిడి

## "రచయితలో నిజాయితీ వుంటే వ్యక్తిగత జీవిత శకలాలు అతని రచనలో ప్రతిబింబిస్తాయనిపిస్తుంది."



కాశీభట్ల వేణుగోపాల్ ◆ పలకరింపు

**మీ మొదటి మూడు నవలలూ ('నేనూ-చీకటి', 'తపన', 'దిగంతం') కలిపి ఒకే పుస్తకంగా 'కాశీభట్ల వేణుగోపాల్ నవలలు' పేరిట విడుదలయ్యాయి. ఈ మూడే కలిపి వెయ్యటానికి కారణం?**

నా పుస్తకాల ద్వారా నేనేదో సందేశాలివ్వాలని గానీ, వాటి ద్వారా ఎవర్నో మార్చి పారేయాలని గానీ నాకు దురుద్దేశాలు లేవు. నాలాగే ఆలోచించేవారితో నా ఆలోచనల్ని పంచుకోవడం మాత్రమే. నాకున్న రీడర్‌షిప్ ఎంతో నాకు తెలుసు (బహు కొంచెం). నేనెప్పుడో రెండు దశాబ్దాల క్రితం రాసిన పుస్తకాలివి. ఇప్పుడు మార్కెట్‌లో లుప్తం. నా రాతలు నచ్చినవాళ్ళు నలుగురూ పుస్తకాలు దొరకట్లేదంటే, ఒకరిద్దరు ఓ నాలుగు పుస్తకాలుగా, పదిహేను పుస్తకాలూ వేద్దామని అంటే, అలా వేస్తే బావుంటుందని ఆలోచిస్తూండగా, శారీరక మానసిక ఆర్థిక స్థితి అనారోగ్యం పాలు కావడంతో అలసి వున్న పరిస్థితుల్లో సిద్ధారెడ్డి, మహీ బెజవాడల పరిచయం కలిగింది. వాళ్ళు కొత్తగా ప్రచురణ సంస్థ పెట్టి, దాని ద్వారా నా 'తపన' నవల ప్రచురిస్తాం అని అన్నారు. ఎలాగూ అన్ని పుస్తకాలూ వేయాలన్న ఐడియా వుండింది కాబట్టి కొందరు స్నేహితుల సలహా మేరకు 'మార్కెట్లో పుస్తకాల్లేవు, మీరెలాగూ ఒక పుస్తకం వేస్తామంటున్నారు కదా, ఓ మూడు కలిపి ఒక వాల్యూమ్‌గా వేయగలరా, మిగిలినవి ఎలాగోలా వేసుకునే ఏర్పాటు చేసుకుంటానంటే, వాళ్ళు 'వల్లె' అనడం మూలాన ఈ వాల్యూమ్ అన్నమాట. వాళ్ళు కూడా చాలా ఖర్చుపెట్టి ఈ పుస్తకం వేసారు. ఈ మూడు నవలలూ 1, 2, 3 కాదు... మధ్యలో 'రంగులగది' ఇండియాటుడే వాళ్ళ నవలగా నా ఇంకో రచన ప్రచురించారు... దాన్ని పెద్ద కథగా కథల సంకలనంలో చేర్చాలని.

> నా పుస్తకాల ద్వారా నేనేదో సందేశాలివ్వాలని గానీ, వాటి ద్వారా ఎవర్నో మార్చి పారేయాలని గానీ నాకు దురుద్దేశాలు లేవు. నాలాగే ఆలోచించేవారితో నా ఆలోచన్లని పంచుకోవడం మాత్రమే.

**మీ పాత రచనల్ని ఇప్పుడు చదివితే ఏమనిపిస్తుంది? ఉదాహరణకి, 'నేనూ-చీకటి'?**

ఓ రచయిత వయసు పెరిగిం తర్వాత సదరు రచయిత నైమిత్తికాలకి బాగా విలువిచ్చే పక్షాన మార్పులు శారీరకంగా మానసికంగా తప్పవు. నాకు శారీరకంగా పెనుమార్పులొచ్చాయి. మానసికం బహు తక్కువని నా ఉద్దేశం.

నేను 'నేనూ-చీకటి' రాసి దాదాపు మూడు దశాబ్దాలవుతోంది. అందులో ఖచ్చితంగా అప్పటి శారీరిక మానసిక స్థితుల ప్రతిబింబాలుంటాయి. అట్లాంటి రచనల్ని మళ్లీ చదువుకున్నప్పుడు ఒక విధమైన నోస్టాల్జిక్ ఫీలింగ్ కలిగి తీరుతుంది. కొంచెం elaborate చేస్తాను. అది 80ల ప్రాంతం... నేను దేశద్రిమ్మరిగా ఉన్నాను. లఖ్నవ్ పాత గల్లీల్లో తాగి తిరుగుతున్నాను. పైగా వంటిపై జ్వరం, ఆ పరిస్థితుల్లో ఇంకొంచెం తాగి ఓ ఫుట్‌పాత్‌పై పడిపోయాను... ఎవరో స్త్రీమూర్తి నన్ను కాపాడి కొద్ది రోజుల పాటు నాకు ఆశ్రయం కల్గించింది. కోలుకున్నాను... వెళ్తూవెళ్తూ ఆమెకు దండం పెట్టి కృతజ్ఞతలు చెప్పాను... ఆ మహాతల్లి నా వేపుకూడా చూడకుండా: "మేరే ఇన్‌తజార్ థీ ఫిజావోఁకీ శగుఫ్తగీకీ మగర్ మేరే దర్ పే జిందాయే లాశ్/ ముఝే సున్‌నాథీ శహ్‌నాయీ ఆవాజ్ ఏ మాతమ్ కీ" అని పాడింది (ఇది వచ్చీ రాని నా ఉర్దూ). చలించిపోయాను. ఇనుములా కరిగున్న మేధ మీద 'ఆమె' ముద్రించుకుపోయింది.

ఆమె 'నూర్‌బానో', ఎవరో మాజీ నవాబుగారి బంధువుల మాజీ తవాయఫ్ (ఉంపుడుగత్తె). నా మనసులో ఓ నిశ్చయం జరిగిపోయింది. నా నవల 'నేనూ-చీకటి'లో జానకిగా అవతరించింది ఆమె. ఈ క్షణాల ఆ నవల చదివినా ఆ రోజుల్లోకి ప్రాణం ఎగిరిపోతుందండీ...

మా అమ్మ మరణించింది, ఆమె పార్థివ దేహాన్ని ఓ ట్యాక్సీలో వేసుకొచ్చారు. ఆ డ్రైవరు ఆమె శరీరాన్ని బహుజాగరూకతతో ఇల్లు చేర్చి, వెళ్లబోతుండగా ఎవరో అతనికి డబ్బివ్వబోయారు. అతను ఓ నమస్కారం చేసి 'అమ్మచేతి అన్నమ్ముద్ద తిన్నవాడినండీ' అంటూ సజల నేత్రాల్తో వెళ్లిపోయాడు.

అతని పేరు సాయిబాబా. నా బాల్య మిత్రుడు, 'నేనూ-చీకటి' భగవాన్లు.

నాకు వయసు పెరగలేదండీ. 'నేనూ-చీకటి' చదివినప్పుడంతా అప్పట్లోకి ఎగిరెళ్లగల్ను...

రచయితలో నిజాయితీ వుంటే వ్యక్తిగత జీవిత శకలాలు అతని రచనలో ప్రతిబింబిస్తాయనిపిస్తుంది.

**ఈ మూడు నవలల్లో మీ అనుభవ ప్రపంచానికి బాగా చేరువైనది ఏది, ఎందుకు?**

ఈ మూడు నవలల్లో నా అనుభవ జీవితానికి కాస్త దూరంగా వున్నది 'తపన'. దాని రచన దాదాపు 'నేనూ-చీకటి' సాగింతర్వాతనే. నా నిజ జీవితంలో నిస్సంతులుగా వున్న దంపతుల దైనందిన కార్యక్రమాల్ని చాలా దగ్గరిగా ఎరిగుండడం, pompous జీవితాన్ని రుచి చూడడం, what it would be like to be married to a beautiful rich girl అన్న చిలిపి ఊహ రావడం... 'తపన' రచనగా మారడం. అయితే సంఘటనలన్నీ నా నిజ జీవితంలో జరిగినవే... వివిధ సందర్భాల్ని మాలగా గుచ్చాను అంతే...

అయితే మూడింటిలో 'దిగంతం' నాకు నచ్చిన నా రచన. కర్నూల్లో పేపర్ మిల్ మూతపడ్డం, వేలాదిగా జనం రోడ్డున పడ్డం, చాలా ఆత్మహత్యలు... ఒకానొక ఉద్వేగపూరితమైన సమయం. ఇప్పుడు పబ్లిక్ పాయఖానాల్లేవుగానీ ఊరి నడిబొడ్డున 'వడ్డెగేరి' అనే ప్రాంతంలో ఉండేవి... ఒక బాగా తెల్సిన వ్యక్తి వాళ్ళమ్మగారితో ఓ మూడు మూలల గదిలో జీవితాన్ని బ్రహ్మచారిగా గడపడం, ప్రత్యక్షంగా చూసినవాడిని...

'దిగంతం' వాతావరణం అంతా కర్నూలు వాతావరణమే. అన్నీ సుపరిచితాలే. అదీకాక ప్రముఖ దివంగత దర్శకులు శ్రీ కె.ఎన్.టి. శాస్త్రిగారు సినిమాగా తీయడానికి ముందుకు రావడం దాన్ని (దిగంతం) ఒకటికి పదిమార్లు చదవడం... సీన్ బై సీన్ తిరగరాయడంతో అది నాకు దగ్గరైపోయింది (ఎన్నో కారణాల వల్ల అది సినిమాగా రాలేదనుకోండి). ఇప్పటికీ కళ్లు మూసుకుంటే ఆనాటి కర్నూలు వాతావరణం కళ్లముందు తారట్లాడినట్టే వుంది... అదీగాక పేపర్ మిల్లుతో నాకు ప్రత్యక్ష సంబంధం వుండడం... ఒక దగ్గరితనం, 'దిగంతం' నవలని తడిమినప్పుడల్లా అస్తిత్వం గురించిన ఒకానొక తాత్త్విక చింతనామయ భావన... Yes 'దిగంతం' నాకు దగ్గరగా వున్న రచన. ■

## అతీత కక్ష



కుప్పకూలిన నిశ్శబ్దం కరగటం చూడాలి
వివాద విషాద కాల్పనిక మాటల్తో

దాడి చేసే గతం
దాచిన చీకటిలో చీకటి

దీపమే అవొంటరి
చితకని అల

దారపు ముడతల అక్షరాలు
కనువిందు కాదెప్పటికీ

గోడు వినని గదులతో
రమించే మనసుగదులు

తైతక్కలాడే ఏ నిశ్చల నిరాశో
మాసిన అహం

క్షమించకు
కబుర్లందవు ఖబర్లుండవు

ఆత్మగంధం
తలుపు తెరిచే తారీఖు

శరీర శూన్యం
శ్వాస విభజన

వినని చూపెక్కడో
చనిపోయిన నిద్ర

విడిచిరా రేపటి/నీ/నిన్నుని
ఏ వాక్యంలోనో అదేహంతో

■ ఎం. ఎస్. నాయుడు

### 'అఫ్సర్ కవిత్వం - అప్పటి నుంచి ఇప్పటి దాకా'
అఫ్సర్ నలభైఏళ్ళ కవిత్వం 'అఫ్సర్ కవిత్వం-అప్పటి నుంచి ఇప్పటి దాకా' సంపుటి ఆవిష్కరణసభ డిసెంబర్ 20 సా.5.30గం.లకు సాలార్‌జంగ్ మ్యూజియం, ఈస్ట్రన్ బ్లాక్ లోని లెక్చర్‌హాల్‌లో జరుగుతుంది. జూలూరి గౌరీశంకర్, కె. శివారెడ్డి, నందిని సిధారెడ్డి, అల్లం నారాయణ పాల్గొంటారు. కె. శ్రీనివాస్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారు.

చిత్రలేఖ పబ్లికేషన్స్

### కథా సంపుటులకు ఆహ్వానం
సింగమనేని నారాయణ సాహిత్య పురస్కారానికి జనవరి 2018 నుంచి డిసెంబర్ 2019లోపు ప్రచురించిన కథాసంపుటులను ఆహ్వానిస్తున్నాం. కథకులు తమ కథా సంపుటాల్ని జనవరి 15, 2020లోగా చిరునామా: ఏరువాక సాహిత్య సాంస్కృతిక సంస్థ, 7-1- 507 ఎన్‌జిఓ కాలనీ, అపోజిట్ వాటర్ టాంక్, బద్వేల్- 516227, వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ఆం.ప్ర. వివరాలకు: 70137 36729.

ఎల్లిచర్ల గజేంద్రనాథ రెడ్డి

### నవల, కథానికా సంపుటులకు ఆహ్వానం
శ్రీమతి కొలకలూరి విశ్రాంతమ్మ నవల, శ్రీమతి కొలకలూరి భాగీరథీ కథానికా పురస్కారాలకు జనవరి 2017-డిసెంబర్ 2019 మధ్య ముద్రితమైన తెలుగు నవలలను, కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. ఎంపికైన రచయితలకు రూ.15వేల నగదు, శాలువ, మొమెంటో ప్రదానం చేస్తాం. రచయితలు/ప్రచురణకర్తలు నవలలు, కథా సంపుటాలు మూడు ప్రతులను జనవరి 1, 2020లోగా పంపాలి. నవలలు పంపే చిరునామా: కొలకలూరి సుమకిరణ్, ప్రొఫెసర్, ఆంగ్లశాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి - 517 502, ఆం.ప్ర.కు పంపాలి. కథాసంపుటాలు పంపే చిరునామా: కొలకలూరి మధుజ్యోతి, ఆంధ్రాచార్యులు, తెలుగుశాఖ, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి- 517 502, ఆం.ప్ర.కు పంపాలి.

కొలకలూరి సుమకిరణ్, మధుజ్యోతి

### 'అద్వంద్వం' కవితా సంపుటికి రంగినేని ఎల్లమ్మ పురస్కారం
2019 సంవత్సరానికి రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారానికి శ్రీరామ్ కవితా సంపుటి 'అద్వంద్వం' ఎంపికైనది. 2020 జనవరి మూడవ వారంలో జరిగే పురస్కార ప్రదాన కార్యక్రమం జరుగుతుంది.

మద్దికుంట లక్ష్మణ్

## మోహపు కవిత్వానికి శాశ్వతత్వాన్ని ప్రసాదించేదెవరు



కామసూత్ర
విత్తనాలు దేశమంతా మొలకలెత్తి
డిజిటల్ చెట్లయ్యాక
ఈ నిత్య కామేచ్ఛను
కాటికి పంపడమెలా
కామరూపులకు కాపుపాతర వేసేదెలా
సింగిల్ లింగాల లిబిడోల జలపాతానికి
ఆనకట్ట వేసేదెలా

వాంపు నాయికల నాభిల మీద
సినిమా పండ్లతో గురిచూసి కొట్టాలే గానీ
వాంఛలు లేని పరిశుద్ధాత్మలు వీధుల్లో కనబడవు
కొడుకుల కాంక్షలపై దీనతల్లుల కర్ఫ్యూ కవాతు చేయదు
కుంకుమ నుదురు దళాల మోహరంలో
మోహ పక్షుల ఇందిరా పార్కులు మాయమౌతాయి
కామం శరణం గచ్ఛామీ!

నాభీదం లాస్ వేగాస్లో
నాదీ నీదీ పేకాటకు పెళ్ళాళ్ళనోడిన వారసత్వమే!
సింగరేణి సుందరుడొక్కడికే గుత్తగా వేల జలకన్యల్లా
విలాసానికి గుత్తులుగా విరగకాసిన సెల్ఫోన్లని
మర్యాద పురుషోత్తమరాముళ్ళ విహారానికిచ్చాక
దీపాలు లేని గూగుల్ నగ్న వీధుల్లో
స్త్రీలింగాన్ని అగ్నిప్రవేశం చేయించకుండా
ఎవడుంటాడు బాస్!

అవిద్యను అచ్చోసిన ఆంబోతులా వదిలాక
తెలుగు అకాడమీకి తెలుగు కళ్ళు మొలవక
మర్యాద రామన్నల అచ్చ తెలుగు కథలను
ఉల్లిపాయల బస్తాల్లా జపానోళ్ళు ఎత్తుకుపోతే
ముక్కూ చెవులూ కోసిన కథల పుస్తకాలనుంచే
నీతి కథల అపరాలు నూర్చుకోవాలి

కన్యమేరీ చీరకట్టుకున్నా
కంధమాల్ పురుషాంగాలు కనికరించవు గనక
షాయరీలు పాడుతూ దాదర్ ఎక్స్‌ప్రెస్
వాకపల్లి మీదుగా దూసుకెళుతుంది
వడ్ల బస్తాల్లా జాగ్రత్తగా ఆడోళ్ళని నెత్తిన పెట్టుకున్న కథల్ని
ఒక్కడైనా చెప్పగలడంటావా

మొటెళ్ళు కట్టే పటేళ్ళు అమెరికా పారిపోయాక
అనుదిన వాంఛల కోసం పరలోక ప్రార్థన చేసినా
నిషేధపు నీడన లకడీకాపూల్లో లాడ్జి గదులు నిండవ్
కాసుల కోసం రాష్ట్రాన్ని తాగుబోతుల రాజ్యంగా నిర్వచించాక
వ్యభిచార మంత్రిత్వ శాఖ ఏర్పాటు మీద
హిమాయత్ నగర్ బ్లూఫాక్స్ బార్లో తాగుతూ ముషాయిరాలు నిర్వహిద్దాం

ఈ ద్వీపకల్పంలో
చెట్టును కొమ్మలు నమ్మేట్టు లేవు
పువ్వులు ఆకుల్ని నమ్మేట్టు లేవు
బుల్లెట్లు పిస్టళ్ళను నమ్మవు
ఇంటి సీతాకోక చిలుకలు వీధుల్లో విహరించలేవు
ఈ మోహపు కవిత్వానికి శాశ్వతత్వాన్ని ప్రసాదించేదెవరు

■ తుల్లిమల్లి విల్సన్ సుధాకర్

95380 53030



ప్రముఖ చిత్రకారుడు బాపు బొమ్మ

*తమిళనాడులోని శ్రీ విల్లిపుత్తూరులో అవతరించిన గోదాదేవి ఆయన దేవేరిగా... ఆండాళ్‌గా పూజలందుకుంటోంది. శ్రీరంగనాథ స్వామిని పతిగా భావించి, ఆమె తమిళ మార్గళి మాసం (ధనుర్మాసం)లో 'శ్రీ' వ్రతం చేపట్టింది. ఆ సందర్భంగా ముప్పై రోజులపాటు రోజుకో పాశురం చొప్పున గానం చేసింది. ఆ పాశురాల సంకలనమే 'తిరుప్పావై'. వైష్ణవ భక్తి సాహిత్యానికి అది మణిమకుటం. సౌరమానం ప్రకారం ధనుర్మాసం నెలరోజులూ తెల్లవారుజామున తిరుప్పావైని వైష్ణవ ఆలయాల్లో గానం చేసి, స్వామివారిని మేలుకొలుపుతారు. ఆ దివ్య ప్రబంధంలోని పాశురాలు... వాటి భావంతో సహా ఇవాళ్టి నుంచి రోజుకు ఒకటి:*

# రారే చెలులారా!

## మొదటి పాశురం

మార్గళి త్తింగళ్ మది నిఱైంద నన్నాళాల్
నీరాడ ప్పోదువీర్ పోదుమినో నేరిళైయీర్
శీర్ మల్గుమ్ ఆయ్ ప్పాడి చ్చెల్వ చ్చిఱుమీర్‌గాళ్
కూర్వేల్ కొడున్ తొళిలన్ నందగోపన్ కుమరన్

ఏరాంద కణ్ణి యశోదై ఇళమ్ సింగమ్
కార్మేని చ్చెంగణ్ కదిర్ మదియమ్‌పోల్ ముగత్తాన్
నారాయణనే నమక్కే పఱై తరువాన్
పారోరి పుగళప్పడిందు ఏల్ ఓర్ ఎంబావాయ్

**భావం:** మార్గశిర మాసంలో మార్గళి వ్రతాన్ని చేపట్టే భాగ్యం అయాచితంగా లభించిందని గోపికలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'మార్గం' అంటే భగవంతుణ్ణి చేరే దారి. 'శీర్షం' అంటే శిరస్థానీయమైనది. మార్గశిర మాసంలో ఈ వ్రతం విశేషమైనది. ఇవి పున్నమి చంద్రుడు షోడశ కళలతో వెలిగే మంచి రోజులు. అందుకే కాత్యాయనీ వ్రతం చేయాలని గోదాదేవి సంకల్పించింది. "వ్రత స్నానాలు చేయడానికి రావలసిన వాళ్లు రండి! సిరులు పొంగి పొరలే వ్రేపల్లె పడతులారా! విశేషమైన ఆభరణాలు ధరించి రండి! నందగోప కుమారుడు, యశోదా బాలసింహం శ్రీకృష్ణ భగవానుడు. అతడు నల్లని మేను, ఎర్ర కలువల వంటి కళ్లు కలిగిన దొర. సూర్య చంద్రుల లాటి అందమైన ముఖవర్చస్సు కలిగినవాడైన ఆ నారాయణుడే మనకు ఉపాస్యుడు. అతడే మనకు కావసిన ఫలాన్ని ఇచ్చే ఉపాయం. మనం పొందగలిగినవాడు, మనకు కావలసిన పురుషార్థాన్ని (పఱై) ఇచ్చేవాడు అతడే!. కాబట్టి రండి! ఆనందంతో వ్రతం చేద్దాం!" అని మొదటిరోజున తన నెచ్చెలులను గోదాదేవి ఆహ్వానిస్తోంది.

• ఎ.సీతారామారావు

---

ఆమె ర్యాప్‌సాంగ్స్‌కు అమెరికన్లు శ్రుతి కలుపుతారు... ఆమె హిప్‌హాప్‌తో పోటీపడుతారు. 'ర్యాపర్ రాజకుమారి' స్టేజీపైకి వచ్చిందంటే రచ్చ రచ్చే. భారతీయత ఉట్టిపడే ఆహార్యంతో అమెరికన్ యాక్సెంట్‌తో ర్యాప్ దునియాలో క్రేజ్ సంపాదించుకుంటున్న రాజకుమారి ఎవరో కాదు... మన తెలుగమ్మాయే. అసలు పేరు **శ్వేతారావు యల్లాప్రగడ**. ఆస్కార్‌కు వెళ్లిన 'గల్లీబాయ్'లో మెరిసిన ఈ ర్యాపర్ బాలీవుడ్ సినిమాల్లో పాటలు పాడుతూనే, చాలాకాలంగా మెట్రో నగరాల్లో లైవ్ షోలు కూడా ఇస్తోంది. "నా మాతృభాష తెలుగులో కూడా సంగీతాన్ని అందించాలనే కోరిక ఉంది" అంటున్న ఆమె అంతరంగమిది...

# ర్యాపర్ రాజకుమారి!



"నా అసలు పేరు కుమారి శ్వేతారావు ఎల్లాప్రగడ. నేను తెలుగు అమ్మాయినే. నేను పుట్టకముందే మా నాన్న అమెరికాలో సెటిలయ్యారు. నేను పుట్టి పెరిగిందంతా కాలిఫోర్నియాలో. నా చదువంతా అక్కడే జరిగింది. అమెరికాలో ఉన్నా మా ఫ్యామిలీ తెలుగు సంప్రదాయాన్ని వీడలేదు.



తోటి ర్యాపర్లతో...

ఏడేళ్ల వయసులోనే నాకు అమ్మానాన్న శాస్త్రీయ నృత్యం నేర్పించారు. కాలిఫోర్నియాలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్‌లో డిగ్రీ చేశా. అమెరికాలోని హిప్‌హాప్ గ్రూప్ 'ఫ్యూజీ' చేసిన 'ది స్కోర్' ఆల్బమ్ చూసిన తర్వాత... అంటే నేను ఫిఫ్త్ గ్రేడ్‌లో ఉండగానే నాకు హిప్‌హాప్ పట్ల ఆసక్తి కలిగింది. 14 ఏళ్లు వచ్చేసరికి నేను హిప్‌హాప్ డ్యాన్సర్‌గా గుర్తింపు పొందాను.

### స్నేహితులు పెట్టిన పేరు...

ర్యాపర్‌గా పాటలు రాస్తూ, పాడుతుంటే నా స్నేహితులు విని తెగ ఆనందించేవారు. 'ది ఇండియన్ ప్రిన్సెస్' అంటూ నన్ను పొగడ్తలతో ముంచెత్తేవారు. దానికి తెలుగులో అర్థం 'రాజకుమారి' అని తెలిసింది. డాన్సు కార్యక్రమాలకు శ్వేతా రావుగానే పరిచయం అయినప్పటికీ నా పేరుకు ఎప్పుడూ కుమారి విడదీయకుండా ఉండిపోయింది. ర్యాపర్‌గా మారిన తర్వాత పేరు మార్చుకోవాలనుకున్నా. శ్వేతారావు పేరుతో పాటలు పాడితే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉండదని, ర్యాపర్ 'రాజకుమారి'గా పేరు మార్చుకున్నాను. స్టేజీ మీద పాట మధ్యలో అమ్మవారి స్టయిల్‌లో డాన్స్ చేయడం వల్ల కూడా పేరుకు తగ్గ ర్యాపర్‌గా గుర్తింపు వచ్చింది. అంతకుముందు 'సెంచూరీస్', 'ఛేంజ్ యువర్ లైఫ్', 'బ్రేవ్ ఎనఫ్' వంటి అనేక ఆల్బమ్స్‌కు రచనా సహకారాన్ని అందించా. ర్యాపర్‌గా నేను చేసిన 'షూక్', 'సిటీ స్లమ్స్' నాకు బాగా పేరు తీసుకొచ్చాయి.



### 'గల్లీబాయ్'తో గుర్తింపు...

నా మాతృభాష తెలుగు. అమెరికాలో ఉండటంతో ఇంగ్లీష్ వచ్చింది. కాలేజీలో చదువుతున్నప్పుడు బాలీవుడ్ సినిమాలు చూసి హిందీ నేర్చుకున్నా. గీత రచయితగా, గాయనిగా నాపై ఈ మూడు భాషల ప్రభావం ఉంటుంది. ఏ.ఆర్.రెహమాన్ సంగీతం నుంచి కూడా ఎంతో స్ఫూర్తి పొందాను. ఆయనతో కలిసి పనిచేశా. అయితే జోయా అక్తర్ తీసిన 'గల్లీబాయ్'తో నాకు చాలా గుర్తింపు వచ్చింది. అందులో నేను ఒక ర్యాపర్ జడ్జిగా కనిపిస్తా. ఈ సినిమాతో ఇండియాలో కూడా ర్యాపర్స్‌కు క్రేజ్ వచ్చింది. నా వరకు నన్ను సోషల్ మీడియాలో 9 కోట్ల మందికి దగ్గర చేసింది.

### అమెరికాలో మన వాణి వినిపించాలనే...

అమెరికన్ సింగర్స్ సరసన మనం కూడా నిలబడాలనే తాపత్రయం నాది. అమెరికాలో భారతీయులు ఒక శాతం కన్నా తక్కువగా ఉంటారు. అక్కడి సంగీత ప్రపంచంలో మన ప్రతిభను చాటుకునే ప్రయత్నం చేస్తున్నా. అక్కడి గాయనీ గాయకుల సరసన ఒక్క భారతీయ ముఖాన్నయినా చూడాలనేది నా చిన్ననాటి కోరిక. నేను చిన్నప్పటి నుంచి వేదికలపై వారినే చూస్తూ పెరిగా. అందుకే నాలో కసి పెరిగింది. ఇప్పుడిప్పుడే బాలీవుడ్‌లో ర్యాపర్స్ పుట్టుకొస్తున్నారు. 'గల్లీబాయ్' అలాంటి వారికి గొప్ప ఉత్సాహాన్ని, స్ఫూర్తిని ఇచ్చింది. ఇప్పుడిప్పుడే హసన్ మిన్‌హాజ్ (కమెడియన్, టీవీ హోస్ట్), మిండీ కళింగ్, ప్రియాంక చోప్రా వంటి భారతీయ మూలాలున్నవాళ్లు అమెరికాలో తమ సొంత ప్రతిభతో రాణిస్తున్నారు.



ఏ.ఆర్.రెహమాన్‌తో...

### ఇంటర్నెట్‌తో అవకాశాలు...

ఇంటర్నెట్ అనేది అందర్నీ ఒకే వేదిక మీదకు తెస్తోంది. ఆట ఆడాలనుకునేవారికి సమానమైన మైదానాన్ని ఇస్తోంది. సంగీత ప్రపంచంలో రాణించాలంటే యువతకు ఇంతకుమించిన వేదిక లేదనే చెప్పాలి. మన దగ్గర టాలెంట్ ఉంటే ఏ మ్యూజిక్ కంపెనీనైనా, ఏ సంగీత దర్శకుణ్ణి అయినా, ఏ గాయకుడినైనా ఇట్టే కలవొచ్చు. అంతెందుకు ఇప్పుడు మీ ల్యాప్‌టాపే ఒక రికార్డింగ్ స్టూడియో. ఇండియాలో టాలెంట్ ఉన్నవాళ్లు ఎంతోమంది ఉన్నారని నా ప్రగాఢ నమ్మకం. అయితే కుటుంబపరమైన, ఆర్థికపరమైన ఇబ్బందులు వారి టాలెంట్‌కు ఆటంకాలుగా మారుతున్నాయి. అమ్మాయిల విషయంలో అయితే ఎన్నో అడ్డంకులు. వాటన్నింటినీ దాటుకుంటూ ఇప్పుడిప్పుడే ధైర్యంగా బయటికి వస్తున్నారు. ర్యాపర్స్ విషయానికొస్తే మగ ర్యాపర్స్ చాలామంది ఉన్నారు. అమ్మాయిలు ఈ రంగంలోకి రావాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే అందరూ కలిసి ఇండస్ట్రీని షేక్ చేయాలి కదా!"

- 'మామ్' సినిమాలో 'ఫ్రీకింగ్ లైఫ్' పాట పాడారు. 'రేస్ 3', 'జీరో', 'జడ్జిమెంటల్ హై క్యా'లో ర్యాప్ గీతాలు రాశారు.
- ఎంటీవీ యూరోపియన్ మ్యూజిక్ అవార్డుకు మూడుసార్లు నామినేట్ అయ్యారు.
- 2015లో గ్రామీ అవార్డుకు నామినేట్ అయ్యారు.
- 'ఎంటీవీ హజిల్' సీజన్ 1కు జడ్జిగా వ్యవహరించారు.
- సామాజిక సేవలకు గుర్తింపుగా తమిళనాడు గవర్నర్ చేతుల మీదుగా 'కోహినూర్' అవార్డు అందుకున్నారు.
- మ్యూజిక్ లైవ్ షోల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పలు స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా ఇచ్చారు.

---

# బరువు తగ్గాలంటే...



ఫిట్‌నెస్

బరువు తగ్గడానికి తేలికైన మార్గం అంటూ లేదు. వ్యాయామం, ఉపవాసం... ఈ రెండు మార్గాల ద్వారా అధిక బరువు తగ్గించుకోవడంతో పాటు, చక్కని ఫిట్‌నెస్ పొందవచ్చు. ఇందుకోసం....

**ఉపవాసం:** ప్రతి రోజూ 8 గంటల విరామ వ్యవధితో, 16 గంటల పాటు ఉపవాసం పాటించాలి. రాత్రి 8 నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటల వరకూ ఉపవాసం పాటించాలి. ఉదయం 8కి, తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు ఆహారం తీసుకోవాలి. ఉపవాస సమయంలో చక్కెర కలపని బ్లాక్ కాఫీ, బ్లాక్ టీ, నీళ్లు తాగవచ్చు.

**ఉపవాస విరమణ:** శరీరాన్ని చురుగ్గా మార్చడానికి తేలికైన, సులువుగా జీర్ణమయ్యే పదార్థాలతో ఉపవాసాన్ని విరమించాలి. చక్కెరతో తయారైన పదార్థాలు, తీయని పండ్లు తినకూడదు. కొవ్వును తొందరగా కరిగించే కొబ్బరి నూనెను తీసుకోవాలి.

**వ్యాయామం:** ఉదయం సమయం వ్యాయామానికి ఉత్తమం. వేగంగా బరువు తగ్గడంతో పాటు, కండరాలు బలపడడానికి అనుకూలమైన వ్యాయామ సమయం ఇదే అని పరిశోధనల్లో రుజువైంది. బరువులతో కూడిన వ్యాయామాలు, గుండె వేగాన్ని పెంచే ఎక్సర్‌సైజ్, హై ఇంటెన్సిటీ వర్కవుట్స్ తప్పక చేయాలి. ఒకే రకమైన వ్యాయామాలు కాకుండా, తరచుగా మారుస్తూ, తీవ్రత పెంచుతూ, తగ్గిస్తూ విభిన్నమైన వర్కవుట్స్ చేయాలి.

**వారంలో ఐదు రోజులు:** వారం మొత్తం ఒక్క రోజు విడవకుండా వ్యాయామాలు చేయడం ఉత్తమం. అయితే అలా వీలుకాని పక్షంలో వారంలో కనీసం ఐదు రోజుల పాటు అయినా క్రమం తప్పకుండా ఎక్సర్‌సైజ్ చేయాలి. వ్యాయామ ప్రభావానికి స్పందించేలా శరీరాన్ని అలవాటు చేయడం ఎంతో అవసరం!

---

ఇలా చేయండి!



# చట్నీ రంగు మారకుండా...

- పుదీనా, కొత్తిమీర చట్నీ రంగు మారకుండా ఉండాలంటే అందులో కొద్దిగా నిమ్మరసం పిండాలి.
- కాచిన నెయ్యిలో కొన్ని మెంతులు వేస్తే కమ్మటి వాసన వస్తుంది.
- వంటనూనె నిల్వ ఉంచిన డబ్బాలో రెండు లవంగాలు వేస్తే సువాసన వస్తుంది.
- కొన్ని లవంగాలను బియ్యం బస్తాలో మూట గట్టి ఉంచితే బియ్యం పురుగుపట్టదు.
- ఆకుకూరలు వండేటప్పుడు వాటిల్లో చిటికెడు చక్కెర కలిపితే వాటి సహజరంగు కోల్పోవు.
- ఉల్లిపాయ ముక్కల్లో చిటికెడు పంచదార వేస్తే తొందరగా వేగుతాయి.
- వంటకాలు తక్కువ నూనెను పీల్చుకోవాలంటే నూనెలో అరచెంచా వెనిగర్ వేయాలి.

---

బ్యూటీ

# కళ్ల తాజాదనం కోసం..

ఉదయం నిద్ర లేచి అద్దంలో చూసుకుంటే ఒక్కోసారి కళ్లు వాచినట్టుగా ఉంటాయి. రాత్రిపూట నిద్ర చాలకపోవడం, ఎలర్జీ వల్ల అలా జరుగుతుంది. అప్పుడు చల్లని నీటితో ముఖం కడుక్కున్నా లేదా గ్లాసు చల్లని నీళ్లు తాగినా కళ్ల వాపు తగ్గిపోతుంది. వీటితో పాటు కళ్ల వాపును పోగొట్టే మరికొన్ని చిట్కాలున్నాయి. అవేమిటంటే....

**చల్లని స్పూన్:** రెండు స్పూన్లను కొద్దిసేపు ఫ్రిజ్‌లో ఉంచాలి. ఉదయాన్నే కళ్లు వాచినట్టుగా ఉంటే ఆ స్పూన్లను రెండు కళ్ల మీద కొద్దిగా అదిమినట్టు పట్టుకోవాలి. దీంతో వాటి చల్లదనానికి కళ్ల వాపు వెంటనే తగ్గిపోతుంది.



**అలోవెరా జెల్:** చల్లగా ఉండే అలోవెరా జెల్‌లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కళ్ల వాపును చిటికెలో మాయం చేస్తాయి. ఫ్రిజ్‌లో ఉంచిన అలోవెరా జెల్‌ను రాత్రి నిద్రపోయే ముందు లేదా ఉదయాన్నే నిద్రలేచిన తరువాత కళ్లచుట్టూ ఐ క్రీమ్‌లా రాసుకుంటే చాలు కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి.

**వేడి టీ బ్యాగ్:** గ్రీన్ టీ బ్యాగును వేడి నీళ్లలో మూడు లేదా నాలుగు నిమిషాలు ఉంచాలి. గోరు వెచ్చగా ఉన్న ఆ టీ బ్యాగును కళ్ల మీద కొద్ది సేపు ఉంచితే ఫలితం ఉంటుంది.

---

## ముత్యాల ముగ్గు



వి.హేమలత
గుత్తి, అనంతపురం జిల్లా

21 చుక్కలు
సందు
11 నిలువు

21 చుక్కలు
11 వచ్చే వరకు
మధ్య చుక్క





ఎన్.చంద్రకళ
వరంగల్



22 చుక్కలు
6 వరుసలు
6 వచ్చే వరకు



ఎం.సత్యవేణి
సామర్లకోట, తూర్పుగోదావరి



21 చుక్కలు
మధ్య చుక్క
11 వచ్చే వరకు



పి.గౌతమి
గణపవరం, గుంటూరు

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.

మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. Email: navya@andhrajyothy.com

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ • సోమవారం 16 డిసెంబరు 2019

diksuchi@andhrajyothy.com

## ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్స్ - 2019 కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. వివరాలు..

ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఎల్ఐసీ సంస్థ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమంలో రెగ్యులర్ స్కాలర్, స్పెషల్ గర్ల్ చైల్డ్ అనే రెండు విభాగాలు ఉన్నాయి.

- రెగ్యులర్ స్కాలర్: ప్రభుత్వ / ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో ఇంజనీరింగ్, మెడిసిన్, డిగ్రీ, డిప్లొమా, వొకేషనల్ కోర్సులను చదువుతున్న విద్యార్థులకు ఈ విభాగం ద్వారా స్కాలర్‌షిప్స్ అందజేస్తారు.
- అర్హత: 2018-19 విద్యా సంవత్సరంలో 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ / సమాన కోర్సులో ఉత్తీర్ణత. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్షలోపు ఉండాలి.
- స్కాలర్‌షిప్ మొత్తం: రూ. 20 వేలు (సంవత్సరానికి).
- కొనసాగింపు: కోర్సు వ్యవధి మేరకు స్కాలర్‌షిప్ అందజేస్తారు. అయితే ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఏటా 55 శాతం / బీఏ / బీకామ్ / బీఎస్సీ తదితర కోర్సులు చదువుతున్న 50 శాతం మార్కులు సాధిస్తేనే అటుపై సంవత్సరానికి కొనసాగింపు లభిస్తుంది.
- స్పెషల్ గర్ల్ చైల్డ్: 10వ తరగతి తరవాత 10+2 విధానంలో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే బాలికలకు ఈ విభాగం ద్వారా స్కాలర్‌షిప్స్ అందజేస్తారు.
- అర్హత: 2018-19 విద్యా సంవత్సరంలో 60 శాతం మార్కులతో 10వ తరగతిలో ఉత్తీర్ణత. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ. లక్షలోపు ఉండాలి.
- స్కాలర్‌షిప్ మొత్తం: రూ. 10 వేలు (సంవత్సరానికి)
- ఎంపిక: అభ్యర్థి అకడమిక్ ప్రతిభ, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం, ఎల్ఐసీ డివిజన్‌ను ప్రాతిపదికగా అర్హులను ఎంపిక చేస్తారు. స్కాలర్‌షిప్ మొత్తాన్ని విద్యార్థుల బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తారు.
- దరఖాస్తు: ఆన్‌లైన్ ద్వారా
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 24, 2019
- వెబ్‌సైట్: www.licindia.in

LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA

## జాబ్ కార్నర్

### మల్టీ టాస్కింగ్ స్టాఫ్

ఖాళీలు 1817

డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌కి చెందిన సెంటర్ ఫర్ పర్సనల్ టాలెంట్ మేనేజ్‌మెంట్ (సెప్టమ్) మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్) విభాగంలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- అర్హత: 10వ తరగతి / ఐటీఐ / తత్సమాన ఉత్తీర్ణత.
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభ తేదీ: డిసెంబరు 23, 2019
- దరఖాస్తుకు చివరి తేదీ:జనవరి 23, 2020.
- వెబ్‌సైట్: www.drdo.gov.in/careers

### అసిస్టెంట్ మేనేజర్

ఖాళీలు 22

హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) - విశాఖపట్నం పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- భర్తీ చేసే పోస్టులు: జనరల్ మేనేజర్, సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్.
- విభాగాలు: హెచ్ఆర్, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, నావల్ ఆర్కిటెక్చర్, కమర్షియల్, ఫైనాన్స్, తదితరాలు.
- అర్హత: పోస్టుని అనుసరించి సంబంధిత సబ్జెక్టుల్లో గ్రాడ్యుయేషన్, ఇంజనీరింగ్ డిగ్రీ, అనుభవం.
- దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 11, 2020.
- వెబ్‌సైట్: www.hslvizag.in/

### సైంటిస్ట్

ఖాళీలు 19

సీఎస్ఐఆర్ - నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ - హైదరాబాద్, పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- పోస్టులు: సైంటిస్ట్, సీనియర్ సైంటిస్ట్.
- అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో పీహెచ్‌డీ, పరిశోధన అనుభవం.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 20, 2019.
- వెబ్‌సైట్: www.ngri.org.in/

### సైంటిఫిక్ అసిస్టెంట్

ఖాళీలు 30

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసెర్చ్ (ఐపీఆర్) - గాంధీనగర్ (గుజరాత్), పలు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. వివరాలు..

- పోస్టుల వారీగా ఖాళీలు: ప్రాజెక్ట్ సైంటిఫిక్ ఆఫీసర్ - 12, ప్రాజెక్ట్ సైంటిఫిక్ అసిస్టెంట్ - 13, ప్రాజెక్ట్ టెక్నీషియన్ - 5.
- అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐతోపాటు న్యాక్ సర్టిఫికెట్, సంబంధిత విభాగాల్లో ఇంజనీరింగ్ డిప్లొమా, బీఈ / బీటెక్.
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 16, 2019.
- హార్డ్ కాపీలను పంపడానికి చివరి తేదీ: డిసెంబరు 23, 2019.
- వెబ్‌సైట్: http://www.ipr.res.in/

**ఇంజనీరింగ్, కామర్స్, ఇతర గ్రాడ్యుయేట్లకు ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అద్భుత అవకాశాలు కల్పిస్తోంది. ఆఫీసర్ కేడర్ ఉద్యోగాల ద్వారా మంచి వేతనం, సౌకర్యాలను అందిస్తోంది. ఎయిర్ ఫోర్స్‌లోని ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్, నాన్ టెక్నికల్) ఖాళీలను భర్తీ చేసేందుకు ఏటా ఎయిర్‌ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్ (ఏఎఫ్‌క్యాట్) నిర్వహిస్తోంది. అనేక దశల్లో కొనసాగే ఎంపిక ప్రక్రియ, ఇతర వివరాలు తెలుసుకుందాం..**



## వాయుసేన పిలుస్తోంది

# వేతనం లక్ష

ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్, నాన్ టెక్నికల్), ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ (ఫ్లయింగ్), మెటీయరాలజీ బ్రాంచ్ గ్రౌండ్ డ్యూటీ (నాన్ టెక్నికల్) ఖాళీల భర్తీకి భారత వైమానిక దళం ఏటా రెండు సార్లు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షే ఏఎఫ్‌క్యాట్. ఏటా మే /జూన్, డిసెంబరుల్లో ఏఎఫ్‌క్యాట్ కోసం ప్రకటన వెలువడుతుంది. అందులో భాగంగానే ప్రస్తుత నోటిఫికేషన్ వెలువడింది. ఏఎఫ్‌క్యాట్‌లో విజయం సాధిస్తే పైసా ఖర్చు లేకుండా భారతీయ వాయు సేనలో పైలట్ కావొచ్చు. ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్, నాన్ టెక్నికల్) బ్రాంచ్‌లలో ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహించే అవకాశం దక్కుతుంది.

### ఏఎఫ్‌క్యాట్

యూపీఎస్సీ - ఎన్‌డీఏ, సీడీఎస్‌ఈల తరవాత ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ఆఫీసర్ హోదాతో కెరీర్‌ను ప్రారంభించేందుకు తోడ్పడే పరీక్ష ఏఎఫ్‌క్యాట్. ప్రస్తుత ఏఎఫ్‌క్యాట్ ద్వారా, ఎన్‌సీసీ ఎంట్రీతో కలిపి 249 (పర్మినెంట్, షార్ట్ సర్వీస్‌తో కలిపి) పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో విభాగాల వారీగా ఖాళీలు.. ఫ్లయింగ్ బ్రాంచ్ - 60, గ్రౌండ్ డ్యూటీ - టెక్నికల్ ఏరోనాటికల్ ఇంజనీర్ (ఎలక్ట్రానిక్స్) - 66, ఏరోనాటికల్ ఇంజనీర్ (మెకానికల్) - 39, గ్రౌండ్ డ్యూటీ - నాన్ టెక్నికల్ అడ్మినిస్ట్రేషన్ - 40, అకౌంట్స్ - 24, లాజిస్టిక్స్ - 20.

- ఎన్‌సీసీ ఎంట్రీ: ఈ విభాగంలో ఫ్లయింగ్ బ్రాంచ్ ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేస్తారు. యూపీఎస్సీ - సీడీఎస్‌ఈలో 10 శాతం (పర్మినెంట్ కమిషన్), ఏఎఫ్‌క్యాట్‌లో 10 శాతం (షార్ట్ సర్వీస్ కమిషన్) ఖాళీలను ఈ ఎంట్రీ కోసం కేటాయిస్తారు.

### బ్రాంచ్‌ల వారీగా అర్హతలు

- ఫ్లయింగ్ బ్రాంచ్: 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ (మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో), 60 శాతం మార్కులతో డిగ్రీ / బీటెక్ / బీఈ / తత్సమానం.
- ఎన్‌సీసీ ఎంట్రీ వారికి ఎన్‌సీసీ ఎయిర్ వింగ్ సీనియర్ డివిజన్ సి సర్టిఫికెట్.
- వయసు: జనవరి 1, 2021 నాటికి 20 నుంచి 24 ఏళ్లు. జనవరి 2, 1997 - జనవరి 1, 2001 మధ్య జన్మించి ఉండాలి.
- ఎత్తు: కనీసం 162.5 సెం.మీ ఉండాలి. ఎలాంటి దృష్టి దోషం ఉండరాదు.

### గ్రౌండ్ డ్యూటీ - టెక్నికల్ బ్రాంచ్

**విభాగం:**

- ఏరోనాటికల్ ఇంజనీర్ (ఎలక్ట్రానిక్స్): 60 శాతం మార్కులతో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ లేదా ఎలక్ట్రానిక్స్ లేదా ఎలక్ట్రికల్ లేదా కమ్యూనికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్... తదితర విభాగాల్లో బీటెక్ / బీఈ. 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ (మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో) చదివివుండటం తప్పనిసరి.
- ఏరోనాటికల్ ఇంజనీర్ (మెకానికల్): 60 శాతం మార్కులతో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ లేదా ఏరో స్పేస్ లేదా ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెన్స్ లేదా మెకానికల్ లేదా ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ / బీఈ. 60 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ (మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో) చదివివుండటం తప్పనిసరి.

### గ్రౌండ్ డ్యూటీ - నాన్ టెక్నికల్ బ్రాంచ్

- అడ్మినిస్ట్రేషన్ / లాజిస్టిక్స్: కనీసం 60 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ.
- అకౌంట్స్: 60 శాతం మార్కులతో బీకామ్.
- వయసు: గ్రౌండ్ డ్యూటీలోని టెక్నికల్, నాన్ టెక్నికల్ అన్ని పోస్టులకు జనవరి 1, 2021 నాటికి 20 నుంచి 26 ఏళ్లు. అంటే జనవరి 2, 1995-జనవరి 1, 2001 మధ్య జన్మించి ఉండాలి.
- ఎత్తు: పురుషులు - 157.5, మహిళలు 152 సెం.మీ.

### ఎంపిక ప్రక్రియ.. మూడు దశలు

ఫ్లయింగ్, గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ / నాన్ టెక్నికల్ (ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ), ఎన్‌సీసీ (ఫ్లయింగ్) రెండు విభాగాల్లోని పోస్టులను కూడా ఏఎఫ్‌క్యాట్ విధానంలో భర్తీ చేస్తారు. ఇందులో మూడు దశలు ఉంటాయి. అవి రాత పరీక్ష, ఏఎఫ్ఎస్‌బీ (ఎయిర్ ఫోర్స్ సెలక్షన్ బోర్డ్) టెస్టింగ్, మెడికల్ టెస్ట్.

### ఆన్‌లైన్.. 300 మార్కులు

రాత పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లీష్ మాధ్యమంలో ఉంటుంది. సమాధానాలను గుర్తించడానికి రెండు గంటల (120 నిమిషాలు) సమయం ఇస్తారు. ఇందులో జనరల్ అవేర్‌నెస్, వెర్బల్ ఎబిలిటీ ఇన్ ఇంగ్లీష్, న్యూమరికల్ ఎబిలిటీ, రీజనింగ్, మిలిటరీ ఆప్టిట్యూడ్ టెస్ట్ విభాగాల నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు 3 మార్కుల చొప్పున మొత్తం కేటాయించిన మార్కులు 300. నెగిటివ్ మార్కులు కూడా ఉన్నాయి. ప్రతి తప్పునకు ఒక మార్కు కోత విధిస్తారు. న్యూమరికల్ ఎబిలిటీ ప్రశ్నలు 10వ తరగతి స్థాయిలో, మిగతా విభాగాల ప్రశ్నలు డిగ్రీ స్థాయిలో ఉంటాయి.

- **ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్ (ఈకేటీ):** గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్) బ్రాంచ్‌ను ఎంపిక చేసుకున్న అభ్యర్థులు ఏఎఫ్‌క్యాట్‌తోపాటు ఇంజనీరింగ్ నాలెడ్జ్ టెస్ట్ (ఈకేటీ)కు హాజరవ్వాలి. ప్రశ్నపత్రం ఇంగ్లీష్ మాధ్యమంలో ఉంటుంది. సమాధానాలను గుర్తించడానికి 45 నిమిషాల సమయం ఇస్తారు. ఇందులో మెకానికల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల నుంచి 50 ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు 3 మార్కుల చొప్పున మొత్తం కేటాయించిన మార్కులు 150. నెగిటివ్ మార్కులు కూడా ఉన్నాయి. ప్రతి తప్పునకు ఒక మార్కు కోత విధిస్తారు. ఏఎఫ్‌క్యాట్, ఈకేటీపై అవగాహన కోసం వెబ్‌సైట్‌లో ప్రాక్టీస్ టెస్ట్‌ను పొందుపరిచారు.

### ఏఎఫ్ఎస్‌బీ టెస్టింగ్.. స్టేజ్-1, స్టేజ్-2

నిర్దేశించిన విధంగా రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి ఏఎఫ్ఎస్‌బీ ఆధ్వర్యంలో వారణాసి, మైసూర్, డెహ్రాడూన్, గాంధీనగర్ కేంద్రాల్లో పలు రకాల పరీక్షలు నిర్వహిస్తారు. ముందుగా ఫిజికల్ టెస్ట్‌లో అభ్యర్థులు 1.6 కిలోమీటర్ల దూరాన్ని పరిగెత్తడం ద్వారా 10 నిమిషాల్లో చేరుకోవాలి. 10 పుష్అప్స్, 3 చిన్ అప్స్ తీయగలగాలి. తర్వాత స్టేజ్-1, స్టేజ్-2 దశలు ఉంటాయి. స్టేజ్-1 స్క్రీనింగ్ దశ. ఇందులో ఇంటెలిజెన్స్ టెస్ట్, పిక్చర్ పర్‌స్పెషన్ టెస్ట్, డిస్కషన్ టెస్ట్ విభాగాల్లో అభ్యర్థులను పరీక్షిస్తారు. ఇందులో అర్హత సాధిస్తేనే స్టేజ్-2కు అనుమతిస్తారు. స్టేజ్-2లో సైకలాజికల్ టెస్ట్, గ్రూప్ టెస్ట్, ఇంటర్వ్యూ విభాగాలు ఉంటాయి. అయితే ఫ్లయింగ్ బ్రాంచ్ అభ్యర్థులకు వీటితోపాటు అదనంగా పైలట్ ఆప్టిట్యూడ్ బ్యాటరీ టెస్ట్ (పీఏబీటీ) నిర్వహిస్తారు.

### మెడికల్ టెస్ట్

ఏఎఫ్ఎస్‌బీ టెస్టింగ్‌లో నిర్దేశించిన విధంగా అర్హత సాధించిన వారికి ఎయిర్‌ఫోర్స్ సెంట్రల్ మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఏఎఫ్‌సీఎంఈ) - న్యూఢిల్లీ లేదా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏవియేషన్ మెడిసిన్ - బెంగళూరులలో మెడికల్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. ఈ విధంగా అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారిని శిక్షణకు ఎంపిక చేస్తారు.

### పర్మినెంట్ - షార్ట్ సర్వీస్

ప్రస్తుత నోటిఫికేషన్‌లోని పోస్టులకు పర్మినెంట్ కమిషన్ (పీసీ), షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) ఇస్తారు. పర్మినెంట్ కమిషన్ ఆఫీసర్‌గా చేరిన వారికి సదరు బ్రాంచ్‌లో, ర్యాంకుల ఆధారంగా పదవీ విరమణ వయసు వరకు కొనసాగే అవకాశం ఉంటుంది. షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)లో 14 ఏళ్లపాటు ఉద్యోగంలో సేవలందించి వైదొలగుతారు. మహిళలు ఎస్ఎస్‌సీ ఉద్యోగాలకు మాత్రమే అర్హులు. ఫ్లయింగ్ బ్రాంచ్‌లో పైలట్ పోస్టులన్నీ ఎస్ఎస్‌సీ కేటగిరీకి చెందుతాయి. గ్రౌండ్ డ్యూటీ పోస్టులను పర్మినెంట్, షార్ట్ సర్వీస్ కమిషన్ రెండు విభాగాల్లోనూ భర్తీ చేస్తారు. గ్రౌండ్ డ్యూటీ (టెక్నికల్, నాన్ టెక్నికల్) బ్రాంచ్‌కు ఎంపికయిన వారి ప్రాథమిక సర్వీసు కాలం 10 ఏళ్లు. గ్రౌండ్ డ్యూటీ అధికారుల సర్వీసు కాలాన్ని నాలుగేళ్లపాటు పొడిగించే అవకాశం ఉంది.

### ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- దరఖాస్తు ఫీజు: రూ. 250 (ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీకి మాత్రమే)
- దరఖాస్తుకు చివరి తేదీ: డిసెంబరు 30, 2019.
- వెబ్‌సైట్: https://afcat.cdac.in

### వేతనం, సౌకర్యాలు

ఎంపికయిన వారికి 2021, జనవరి నుంచి శిక్షణ ప్రారంభమవుతుంది (శిక్షణ ప్రారంభం నాటికి 25 ఏళ్లలోపు ఉన్నవారు అవివాహితులై ఉండాలి, వైధవ్యం పొందిన / విడాకులు తీసుకున్న వారిని కూడా శిక్షణకు అనుమతించరు). ఫ్లయింగ్, టెక్నికల్ బ్రాంచ్ అభ్యర్థులకు 74 వారాలు, గ్రౌండ్ డ్యూటీకి అభ్యర్థులకు 52 వారాలపాటు వైమానిక దళ శిక్షణ కేంద్రాల్లో ట్రైనింగ్ ఇస్తారు. శిక్షణలో భాగంగా ప్రాజెక్టు వర్కు, కేస్ స్టడీ, ఆన్ జాబ్ ట్రైనింగ్, గేమ్స్, స్విమ్మింగ్, వెపన్ ట్రైనింగ్, యోగా, ఫీల్డ్ క్రాఫ్ట్ ట్రైనింగ్, కల్చరల్ యాక్టివిటీ... మొదలైనవి ఉంటాయి. ఫ్లయింగ్ బ్రాంచ్‌కి ఎంపికయిన వారికి ముందుగా ఆరు నెలలపాటు ప్రాథమిక శిక్షణ ఉంటుంది. సాధారణంగా ఈ శిక్షణ దుండిగల్, హకీంపేట్, ఎలహంక, బీదర్‌లలో నిర్వహిస్తారు.



అనంతరం అభ్యర్థుల ప్రతిభ ప్రకారం ఫైటర్ పైలట్, ట్రాన్స్‌పోర్ట్ పైలట్, హెలికాప్టర్ పైలట్లుగా విడదీసి అందుకుతగ్గ శిక్షణను రెండు దశల్లో నిర్వహిస్తారు. ఫైటర్ పైలట్ కోర్సుకి ఎంపికయిన వారికి స్టేజ్-2 శిక్షణను 24 వారాలపాటు హకింపేటలో నిర్వహిస్తారు. స్టేజ్-3 శిక్షణ మరో 24 వారాలపాటు బీదర్‌లో కొనసాగుతుంది. ట్రాన్స్‌పోర్ట్ పైలట్‌గా ఎంపికయిన వారికి స్టేజ్-2, స్టేజ్-3 శిక్షణలు 48 వారాలపాటు ఎలహంకలో నిర్వహిస్తారు. హెలికాప్టర్ స్ట్రీమ్‌లో ఎంపికయిన వారికి హకింపేటలో 24 వారాలపాటు శిక్షణ కొనసాగుతుంది. అనంతరం మరో 24 వారాల పాటు స్టేజ్-3 శిక్షణను ఎలహంకలో నిర్వహిస్తారు. శిక్షణ సమయంలో నెలకు రూ.56,100 చొప్పున స్టయిఫండ్ చెల్లిస్తారు. ఉద్యోగంలో చేరిన వారికి రూ.56,100 మూలవేతనం లభిస్తుంది. అలవెన్సులు అదనం. మిలిటరీ సర్వీస్ పేలో భాగంగా ప్రతి నెలా రూ.15,500 చెల్లిస్తారు. అన్నీ కలిపి రూ.లక్షకు పైగా వేతనం లభిస్తుంది. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సు, పిల్లల ఎడ్యుకేషన్ అలవెన్సు, రాయితీ ధరలకు క్యాంటీన్, ఫర్నిచర్‌తో కూడిన నివాస సముదాయం, తక్కువ వడ్డీకి రుణాలు వంటి సదుపాయాలు ఉంటాయి.

## చిట్టిఫుల్



**చేసేయండి!**

### సరదా టేబుల్

నాలుగు గ్లాసుల మీద నాలుగు కత్తులు పెట్టి టేబుల్‌లా తయారుచేయవచ్చు. దానిపై పుస్తకం పెట్టినా నిలుస్తుంది.

ముందుగా ఒక గ్లాసును తిరగేసి దానిపై కత్తి పిడిభాగం పెట్టండి. కొనభాగం మీ చూపుడు వేలుపై పెట్టండి. ఇప్పుడు రెండో గ్లాసును మొదటి గ్లాసు ఎడమవైపు పెట్టండి. ఇంకో కత్తి తీసుకుని పిడిభాగం ఆ గ్లాసుపై పెట్టి కొనభాగం మొదటి కత్తిపై పెట్టాలి. తరువాత మూడో గ్లాసు తీసుకుని కత్తి కొనభాగం రెండో కత్తిపై పెట్టాలి. చివరగా నాలుగో కత్తి పిడిభాగం నాలుగో గ్లాసుపై పెట్టి, బొమ్మలో చూపించిన విధంగా కొనభాగం మొదటి కత్తి కింద నుంచి వచ్చి, మూడో కత్తిపై ఆనించాలి. ఇప్పుడు టేబుల్ సిద్ధం. వాటి మధ్యలో పుస్తకం పెట్టి చూడండి. కింద పడకుండా ఉంటుంది.

**కావలసినవి**

- నాలుగు గ్లాసులు
- ఒకేసైజు ఉన్న నాలుగు కత్తులు




**చుక్కలు కలిపి రంగులు వేయండి**



### పదాలను పట్టికలో కనిపెట్టండి

letter D

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| P | S | A | N | A | N | C | U | D | R | P |
| C | D | E | R | S | Y | P | R | R | U | C |
| A | O | U | D | O | O | R | L | A | B | D |
| X | L | C | L | J | C | J | L | G | M | O |
| E | H | R | O | B | D | T | K | O | A | N |
| D | I | A | C | S | R | C | E | N | I | U |
| O | N | B | K | K | U | R | A | F | N | T |
| L | N | M | R | I | M | R | U | L | E | S |
| L | C | E | P | A | O | A | R | Y | E | H |
| J | I | D | I | N | O | S | A | U | R | I |
| E | A | S | C | O | D | E | E | R | S | P |




### దారి కనుక్కోండి?



### సరైన నీడను కనిపెట్టండి?




### డైలీ సుడోకు -225

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | | | | | 8 | | | |
| 4 | | 1 | | | | | | |
| 2 | 8 | 9 | | 3 | 1 | | | |
| | | 5 | 2 | 1 | 6 | 7 | | |
| | | | | | | | | |
| | | 7 | 5 | 9 | 3 | 2 | | |
| | | | 4 | 5 | | 1 | 6 | 3 |
| | | | | | | 9 | | 4 |
| | | | 1 | | | | | 2 |

**సుడోకు - 224 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 4 | 8 | 6 | 9 | 5 | 2 | 7 | 3 |
| 3 | 6 | 9 | 2 | 4 | 7 | 5 | 8 | 1 |
| 7 | 2 | 5 | 1 | 3 | 8 | 9 | 6 | 4 |
| 8 | 7 | 3 | 5 | 1 | 4 | 6 | 2 | 9 |
| 9 | 1 | 2 | 3 | 7 | 6 | 4 | 5 | 8 |
| 4 | 5 | 6 | 9 | 8 | 2 | 3 | 1 | 7 |
| 6 | 8 | 7 | 4 | 2 | 3 | 1 | 9 | 5 |
| 5 | 3 | 1 | 8 | 6 | 9 | 7 | 4 | 2 |
| 2 | 9 | 4 | 7 | 5 | 1 | 8 | 3 | 6 |

**ఎలా పూరించాలి?** ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

epaper.andhrajyothy.com

# నాకు భయం లేదు!

- బాలకృష్ణ



సి. కల్యాణ్, వేదిక, బాలకృష్ణ, రవికుమార్, సోనాల్ చౌహాన్

"ప్రేక్షకులు ఉండగా నాకు ఎటువంటి భయం లేదు. కొత్తగా ప్రయత్నిస్తూ ఉంటాను. వెనకడుగు వేయను. నేను ఏ ప్రయోగం చేసినా ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారు" అని నందమూరి బాలకృష్ణ అన్నారు. ఆయన హీరోగా నటించిన తాజా చిత్రం 'రూలర్'. కెఎస్ రవికుమార్ దర్శకుడు. సి. కల్యాణ్ నిర్మాత. ఈ నెల 20న విడుదలవుతున్న ఈ సినిమా ప్రీరిలీజ్ ఫంక్షన్ విశాఖలో శనివారం రాత్రి నిర్వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ "నాన్నగారు (ఎన్టీఆర్) బాటలో నడుస్తూ... 'ఆదిత్య 369', 'శ్రీరామరాజ్యం', 'గౌతమీపుత్ర శాతకర్ణి', 'సింహా', 'లెజెండ్', 'మంగమ్మగారి మనవడు', 'ముద్దుల కృష్ణయ్య' వంటి విభిన్న చిత్రాలు చేశా. ఎన్నెన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించా. కల్యాణ్, రవికుమార్‌తో నా కాంబినేషన్‌లో వచ్చిన 'జై సింహా' విజయం ఇచ్చిన ప్రేరణతో ఈ 'రూలర్' చేశాం. రైతు నేపథ్యంలో సినిమా చేయాలనే కోరిక కొంతవరకూ ఈ సినిమాతో తీరింది. కెఎస్ రవికుమార్‌గారు ఒక శిల్పి, జక్కన్న. నాదీ, ఆయనదీ ఒక్కటే మనస్తత్వం. సినిమా అంటే మాకు పిచ్చి లేదు. ప్రేమ ఉంది. పిచ్చి వేరు, ప్రేమ వేరు. నటన అంటే ఏడవడమో, అరవడమో, నవ్వడమో కాదు... ఒక పరకాయ ప్రవేశం. ఇంకో ఆత్మలోకి ప్రవేశించడం. మన సమాజంలో ప్రేమించడం బదులు మహిళలపై ఎన్నో హత్యాచారాలు జరుగుతున్నాయి. వాటన్నిటినీ నేను తీవ్రంగా ఖండిస్తున్నా" అన్నారు.

"బాలకృష్ణగారు డ్యాన్సు చేసేటప్పుడు పాతికేళ్ల కుర్రాడిలా చేస్తారు. డైలాగులు చెప్పేటప్పుడు స్టార్ట్, కెమెరా, యాక్షన్ చెప్పగానే ఆయనలో ఒక పవర్ వస్తుంది" అని కెఎస్ రవికుమార్ అన్నారు.

"పండగలాంటి చిత్రమిది... 'జైసింహా'లా! అభిమానులు మీసం మెలేసేలా ఉంటుంది. భారీ కాస్టింగ్, నిర్మాణ వ్యయంతో 5 నెలల్లో దర్శకుడు సినిమా పూర్తి చేశారు" అని సి. కల్యాణ్ అన్నారు.

"బాలయ్యబాబుకు 'రూలర్' టైటిల్ 100 శాతం పర్‌ఫెక్ట్. ఆయన రూలర్ ఆఫ్ ఆర్ట్స్, హార్ట్స్. నటనతో, నడవడికతో అందరి మనసులు గెలుచుకున్నారు" అని బోయపాటి అన్నారు.

**పొరపాటు:** "నవ్య' నిన్నటి ఆదివారం సంచికలో ప్రచురితమైన పవన్‌కల్యాణ్ ఇంటర్వ్యూలో 'కళింగ కాలవీరుడు' పదాన్ని 'కళింగ ఖారవేలుడు'గా, 'సిపిఐ కూడా ఒకప్పుడు బీజేపీతో కలిసి ఎన్నికలకు వెళ్ళింది?' అనే వాక్యాన్ని 'సిపిఐ, బీజేపీ కలిసి తెలంగాణ కోసం పోరాటం చేశాయి'గా చదువుకోగలరు." **- ఎడిటర్**

# నచ్చిన చిత్రాలే చేస్తున్నా!



- కార్తీ

"అంచనాలను అందుకోగలనా? లేదా? అని ఆలోచించి చిత్రాలు చేయను. నాకు నచ్చిన చిత్రాలే చేస్తున్నా. ప్రతి చిత్రానికి 100 శాతం ఇవ్వాలని చూస్తా. అందువల్లే, 13 ఏళ్లలో 19 చిత్రాలు చేశా" అని కార్తీ అన్నారు. జ్యోతిక, కార్తీ అక్కాతమ్ముళ్లుగా నటించిన చిత్రం 'దొంగ'. మలయాళ 'దృశ్యం' ఫేమ్ జీతూ జోసెఫ్ దర్శకుడు. రావూరి వి. శ్రీనివాస్ నిర్మాత. ఈ నెల 20న సినిమా విడుదల కానుంది. కార్తీ మాట్లాడుతూ "ఇదొక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. భావోద్వేగాలు, సస్పెన్సూ ఉన్నాయి. నా పాత్ర 'ఊపిరి'లో శీనులా ఉంటుంది. ఆ పాత్ర, 'నా పేరు శివ'లో యాక్షన్, థ్రిల్ కలిపితే ఈ సినిమా. ఓ దొంగ మంచి మనిషిగా మారి అందరి హృదయాలు ఎలా దోచుకున్నాడనేది చిత్రకథ. వినగానే అక్కగా మా వదిన జ్యోతిక కనిపించారు. తండ్రిగా సత్యరాజ్, కీలక పాత్రలో షావుకారు జానకి నటించారు. ప్రతి పాత్రకూ ప్రాముఖ్యం ఉంటుంది. అనుభవజ్ఞులైన నటీనటులు ఉండడంతో రిలాక్స్‌గా సినిమా చేశా. జ్యోతికగారు తమిళ్ బాగా నేర్చుకున్నారు. నాకు పంచ్ డైలాగులు చెప్పి, 'నీ సినిమాలో వాడుకో' అంటున్నారు. 'ఖైదీ' తర్వాత మరోసారి చిరంజీవిగారి టైటిల్ కుదరడం హ్యాపీ" అన్నారు.













# ఈ వారంలోనూ మార్కెట్ సానుకూలమే

న్యూఢిల్లీ: ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న అమెరికా, చైనా వాణిజ్య ఒప్పందం, బ్రిటన్ ఎన్నికల్లో బోరిస్ జాన్సన్ విజయం అందించిన స్ఫూర్తితో మార్కెట్లలో ఈ వారంలో కూడా పాజిటివ్ ధోరణి కొనసాగవచ్చని విశ్లేషకులంటున్నారు. ఒకరి వస్తువులపై ఒకరు అదనపు సుంకాలు విధించుకోవడం ప్రస్తుతానికి విరమించాలని అమెరికా, చైనా అంగీకారానికి రావడం గత వారం మార్కెట్లన్నింటిలోనూ ఉత్తేజం నింపింది. అలాగే లిక్విడిటీ తగినంతగా అందుబాటులో ఉండడం కూడా ర్యాలీకి మద్దతు ఇచ్చిందంటున్నారు. ఈ పరిణామాలతో గత కొన్ని రోజులుగా ప్రపంచ మార్కెట్లన్నింటిలోనూ గత కొన్ని నెలలుగా నెలకొన్న భయాందోళనలు ఉపశమించాయని, ఈ ధోరణి ఈ వారంలో కూడా కొనసాగుతుందని రెలిగేర్ బ్రోకింగ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా అన్నారు. అమెరికా, చైనా డీల్‌పై మరింత స్పష్టత వచ్చినట్టయితే ప్రస్తుత ధోరణి మరి కొంత కాలం కొనసాగే ఆస్కారం ఉన్నట్టు మోదీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమ్కా అన్నారు. అయితే ఈ వారంలో టోకు ధరల సూచి గణాంకాలను మార్కెట్ వర్గాలు ఆసక్తిగా తిలకించవచ్చునని పలువురు భావిస్తున్నారు. అలాగే రూపాయి కదలికలు, క్రూడాయిల్ ధరలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేయవచ్చునంటున్నారు.

కాగా గత వారం ర్యాలీలో ఆర్ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ అధికంగా లాభపడ్డాయని గణాంకాలు తెలుపుతున్నాయి. ఆర్ఐఎల్ మార్కెట్ విలువ రూ.17,439.74 కోట్లు పెరిగి రూ.10,03,147 కోట్లకు చేరింది. సెన్సెక్స్‌లోని మొత్తం టాప్ 10 కంపెనీల్లో ఆరు కంపెనీల మార్కెట్ విలువ రూ.65,060 కోట్లు పెరిగింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ బ్యాంక్, ఎస్‌బీఐ కూడా లాభపడిన కంపెనీల్లో ఉండగా టీసీఎస్, హెయూఎల్, ఇన్ఫోసిస్, ఐటీసీ మాత్రం నష్టపోయాయి.

## ఈజ్‌మైట్రిప్ పబ్లిక్ ఇష్యూ

**» రూ.510 కోట్ల సమీకరణ**

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ట్రావెల్ కంపెనీ ఈజ్‌మైట్రిప్ తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రానుంది. ఇందుకు సంబంధించిన పత్రాలను క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి కంపెనీ సమర్పించింది. ఇష్యూ ద్వారా కంపెనీ రూ.510 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. కంపెనీ వ్యవస్థాపకులైన నిశాంత్ పిట్టి, రికాంత్ పిట్టిలు ఒక్కొక్కరు రూ.255 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ కింద విక్రయించనున్నారు.



# అమ్మే వరకు ఎగరాలి

## అప్పటి వరకు ప్రభుత్వ 'సాయం' కావాలి : ఎయిర్ ఇండియా సీఎండీ

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా ఆర్థిక పరిస్థితి రోజు రోజుకీ క్షీణిస్తోంది. కొత్తగా సేకరించే రూ.2,400 కోట్ల రుణ చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వం వెంటనే 'హామీ' ఇవ్వాలని కంపెనీ కోరింది. దీనిపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నోరు మెదప లేదు. ఈ నేపథ్యంలో 'అమ్మేవరకైనా ఎయిర్ ఇండియా బతికి ఉండాలి. ప్రభుత్వానికి ఈ విషయం ఎందుకు అర్థం కావడం లేదో నాకు ఆశ్చర్యంగా ఉంది' అని ఎయిర్ ఇండియా సీఎండీ అశ్వని లోహానీ తన ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేశారు. పీకల్లోతు నష్టాల్లో ఉన్న ఎయిర్ ఇండియాకు ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం ఈక్విటీ మూలధనం రూపంలో పైసా కూడా సమకూర్చలేదు.

### అప్పులు రూ.74,000 కోట్లు

ప్రస్తుతం ఎయిర్ ఇండియా అప్పుల భారం రూ.74,000 కోట్ల వరకు ఉంది. ఇందులో దాదాపు రూ.60,000 కోట్లు విమానాల కొనుగోలు కోసం చేసిన ఖర్చు. మిగతా రూ.14,000 కోట్లు ఇంధనం, విడి భాగాలు, వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పులు. ఇందులో రూ.30,000 కోట్ల అప్పుల చెల్లింపు భారాన్ని ప్రభుత్వం తీసుకుంది. అయినా మిగిలిన అప్పులపై కంపెనీ ప్రతి నెలా రూ.225 కోట్ల వరకు వడ్డీలు చెల్లిస్తోంది. కంపెనీకి వచ్చే ఆదాయం, ఖర్చుల మధ్యా ఇదే వ్యత్యాసం ఉంటోంది. ఈ మొత్తాన్ని భర్తీ చేసుకునేందుకైనా తక్షణం రూ.2,400 కోట్లు అప్పుగా సేకరించేందుకు 'చెల్లింపు'ల హామీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరింది.

ఎయిర్ ఇండియాను ప్రైవేట్ కంపెనీలకు అమ్మేసేలోపు కంపెనీ ఆర్థిక పరిస్థితిని గణనీయంగా మెరుగు పరచడమూ

### దశ తిరగడం కష్టం

ఆచరణ సాధ్యంకాదని లోహానీ స్పష్టం చేశారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలోనూ ఎయిర్ ఇండియా రూ.8,556 కోట్ల నికర నష్టాలు మూటగట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు.

# నేటి నుంచి ఆర్థిక మంత్రి 'బడ్జెట్' చర్చలు



## డిమాండ్, వృద్ధి రేటు పెంపుపైనే మంతనాలు

న్యూఢిల్లీ: వచ్చే కేంద్ర బడ్జెట్ తయారీ ప్రక్రియ ఊపందుకుంది. డిమాండ్‌తోపాటు వృద్ధి రేటు పెంచేందుకు బడ్జెట్‌లో తీసుకోవలసిన చర్యలపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈసారి ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. ఇందు కోసం సోమవారం నుంచి ఈ నెల 23 వరకు పారిశ్రామిక సంఘాలు, రైతు సంఘాలు, ఆర్థికవేత్తలతో చర్చలు జరుపుతారు. సోమవారం ఉదయం స్టార్టప్ కంపెనీలు, ఫిన్‌టెక్, డిజిటల్ రంగాలకు చెందిన కంపెనీల ప్రతినిధులతో సమావేశమవుతారు. సోమవారం ఫైనాన్షియల్, క్యాపిటల్ మార్కెట్ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు.

### చర్చించే అంశాలు..

వ్యాపార సరళీకరణ, ప్రైవేటు పెట్టుబడులను దెబ్బతీస్తున్న రెగ్యులేటరీ నిబంధనల సడలింపు, ప్రభుత్వ పాత్ర, ఎగుమతుల పెంపువంటి అంశాలపై సలహాలు, సూచనలతో రావాలని ఆర్థిక శాఖ అధికారులు కోరినట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

### పరిశ్రమవర్గాల సూచనలు

దేశీయ మార్కెట్లో డిమాండ్ పెంచడం ద్వారా వృద్ధి రేటు పెంచేందుకు పరిశ్రమవర్గాలు ఇప్పటికే ఈ కింది సూచనలు చేశాయి.

- వ్యక్తిగత వార్షిక ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలి.
- ఆదాయ పన్ను చట్టంలోని 80సీ కింద ఉన్న పన్ను మినహాయింపు పెట్టుబడుల పరిమితినీ రూ.1.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచాలి.

2019 సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. సెప్టెంబరులో కార్పొరేట్ పన్ను రేటు 10 శాతం తగ్గించినా పరిస్థితిలో పెద్దగా మార్పు లేదు. దీంతో వచ్చే బడ్జెట్‌లో డిమాండ్, పెట్టుబడులు పెంపునకు ప్రత్యేక చర్యలు తీసుకుని వృద్ధి రేటును మళ్లీ గాడిలో పెట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

### మౌలికంలో 'ఎఫ్‌డీఐ'పై సమీక్ష!

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ)కు సంబంధించిన వివిధ అంశాలను సమీక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా టెలికాంతోపాటు వ్యూహాత్మకంగా కీలకమైన ప్రాంతాలు, సరిహద్దు ప్రాంతాల్లోని మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఎఫ్‌డీఐ అనుమతులను సమగ్రంగా సమీక్షించేందుకు చర్యలు చేపట్టింది. ఈశాన్య రాష్ట్రాలతోపాటు వ్యూహాత్మంగా కీలకమైన ప్రాంతాలు, సరిహద్దు ప్రాంతాల్లోని మౌలిక ప్రాజెక్టుల్లోనూ ఆటోమేటిక్ పద్ధతిలో ఎఫ్‌డీఐని స్వేచ్ఛగా అనుమతిస్తున్నారు. దీంతో దేశ భద్రతకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

# వచ్చే ఏడాది ఇన్‌ఫినిక్స్ స్మార్ట్ టీవీలు

న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్లను తయారు చేస్తున్న ఇన్‌ఫినిక్స్ కంపెనీ వచ్చే ఏడాది ప్రథమార్ధంలో భారత మార్కెట్లోకి తన స్మార్ట్ టీవీలను తీసుకురావాలనుకుంటోంది. దీంతో ఈ కంపెనీ కూడా షామీ, మోటరోలా, వన్‌ప్లస్ వంటి కంపెనీల సరసన చేరనుంది. స్మార్ట్ టీవీల విభాగంలోకి ప్రవేశించడంతోపాటు స్మార్ట్ యాక్సెసరీల విభాగాల్లోకి విస్తరిస్తున్నట్టు ఇన్‌ఫినిక్స్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అనిష్ కపూర్ తెలిపారు. అయితే టీవీలకు సంబంధించిన ఫీచర్లను మాత్రం ఆయన వెల్లడించలేదు. చైనాకు చెందిన ట్రాన్సియన్ గ్రూప్‌నకు చెందినదే ఇన్‌ఫినిక్స్. ఈ కంపెనీ భారత్‌లోని రూ.10,000కన్నా తక్కువ ధర కలిగిన మొబైల్ ఫోన్ల విభాగంపై దృష్టిసారిస్తోంది. ఇప్పటికే పలురకాల మొబైల్ ఫోన్లను కూడా విడుదల చేసింది. కాగా ఇప్పటికే పలు కంపెనీలు స్మార్ట్ టీవీలను తీసుకువచ్చాయని, అయినప్పటికీ భారత మార్కెట్లో ఇంకా అవకాశాలున్నాయని కపూర్ తెలిపారు. షామీ, సామ్‌సంగ్, ఎల్‌జీ, మైక్రోమాక్స్, మోటరోలా కంపెనీలు స్మార్ట్ టీవీలను తెచ్చాయి. ప్రీమియం స్మార్ట్‌ఫోన్ల కంపెనీ వన్‌ప్లస్ కూడా రెండు ప్రీమియం టీవీ మోడళ్లను విడుదల చేసింది. ఇటీవలే నోకియా స్మార్ట్ టీవీని ఫ్లిప్‌కార్ట్ విడుదల చేసింది. భారత్‌లో టీవీల మార్కెట్ పరిమాణం వార్షికంగా దాదాపు 1.25 కోట్ల యూనిట్లుగా ఉందని అంచనా. ఇందులో సామ్‌సంగ్, సోనీ, ఎల్‌జీ కంపెనీల వాటా నాలుగింట మూడువంతులుందని అంచనా వేస్తున్నారు.

# ఇళ్ల అమ్మకాలు 4% పెరగొచ్చు

## ఈ ఏడాదిపై అనరాక్ అంచనా



న్యూఢిల్లీ: ఇళ్లకు డిమాండ్ నిస్తేజంగా ఉందని, నగదు కొరతతోపాటు ఆర్థిక వ్యవస్థలో మందగమనం వంటి అంశాలు ఇళ్ల విక్రయాలను ప్రభావితం చేస్తున్నాయని ప్రాపర్టీ బ్రోకరేజ్ సంస్థ అనరాక్ వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాదిలో ఏడు ప్రధాన నగరాల్లో (ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్), నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్), బెంగళూరు, పుణే, హైదరాబాద్, చెన్నై, కోల్‌కతా) ఇళ్ల అమ్మకాలు దాదాపు 4 శాతం పెరిగి 2.58 లక్షల యూనిట్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తోంది. వినియోగంలో క్షీణత, పెట్టుబడి ఆసక్తి లేకపోవడం, ప్రపంచ మందగమనం వంటివి వృద్ధిని ప్రభావితం చేస్తున్నాయని అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్ ఛైర్మన్ అనుజ్ పురి తెలిపారు. ఇక భారత ఆర్థిక వ్యవస్థలో వృద్ధి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో 4.5 శాతానికి తగ్గిన విషయం తెలిసిందే.

- ఈ ఏడాదికి అనరాక్ అంచనా ఏవిధంగా ఉందంటే.. ఈ సంవత్సరంలోని నాలుగు త్రైమాసికాల్లో కలిపి ఇళ్ల అమ్మకాలు 2,58,410 యూనిట్లుగా ఉండవచ్చు. నాలుగో త్రైమాసికంలో 56,200 ఇళ్లు అమ్ముడవుతాయని అనరాక్ భావిస్తోంది. కాగా గత ఏడాదిలో ఇళ్ల అమ్మకాలు 2,48,300 యూనిట్లుగా ఉన్నాయి.
- ఈ ఏడాది ప్రథమార్ధంలో ఇళ్ల అమ్మకాలు మెరుగ్గానే ఉన్నాయి. కానీ మూడో త్రైమాసికంలో డిమాండ్ తగ్గింది.
- దేశ ఆర్థిక వ్యవస్థలో పరిస్థితి ఏవిధంగా ఉందో తెలుసుకోవడానికి రియల్ ఎస్టేట్ రంగం ఒక కొలమానంగా ఉపయోగపడుతోంది.
- డిమాండ్ నిస్తేజంగా ఉన్న నేపథ్యంలో చాలా రియల్ ఎస్టేట్ కంపెనీలు తమ ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోతున్నాయి. దీని వల్ల కంపెనీలపైనేకాకుండా కొనుగోలుదారులపైనా ప్రభావం పడుతోంది. కొన్ని కంపెనీలు రియల్ ఎస్టేట్ రంగం నుంచి ఇతర రంగాలకు విస్తరించాయి. ఈ కంపెనీ కొంత మెరుగ్గా అమ్మకాలను నమోదు చేసుకోగలిగాయి. వీటి రాబడిలోనూ మంచి వృద్ధి నమోదైంది.
- కొనుగోలుదారులు రెడీ టూ మూవ్ లేదా పూర్తయిన ఇళ్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రాజెక్టు ప్రారంభంలో బుకింగ్ చేసుకుని అది పూర్తయ్యే వరకు వేచిచూసేంత ఓపిక కొనుగోలుదారుల్లో ఉండటం లేదు. ఒకవేళ ప్రాజెక్టు నిలిచిపోతే పరిస్థితి ఏమిటన్న ఆందోళన కూడా కొంత మంది కొనుగోలుదారుల్లో వ్యక్తం అవుతోంది.
- ప్రభుత్వం నిలిచిపోయిన ప్రాజెక్టుల కోసం రూ.25,000 కోట్ల నిధిని ప్రకటించిన విషయం తెలిసిందే. దీని వల్ల ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు.
- ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తున్న నేపథ్యంలో అందుబాటు ధరల్లో గృహాలకు గిరాకీ ఆశించిన స్థాయిలోనే ఉంటోంది. మొదటిసారి ఇళ్లు కొనుగోలు చేస్తున్న వారికి రూ.3.5 లక్షల పన్ను మినహాయింపు కల్పించడం కూడా అమ్మకాల వృద్ధికి దోహదపడుతోంది.
- లగ్జరీ, అల్ట్రా లగ్జరీ విభాగంలో కొనుగోలుదారుల ఆసక్తి పరిమిత స్థాయిలోనే ఉంది. కో-లివింగ్, స్టూడెంట్ హౌసింగ్ విభాగంలో డిమాండ్ జోరుగా ఉంది.

## 10 శాతం పెరుగుదల ఆశిస్తున్నాం: ట్రయంఫ్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జూన్‌లోపు భారత్‌లో తమ బైకుల అమ్మకాలు 5 నుంచి 10 శాతం వరకు పెరుగుతాయని బ్రిటన్‌కు చెందిన ట్రయంఫ్ మోటార్‌సైకిల్స్ ఆశాభావం వ్యక్తం చేసింది. జూలై-జూన్‌ను ఆర్థిక సంవత్సరంగా పరిగణించే ట్రయంఫ్, వచ్చే నెల నుంచి 2020 జూన్‌లోపు రెండు కొత్త వాహనాలను తీసుకురావాలని యోచిస్తోంది. అవి తమ వృద్ధికి దోహదపడతాయని ధీమా వ్యక్తం చేస్తోంది. రూ.18 లక్షల ధర కలిగిన ప్రీమియం మోడల్ రాకెట్ 3ఆర్‌ను ఇటీవలే విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇకపై తమనుంచి వచ్చే బైకులన్నింటినీ బీఎస్-6 నిబంధనలకు అనుగుణంగానే రూపొందించనున్నామని ట్రయంఫ్ పేర్కొంది. గత ఏడాది సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే.. ఈసారి 9 నుంచి 10 శాతం వృద్ధిని సాధించామని, డిసెంబరులో సైతం 5 నుంచి 10 శాతం వృద్ధిని ఆశిస్తున్నామని వెల్లడించింది. ఇప్పటి స్థాయిలోనే అమ్మకాలు కొనసాగితే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1000 మోటార్‌సైకిళ్లను విక్రయిస్తామని సంస్థ ధీమా వ్యక్తం చేసింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

| | | | |
|---|---|---|---|
| 15వ తేదీకి.. | | విజయవాడ | 452 |
| హైదరాబాద్ | 433 | విశాఖపట్నం | 470 |
| 16వ తేదీకి.. | | వరంగల్ | 436 |
| చిత్తూరు | 458 | డజను గుడ్లు రూ. 66 | |
| గోదావరి | 452 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 87 | విజయవాడ | 94 |
| వరంగల్ | 89 | గుంటూరు | 94 |
| మహబూబ్‌నగర్ | 87 | ఒంగోలు | 96 |
| కరీంనగర్ | 87 | చిత్తూరు | 91 |
| కర్నూలు | 87 | నెల్లూరు | 91 |
| విశాఖపట్నం | 97 | అనంతపురం | 82 |
| గోదావరి | 92 | | |

# ఉద్ధవ్ ఠాక్రే ఇంటి ముందు పీఎంసీ బ్యాంక్ డిపాజిటర్ల నిరసన

**» 50 మంది అరెస్ట్.. న్యాయం చేస్తామని సీఎం హామీ**

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే నివాసం వెలుపల నిరసన తెలిపిన 50 మందికి పైగా పంజాబ్ అండ్ మహారాష్ట్ర కోఆపరేటివ్ (పీఎంసీ) బ్యాంకు డిపాజిటర్లను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం డిపాజిటర్ల తరఫున వచ్చిన ప్రతినిధులతో ఠాక్రే మాట్లాడారు. బ్యాంకు ఖాతాదారులకు తమ ప్రభుత్వం న్యాయం చేస్తుందని భరోసా ఇచ్చారు. ఆదివారంనాడు ఉదయం దాదాపు 500 మంది పీఎంసీ బ్యాంకు డిపాజిటర్లు బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో ఉన్న ఆర్‌బీఐ కార్యాలయం ముందుకు చేరుకున్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిని కలుసుకునేందుకు బాంద్రాలో ఉన్న ఆయన నివాసం వైపు వెళ్లారని పోలీసులు తెలిపారు. వీరంతా ముఖ్యమంత్రి నివాసం వెలుపలి గేటు వద్ద గుమిగూడి ఆర్‌బీఐకి వ్యతిరేకంగా నినాదాలు చేశారని చెప్పారు.

## 60 శాతం పెరిగిన ఎయిర్ ప్యూరిఫయర్ల అమ్మకాలు



న్యూఢిల్లీ: ఢిల్లీ-ఎన్‌సీఆర్, ఉత్తరాదిలో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగిన విషయం తెలిసిందే. ఫలితంగా స్వచ్ఛమైన గాలిని అందించే ఎయిర్ ప్యూరిఫయర్లకు డిమాండ్ ఎక్కువైంది. అక్టోబరు, నవంబరు నెలల్లో ఎయిర్ ప్యూరిఫయర్ల అమ్మకాలు 60 శాతం వరకు పెరిగాయి. ఫిలిప్స్, బ్లూఎయిర్, పానసోనిక్, యురేకా, ఫోర్బ్స్, షార్ప్, షామీ, బ్లూస్టార్ వంటి కంపెనీల ఎయిర్ ప్యూరిఫయర్ల అమ్మకాలు రెండంకెల వృద్ధిని నమోదు చేశాయి. ద్వితీయ శ్రేణి నగరాలైన లక్నో, కాన్పూర్‌లలోనూ ఎయిర్ ప్యూరిఫయర్లకు డిమాండ్ పెరిగినట్టు కంపెనీలు చెబుతున్నాయి. ఈ ఉత్పత్తుల అమ్మకాల్లో ఉత్తరాది రాష్ట్రాల వాటాయే సగానికి మించి ఉంది. "ఈ ఏడాదిలో దేశంలో ఎయిర్ ప్యూరిఫయర్ల మార్కెట్ రూ.450 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే అమ్మకాల్లో వృద్ధి 60 శాతం వరకు ఉంది" అని ఫిలిప్స్ పర్సనల్ హెల్త్ (భారత ఉపఖండం) వైస్ ప్రెసిడెంట్ గుల్బహార్ తౌరణి తెలిపారు.

## ఉద్యోగుల్ని తగ్గించే యోచన లేదు: టాటా మోటార్స్

న్యూఢిల్లీ: దేశీయంగా మార్కెట్ నెమ్మదించినప్పటికీ.. ఉద్యోగుల సంఖ్యను తగ్గించే యోచన తమకు లేదని టాటా మోటార్స్ స్పష్టం చేసింది. ఆ ఆలోచన ఉంటే.. ఇప్పటికే అమలు చేసేవారిమని వివరించింది. మున్ముందు మరిన్ని ఉత్పత్తుల్ని తీసుకురానున్న నేపథ్యంలో.. ఈ రంగం మళ్లీ పుంజుకుంటుందన్న ఆశాభావంతో ఉన్నట్లు తెలిపింది. టాటా నుంచి త్వరలో ఆల్ట్రోజ్, నెక్సాన్ ఈవీ, గ్రావిటాస్ ఎస్‌యూవీ వాహనాలు రానున్నాయి. దీంతో పాటు బీఎస్-6 నిబంధనలకు అనుగుణంగా ఉత్పత్తి మారాల్సిన అవసరం కూడా ఉందని టాటా గుర్తు చేసింది. తమకు వెన్నెముక వంటి వాణిజ్య వాహనాల విభాగాన్ని పటిష్ఠపరిచామని, మందగమన దశను ఇబ్బందుల్లేకుండా దాటగలమని ధీమా వ్యక్తం చేసింది. టాటా మోటార్స్‌లో ప్రస్తుతం 83 వేల మంది పనిచేస్తున్నారు. ఇక జూలై-సెప్టెంబరు త్రైమాసికంలో గత ఏడాదితో పోలిస్తే.. ఏకంగా 44 శాతం అమ్మకాల్ని టాటా కోల్పోయింది. గత ఏడాది రూ.109.14 కోట్ల లాభాన్ని ఆర్జించగా.. ఈ ఏడాది రూ.1281 కోట్ల నష్టాన్ని నమోదు చేయడం గమనార్హం.

**టెక్ వ్యూ**

# తదుపరి నిరోధం 12050



వి సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కరెక్షన్‌ను కొనసాగిస్తూ ప్రారంభమై ప్రధాన మద్దతు స్థాయి 11800 వరకు దిగజారినా బలమైన పునరుజ్జీవంతో చివరి మూడు రోజుల్లో మంచి ర్యాలీ సాధించింది. చివరికి 160 పాయింట్ల లాభంతో వారం గరిష్ఠ స్థాయిల్లో 12000 వద్ద పాజిటివ్‌గా ముగిసింది. స్వల్పకాలిక మద్దతు స్థాయిల్లో సాధించిన ఈ బలమైన రికవరీతో తక్షణ కరెక్షన్ ముప్పును నివారించుకున్నట్టు కనిపిస్తోంది. టెక్నికల్‌గా ప్రధాన ట్రెండ్ ఎగువకే ఉంది. అదే సమయంలో ప్రధాన నిరోధ స్థాయి, ఆల్‌టైమ్ హై 12150 కన్నా దిగువన కొనసాగుతోంది. గతంలో ఈ స్థాయిల్లోనే రెండుసార్లు బలమైన రియాక్షన్‌లో పడింది. మూడోసారి ఈ స్థాయిలో పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉన్నందు వల్ల స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. గత ఆరు వారాల్లో ఈ కీలక స్థాయిలో సైడ్‌వేస్ ధోరణిలో ఉండి కరెక్షన్‌లో పడినా బలంగా నిలదొక్కుకోవడం కనిష్ఠ స్థాయిల్లో కొనుగోళ్ల మద్దతు లభిస్తోందనడానికి సంకేతం.

**బుల్లిష్ స్థాయిలు:** మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 12120 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 12160. గత నెల 28వ తేదీన ఏర్పడిన ఈ గరిష్ఠ స్థాయి కన్నా పైన బలంగా క్లోజయినప్పుడే మార్కెట్ కొత్త గరిష్ఠ స్థాయిలకు పురోగమించగలుగుతుంది.

**బేరిష్ స్థాయిలు:** బలహీనత ప్రదర్శించినా భద్రత, తక్షణ అప్‌ట్రెండ్ ఆశలు నిలబెట్టుకోవడం కోసం ప్రధాన మద్దతు స్థాయి 12000 కన్నా పైన బలంగా నిలదొక్కుకోవాలి. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 11920, 11800. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ తప్పదు.

**బ్యాంక్ నిఫ్టీ:** ఈ సూచీకి తదుపరి నిరోధం 32200. ఇదే గత నెలలో ఏర్పడిన చారిత్రక గరిష్ఠ స్థాయి. ఆ పైన నిలదొక్కుకుంటే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది.

**స్వల్పకాలిక వ్యూహం:** స్వల్పకాలిక ట్రేడర్లు 11800 వద్ద గట్టి స్టాప్‌లాస్‌తో స్వల్పకాలిక బై పొజిషన్లు కొనసాగించవచ్చు.

**పాటర్న్:** స్వల్పకాలిక అప్‌ట్రెండ్ కోసం 12160 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్"ను దాటాలి. గత వారంలో బలమైన డబుల్ బాటమ్ పాటర్న్ ఏర్పడింది. అలాగే 50 డీఎంఏ కన్నా పైన రికవరీ సాధించింది. ఇది పాజిటివ్ ట్రెండ్ సంకేతం.




**టైమ్ :** ఈ సూచి ప్రకారం సోమవారం తదుపరి రివర్సల్‌కు ఆస్కారం ఉంది. శుక్ర వారం మరో రివర్సల్ ఉండవచ్చు.

**టెక్ మహీంద్రా (రూ.763) - కొనుగోలు స్థాయిలకు చేరువలో..**

| | | |
|---|---|---|
| రూ.765 ఎగువన అప్‌ట్రెండ్ | మొదటి నిరోధం రూ.800 | రెండో నిరోధం రూ.840 |
| రూ.750 దిగువన డౌన్‌ట్రెండ్ | మొదటి మద్దతు రూ.720 | రెండో మద్దతు రూ.695 |

**సోమ వారం స్థాయిలు** — నిరోధం: 12120, 12160 — మద్దతు: 12045, 12000

www.sundartrends.in

**ఆస్ట్రో గైడ్**

# 12300 పైన ముగిస్తే బుల్లిష్

**(డిసెంబరు 16-20 తేదీల మధ్య వారానికి)**

**గత వారం నిఫ్టీ : 12082 (+165)**



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం పాయింట్ల 12099-11832 పాయింట్ల మధ్య కదలాడి 165 పాయింట్ల లాభంతో 12082 వద్ద వారం గరిష్ఠ స్థాయిలో పాజిటివ్‌గా ముగిసింది.

- గత మంగళ, శుక్రవారాల నడుమ (2, 6 తేదీలు) చంద్రుడు కుంభ, మీన రాశుల్లో సంచరించిన సమయంలో ఏర్పడిన పరిధి 12069-11889. ఇది రాబోయే మూడు వారాలకు కీలకం. గరిష్ఠ స్థాయికి పైన బుల్లిష్‌గాను, కనిష్ఠ స్థాయికి దిగువన బేరిష్‌గాను భావించాలి. గత వారం నిఫ్టీ 12087 వరకు వెళ్లింది.
- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 11996, 11778, 11443, 11492 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.
- నిఫ్టీ ప్రస్తుతం అన్ని డీఎంఏలకన్నా పైన ఉంది. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా (గోల్డెన్ క్రాస్)పైకి రావడం దీర్ఘకాలిక ట్రెండ్ బుల్లిష్ అయిందనేందుకు సంకేతం. ఈ వారాంతంలో 12300కన్నా పైన ముగిస్తే స్వల్పకాలిక ట్రెండ్ బుల్లిష్ అవుతుంది.

**బ్రేకౌట్ స్థాయి :** 12300 **బ్రేక్‌డౌన్ స్థాయి :** 11850
**నిరోధ స్థాయిలు :** 12225, 12300 (12150 పైన బుల్లిష్)
**మద్దతు స్థాయిలు :** 11925, 11850 (12000 దిగువన బేరిష్)

### ఇన్వెస్టర్లకు సూచన...

వారం ప్రారంభ స్థాయి అత్యంత కీలకం. ఇండెక్స్ గత వారం ప్రారంభ స్థాయి కన్నా పైన ట్రేడవుతూ ఉంటే లాంగ్ పొజిషన్లను పరిశీలించవచ్చు.

**గ్రహగతులు**

- కర్కాటకంలోని ఆశ్లేష పాదం 1 నుంచి కన్యలోని హస్త పాదం 3 మధ్యలో చంద్ర సంచారం
- వృశ్చికంలోని జ్యేష్ఠ పాదం 4 నుంచి ధనుస్సులోని మూల పాదం 2 మధ్యలో రవి సంచారం
- వృశ్చికంలోని అనూరాధ పాదం 4 నుంచి ఆశ్లేష పాదం 2 మధ్యలో బుధ సంచారం
- కర్కాటకంలోని ఉత్తరాషాఢ పాదం 2-3 మధ్యలో శుక్ర సంచారం
- తులలోని విశాఖ పాదం 1-2 మధ్యలో కుజ సంచారం
- ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 4లో వృశ్చిక నవాంశలో శని సంచారం
- ధనుస్సులోని మూల పాదం 3లో మిథున నవాంశలో బృహస్పతి సంచారం
- మిథునంలోని ఆర్ద్ర పాదం 3లో రాహువు, ధనుస్సులోని పూర్వాషాఢ పాదం 1లో కేతువు సంచారం

## సాధారణంగా మెరుగు (సోమవారానికి)

**తిథి:** మార్గశిర బహుళ పంచమి; నక్షత్రం : ఆశ్లేష

**అప్రమత్తం:** కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ నక్షత్ర జాతకులు, సింహ, ధనుస్సు రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు: 9.41**

**ధోరణి:** నిఫ్టీ ఫ్యూచర్స్ మెరుగ్గా ప్రారంభమై 12.50 వరకు అదే ధోరణిలో ట్రేడ్‌కావచ్చు. ఆ తర్వాత 2.25 వరకు నిలకడగాను, తదుపరి చివరి వరకు మరోసారి మెరుగ్గాను ట్రేడయ్యే ఆస్కారం ఉంది.

**ట్రేడింగ్ వ్యూహం:** నిఫ్టీ ఫ్యూచర్స్ 9.30 సమయానికి ఎటిపికన్నా పైన ఉంటే లాంగ్ పొజిషన్లు తీసుకుని 12.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.30 సమయానికి తిరిగి ఎటిపి పైకి వస్తే మరిన్ని లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయానికి క్లోజ్ చేసుకోవాలి.

**నిరోధం: 12130, 12165 మద్దతు స్థాయిలు: 12045, 12105**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

## డీఎస్సీ నియామకాలు ఇంకెప్పుడు?

(మొదటి పేజీ తరువాయి)

అంటున్నారు. కొంతకాలంగా నిరుద్యోగులను ఊరిస్తూ పాఠశాల విద్యాశాఖ కాలయాపన చేస్తోంది. పరీక్షల నుంచి ఫలితాల విడుదల వరకూ తరచూ షెడ్యూల్స్ మారుస్తూ నిరుద్యోగుల ఉత్సాహంపై నీళ్లు చల్లుతోంది. లక్షలాది మంది అభ్యర్థులకు సంబంధించిన డీఎస్సీ నియామకాలు నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తిచేయడంలో విఫలమైందని యంత్రాంగంపై విమర్శలు వస్తున్నాయి.

### కోర్టు కేసుల్లేకపోయినా..

స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ, ప్రిన్సిపాల్, పీజీటీ, టీజీటీ, లాంగ్వేజ్ పండిట్, పీఈటీ, ఆర్ట్స్, క్రాఫ్ట్, డ్రాయింగ్, మ్యూజిక్ పోస్టుల భర్తీ కోసం ఈ నోటిఫికేషన్ జారీచేశారు. గత ఏడాది డిసెంబరు 6 నుంచి ఈ ఏడాది జనవరి 2 వరకూ రాత పరీక్షలు నిర్వహించారు. జనవరిలోనే పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. మెరిట్ లిస్టుల తయారీకి అసాధారణ సమయం తీసుకున్నారు. జిల్లాలవారీగా మెరిట్ లిస్టులో ఉన్న అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ కోసం ఈ ఏడాది జూన్ 2న షెడ్యూల్ ఇచ్చారు. కానీ దాదాపు ఏడు నెలలుగా వెరిఫికేషన్ ప్రక్రియను సాగదీస్తూనే ఉన్నారు. కోర్టు కేసుల కారణంగానే నియామకాలు ఆలస్యం అవుతున్నాయని పాఠశాల విద్యాధికారులు చెబుతున్నారు. కానీ దాదాపు 6వేలకుపైగా టీచర్ పోస్టులకు సంబంధించి ఎలాంటి కోర్టు కేసులూ లేకపోయినా నియామకాలు చేయడం లేదని సంబంధిత అభ్యర్థులు చెబుతున్నారు. మోడల్ స్కూళ్లలోని ప్రిన్సిపాల్, పీజీటీ, టీజీటీ పోస్టులతో పాటు స్కూల్ అసిస్టెంట్స్, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, డ్రాయింగ్, ఎస్‌జీటీ (ఉర్దూ, తమిళం, కన్నడ) పోస్టులకు సంబంధించి కోర్టులో ఎలాంటి కేసులూ లేవని వారు స్పష్టం చేస్తున్నారు.

### నార్మలైజేషన్ కోసం కోర్టుకు..

నోటిఫికేషన్‌లో పేర్కొన్న వివిధ ఉద్యోగాలకు విద్యార్హతలు, కేడర్, సిలబస్‌లకు సంబంధించి నిర్దేశిత నిబంధనలు వివాదాస్పదమయ్యాయి. తమకు అన్యాయం జరిగిందంటూ నిరుద్యోగులు కోర్టుల బాట పట్టాల్సిన అనివార్య పరిస్థితి తీసుకువచ్చారన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఎస్‌జీటీ పోస్టులనే తీసుకుంటే.. తెలుగు మీడియం అభ్యర్థులు కోర్టుకు వెళ్లారు. ఈ పోస్టులకు రాత పరీక్ష 10 విడతల్లో నిర్వహించారు. అయితే పేపర్ క్లిష్టత ఒక్కో సెషన్‌లో ఒక్కోరకంగా ఉందని భావించిన అభ్యర్థులు అన్ని సెషన్ల పేపర్‌లకు నార్మలైజేషన్ ఫార్ములా అమలు చేయాలంటూ కోర్టును ఆశ్రయించారు. లాంగ్వేజ్ పండిట్లు- స్కూల్ అసిస్టెంట్స్ పోస్టుల కేడర్ వేర్వేరుగా ఉన్నప్పటికీ పరీక్ష సిలబస్ మాత్రం ఒకేలా పెట్టడాన్ని కొందరు అభ్యర్థులు కోర్టులో సవాల్ చేశారు. ఇలా వేర్వేరు అంశాలపై కోర్టులో కేసులు పడటం విద్యాశాఖ పనితీరుకు సవాల్‌గా మారింది. అధికారులు మాత్రం కేసులన్నీ క్లియర్ అయ్యాక మొత్తంగా ఒకేసారి నియామకాలు పూర్తి చేస్తామంటున్నారు.



నెల్లూరులో సీఐటీయూ కార్యకర్తల ర్యాలీ; (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మాణిక్ సర్కార్

# ఆర్థికం.. అస్తవ్యస్తం

- తీవ్రంగా నిరుద్యోగ సమస్య
- వ్యవసాయరంగంలోనూ సంక్షోభం
- ప్రజలను విడగొడుతున్న సంఘ్
- సీఐటీయూ సభల్లో మాణిక్ సర్కార్
- హోదా హామీని విస్మరించిన కేంద్రం
- వైసీపీ, టీడీపీ, జనసేన మౌనమేల?: రాఘవులు

నెల్లూరు(బాలాజీనగర్), డిసెంబరు 15: దేశంలో ఎన్నడూ లేని విధంగా నేడు ఆర్థిక సంక్షోభం నెలకొన్నదని, దాంతో పాటు నిరుద్యోగ సమస్య కూడా తీవ్రంగా ఉందని త్రిపుర మాజీ సీఎం, సీపీఎం నాయకుడు మాణిక్ సర్కార్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులో ప్రారంభమైన సీఐటీయూ 15వ రాష్ట్ర మహాసభల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యల వల్ల ప్రజలు కొనుగోలు శక్తిని కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్పత్తి తీవ్రంగా పడిపోవటంతో వ్యవసాయరంగం కూడా సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని దుయ్యబట్టారు. వేలసంఖ్యలో పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. పరిస్థితి ఇలా ఉంటే... ఆర్థిక సంక్షోభంపై అందుకు విరుద్ధంగా పార్లమెంట్‌లో మంత్రులు మాట్లాడిన తీరు సిగ్గుచేటన్నారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ కూడా సంక్షోభంలో ఉందని, రిలయన్స్ సంస్థ పట్ల కేంద్రం సానుకూల వైఖరే ఇందుకు కారణమని ఆరోపించారు. మరోవైపు మతం ప్రాతిపదికన ప్రజలను విడగొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్ నుంచి వచ్చే ముస్లిమేతరులకు పౌరసత్వం కల్పించేలా తెస్తున్న చట్టం దుర్మార్గమైన చర్యగా మాణిక్ సర్కార్ పేర్కొన్నారు. సంఘ్ పరివార్ సంస్థల విధానాల వల్ల దేశం అనేక సమస్యలను ఎదుర్కొంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జనవరి 8వ తేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేస్తున్నట్లు మాణిక్ తెలిపారు. ఇందులో అన్ని సంఘాలూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా హామీ అమలును కేంద్రం విస్మరించినా, రాష్ట్రంలో వైసీపీ నేత జగన్, ప్రతిపక్ష నేత చంద్రబాబు, జనసేన నేత పవన్ కళ్యాణ్‌లు దీనిపై పోరాటం చేయకపోవటం కేంద్రంతో వారికి ఉన్న సంబంధాలను తేటతెల్లం చేస్తోందని ఆరోపించారు.

**ఎరుపెక్కిన నెల్లూరు**

సీఐటీయూ రాష్ట్ర మహాసభల్లో భాగంగా ఆదివారం ఉదయం నెల్లూరు నగరంలో సీపీఎం అనుబంధ కార్మిక సంఘాలు నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది. ఎర్రజెండాలతో నగరమంతా ఎరుపురంగు పులుముకుంది. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగరావు, సినీ గేయరచయిత సుద్దాల అశోక్‌తేజ, ఎమ్మెల్సీలు శ్రీనివాసుల రెడ్డి, విఠపు బాలసుబ్రహ్మణ్యం, భారీ సంఖ్యలో నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో పరిణామాలు అప్రజాస్వామికం

- ఫ్యాక్షనిజం, రౌడీయిజం జగన్ సహజ గుణాలు
- ఎన్నికల ముందు జులాయిలా తిరిగి లేనిపోని హామీలిచ్చాడు
- ధృతరాష్ట్రునిలా వ్యవహరిస్తున్న స్పీకర్ తమ్మినేని
- కూన రవికుమార్, కళా వెంకటరావు విమర్శ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): అసెంబ్లీలో అధికార వైసీపీ సభ్యుల తీరుపై తెలుగుదేశం నేతలు మండిపడ్డారు. వరుసగా సభలో చోటుచేసుకొంటున్న పరిణామాలు అప్రజాస్వామికం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీకాకుళంలో కూన రవికుమార్, అదే జిల్లాలోని జలుమూరులో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకటరావు ఇదే అంశంపై మీడియాతో మాట్లాడారు. "అసెంబ్లీలో అధికార పార్టీ వ్యవహారశైలి సభ్యసమాజం సిగ్గుపడేలా ఉంది. స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. కళ్లులేని ధృతరాష్ట్రుడిలా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు జగన్ రోడ్లపై జులాయిలా తిరిగి లేనిపోని హామీలు ఇచ్చాడు. రౌడీయిజం, ఫ్యాక్షనిజం జగన్ సహజ గుణాలు. జగన్ అసలు స్వరూపం ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. ప్రజా సమస్యలు ప్రస్తావిస్తే సభలో సీఎం వెకిలి నవ్వులు నవ్వుతున్నాడు. కోర్టులు తిట్టినా వైసీపీ ప్రభుత్వానికి సిగ్గు రాలేదు. సీఎం, మంత్రుల ప్రవర్తనాతీరు ప్రభుత్వ పతనానికి నాంది అవుతుంది. శ్రీమతి రోజా అయితే ప్రతిపక్షంలో ఉన్నపుడు స్పీకర్ పోడియం వద్దకే వచ్చి చెప్పలేని విధంగా ప్రవర్తించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలకు సభా హక్కులు గుర్తుకురాలేదా?" అని రవికుమార్ స్పష్టం చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిని హేళన చేయడం తగదని కళా వెంకటరావు అన్నారు. శ్రీకాకుళం జిల్లా జలుమూరులో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన అన్నారు. ప్రజలు తరఫున మాట్లాడడం, అవసరమైన వాటి పరిష్కారానికి ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం ప్రతిపక్షం బాధ్యత అన్నారు. కానీ అధికారంలో ఉన్న తమను ప్రశ్నించడమేంటి అనే ధోరణితో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సీఎం జగన్ విధ్వంసాలు, వినాశకాలతోనే పాలన సాగిస్తున్నారంటూ కళా వెంకటరావు మండిపడ్డారు. ఇదే అంశంపై మాజీ మంత్రి జవహర్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీని వేదికగా చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. చంద్రబాబు అనని మాటను ఆయనకు ఆపాదించడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు ఆ పార్టీకి అలవాటేనని మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారంపై సీఎం జగన్ క్షమాపణ చెప్పాలని కళా డిమాండ్ చేశారు.





## ఎమ్మెల్యే రజనిపై అభ్యంతరకర పోస్టు

- 'నెల్లూరు'లో ఇద్దరు టీడీపీ నాయకుల అరెస్టు
- అదుపులోకి తీసుకున్న చిలకలూరిపేట పోలీసులు



అర్బన్ పోలీసులు అదుపులోకి తీసుకున్న పోస్టు పెట్టిన వ్యక్తులు

విడవలూరు/రాపూరు/చిలకలూరిపేట, డిసెంబరు 15: వైసీపీ ఎమ్మెల్యే విడదల రజనిపై ఫేస్‌బుక్‌లో అభ్యంతరకరమైన పోస్టు పెట్టిన వ్యక్తితో పాటు దాన్ని సమర్థిస్తూ కామెంట్ చేసిన మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలు... ఎమ్మెల్యే రజని ఫొటో కింద విడవలూరు మండల తెలుగు యువత అధ్యక్షుడు సత్యవోలు సత్యంరెడ్డి అభ్యంతరమైన వాఖ్యలు చేస్తూ పోస్టింగ్ పెట్టాడు. దాన్ని సమర్థిస్తూ అదే జిల్లా రాపూరు మండలం కండలేరుకు చెందిన సీబీఎస్ ఆర్మీ మండల కమిటీ సభ్యుడు పంతగాని ప్రవీణ్‌కుమార్ కామెంట్ చేశాడు. దీనిపై స్థానిక వైసీపీ నాయకుడు మారుబోయిన నాగరాజు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లా వెళ్లిన పోలీసుల బృందం ఆదివారం వేకువజామున వారిద్దరినీ అదుపులోకి తీసుకుని అర్బన్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. సోమవారం వారిని కోర్టుకు హాజరుపరచనున్నట్టు సమాచారం.

## రాజధానిపై మాట మార్చిన బొత్స

- ఇది ఆంధ్రులను అవమానించడమే: అనగాని

అమరావతి, కాకినాడ సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'రాజధాని అమరావతి విషయంలో ప్రభుత్వ వైఖరి మోసపూరితంగా ఉంది. రాజధాని నిర్మాణం కొనసాగుతుందని అసెంబ్లీ సాక్షిగా మాటిచ్చిన మంత్రి బొత్స సత్యనారాయణ 24 గంటలు గడవక ముందే మాట మార్చేయడం ఐదు కోట్ల ఆంధ్రులను అవమానించడమే' అని టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. నిపుణుల కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే రాజధాని నిర్మాణంపై నిర్ణయం తీసుకుంటామనడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. అబద్ధాలు, అసత్యాల ప్రచారాలకు శాసనసభను వైసీపీ వేదికగా చేసుకోవడం సరికాదన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ భవనాలకు పార్టీ రంగులను వేసి రాజకీయం చేస్తోందని ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు విమర్శించారు.

## సన్న బియ్యం కాదు... నాణ్యమైన బియ్యం

- ఉప సంఘం రికమండేషన్లకు ఆమోదం

అమరావతి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీపీఎల్ ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు ప్రభుత్వం సిద్ధం అయింది. రేషన్ కార్డుదారులకు నాణ్యమైన బియ్యాన్ని ప్యాకెట్ల రూపంలో అందించేందుకు అవసరమైన సూచనలు కోసం ప్రభుత్వం ఆర్థిక శాఖ, వ్యవసాయ శాఖ, గృహనిర్మాణ, పౌరసరఫరాల శాఖ మంత్రులతో ఉప సంఘాన్ని నియమించిన విషయం తెలిసింది. ఉప సంఘం ఇచ్చిన సూచనలను ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు పౌరసరఫరాల ఎక్స్ ఆఫీషియో సెక్రటరీ కొన శశిధర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.



# 'నవోదయ' రామ్మోహనరావు ఇక లేరు

ఆంధ్రప్రదేశ్ పబ్లిషర్స్ అండ్ బుక్‌సెల్లర్స్ అసోసియేషన్‌ను స్థాపించి, ప్రచురణల రంగంలో కొత్త ఒరవడిని తీసుకొచ్చి, ప్రచురణ కర్తలకు అండగా నిలిచిన ప్రచురణ కర్త నవోదయ రామ్మోహనరావు. పుస్తకానికి ఒక ముఖచిత్రం ఉండాలని తెలియజెప్పి, బాపు సహకారంతో చేసి చూపించిన సృజనకారుడు.

(మొదటి పేజీ తరువాయి)

ఉంగుటూరులో కమ్యూనిస్టు కుటుంబంలో పుట్టిన నవోదయ రామ్మోహనరావు ఆ భావజాలంతో ప్రభావితులయ్యారు. చిన్ననాటి నుంచే కమ్యూనిస్టు సభలకు వెళుతూ, అభ్యుదయ సాహిత్యాన్ని అధ్యయనం చేస్తూ పెరిగారు. విశాలాంధ్రలో కొంత కాలం ఉద్యోగిగా ఉన్న రామ్మోహనరావు చేతికి 1960లో వచ్చిన నవోదయ తెలుగు సాహిత్య అభిమానులకు సుమారు ఆరు దశాబ్దాల పాటు సేవలందించింది. విజయవాడ కారల్ మార్క్స్ రోడ్డుకు 'నవోదయ'ను ఒక ఐకాన్‌గా నిలిపారు. నాటి నుంచి 2016 మే నెలలో మూతపడే వరకు ఈ సంస్థను కళాకారులకు, సాహితీవేత్తలకు ఒక కేంద్రంగా నిలిపారు. బాపు, రమణల సహకారంతో, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన శ్రీశ్రీ, రావిశాస్త్రి, ముళ్లపూడి, నండూరి రామ్మోహనరావు, గొల్లపూడి మారుతీరావు, ఇంద్రగంటి శ్రీకాంత్‌శర్మ, నార్ల వెంకటేశ్వరరావు వంటి ఉద్దండుల సాహిత్యాన్ని ప్రచురించారు. గోపీచంద్, కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, ఆరుద్ర, నార్ల, నండూరి, శంకరమంచి, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, శ్రీరమణ, చెరబండరాజు, వాసిరెడ్డి సీతాదేవి, ఆర్.ఎస్.సుదర్శనం తదితరులతో ఆయనకు ఎంతో సాన్నిహిత్యం ఉండేది. తెలుగు ప్రచురణ కర్తలకు ఆయన ఒక సాహిత్య శిఖరం అనడంలో అతిశయోక్తి లేదు. విజయవాడలో పుస్తక ప్రదర్శనలకు ఆద్యుడు. ఇందుకోసం దేశమంతా తిరిగి విస్తృతంగా అధ్యయనం చేసిన కొద్దిమందిలో ఒకరు. 1989లో నేషనల్ బుక్ ట్రస్ట్ వారితో సంప్రదింపులు జరిపి, విజయవాడలో పుస్తక మహోత్సవాన్ని ఏర్పాటు చేయించారు. అనంతర కాలంలో విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీని ఏర్పాటు చేసి, 1991 నుంచి నిరంతరాయంగా పుస్తక మహోత్సవాలను నిర్వహించేలా ఆయన కృషి చేశారు. ఈ సొసైటీకి వ్యవస్థాపక అధ్యక్షుడు. ఆరవ పుస్తక మహోత్సవం వరకు ఆయన బుక్ ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా కొనసాగారు. బాపుతో అత్యంత సాన్నిహిత్యం సాగించిన నవోదయ రామ్మోహనరావు బాపు పుట్టిన రోజున కన్నుమూయడం విశేషం. ఐదు సంవత్సరాల క్రితం కుమారుడు మృతిచెందిన తరువాత పబ్లిషింగ్ సంస్థను రామ్మోహనరావు మూసివేశారు. నాణ్యమైన ప్రింటింగ్‌కు నవోదయ పబ్లిషింగ్ సంస్థను మారు పేరుగా రామ్మోహనరావు తీర్చిదిద్దారు. ఆయన సేవలకు మెచ్చి డాక్టర్ రామినేని ఫౌండేషన్ ఆయనను విశేష్ పురస్కార్‌తో సత్కరించింది.

## ఉద్యోగి నుంచి యజమాని వరకు..

- 'నవోదయ' రామ్మోహనరావు ప్రస్థానం

మొదట్లో ఆయన రూ.50 జీతానికి విశాలాంధ్ర ప్రచురణాలయంలో పనిచేశారు. తర్వాత 'నవోదయ'లో చేరి.. కాలక్రమంలో యజమాని అయ్యారు. 'నవోదయ' రామ్మోహనరావుగా ఖ్యాతి గడించారు. ఆయన 1934లో కృష్ణా జిల్లా గన్నవరం తాలూకా ఉంగుటూరులో సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. ఆయనకు ముగ్గురు అక్కలు. తల్లికి మతిస్థిమితం లేకపోవడంతో పెద్దక్క శేషారత్నం ఆమెను కన్నతల్లిలా పెంచారు. ఆమె భర్త పొట్లూరి సుబ్బారావు కమ్యూనిస్టు. ఆమె చిన్నక్క లోలాక్షి 1946లో కొండపల్లి రాఘవరెడ్డిని కులాంతర వివాహం చేసుకున్నారు. అప్పట్లో అదో పెద్ద సంచలనం. తొలి నుంచీ రామ్మోహనరావుకు కమ్యూనిస్టు పార్టీపై మక్కువ. ఉంగుటూరులో ప్రాథమిక విద్యను అభ్యసించిన ఆయన.. గుడివాడ హైస్కూలులో చేరారు. కమ్యూనిస్టులపై నిర్బంధం కారణంగా ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. తిరిగొచ్చాక కైకలూరులో బావ ఇంట్లో ఉండి పదో తరగతి పూర్తిచేశారు. పై చదువులు చదివే స్తోమత లేకపోవడంతో నెలకు రూ.50 జీతానికి ఆయన విశాలాంధ్ర ప్రచురణాలయంలో చేరారు. కమ్యూనిస్టు పార్టీకి ఇంకా దగ్గరయ్యారు. ఆ సందర్భంగానే ప్రముఖ కమ్యూనిస్టు నేతలతో పరిచయాలు పెంచుకున్నారు. 1955లో పర్వతనేని ఝాన్సీలక్ష్మితో ఆయన వివాహమైంది. దండల పెళ్లి చేసుకున్నారు. ఖర్చు కేవలం రూ.125. అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఇక హోల్ టైమర్లను భరించలేమని పార్టీ నాయకత్వం తేల్చిచెప్పడంతో బతుకుదెరువు కోసం రామ్మోహనరావు సహా వేరే ఉద్యోగాలు వెతుక్కోవలసి వచ్చింది. అదే సమయంలో ఆయన చిన బావ 1957లో గుడివాడలో 'నవోదయ పబ్లిషర్స్' స్థాపించారు. మరుసటి ఏడాది దాని కార్యాలయాన్ని విజయవాడకు మార్చారు. 1960లో నవోదయను ఆయన బావ ఆయనకు అప్పగించారు. ఏడాదిపాటు ఎంతో కష్టపడాల్సి వచ్చింది. 1961నాటికి గొల్లపూడి మారుతిరావు రచనలను పబ్లిష్ చేసే స్థాయికి ఎదిగారు. ముళ్లపూడి వెంకటరమణ రాసిన 'గిరీశం లెక్చర్లు' పుస్తక ప్రచురణ బాగుండడంతో రామ్మోహనరావు దశ తిరిగింది. బాపు-రమణలతో అనుబంధం బాగా పెరిగింది. ఇదే సమయంలో గోపీచంద్, కొడవటిగంటి కుటుంబరావు, రాచకొండ విశ్వనాథశాస్త్రి, ఆరుద్ర, నార్ల, నండూరి, శంకరమంచి, ఇంద్రగంటి శ్రీకాంత శర్మ, శ్రీరమణ, చెరబండరాజు, వాసిరెడ్డి సీతాదేవి, ఆర్.ఎస్.సుదర్శనం వంటివారితో సాన్నిహిత్యం ఏర్పడింది. దేశంలో ఎక్కడ పుస్తక ప్రదర్శన జరిగినా.. రామ్మోహనరావు తానూ వెళ్లేవారు. తన సిబ్బందినీ పంపించేవారు. విజయవాడలో తొలి పుస్తక ప్రదర్శనలో ఆయనది కీలక పాత్ర. 1989లో అక్టోబరులో ఇది జరిగింది. నాటి నుంచి ఇప్పటివరకు అప్రతిహతంగా పుస్తక ప్రదర్శన కొనసాగుతోంది.. అలాగే ఆంధ్రలోని పుస్తక విక్రేతలందరినీ ఏకతాటిపైకి తెచ్చి ఓ సంఘాన్ని ఏర్పాటుచేసిన ఘనత కూడా రామ్మోహనరావుదే. ఆయన హేతువాది. ఆయన ఇద్దరు పిల్లల పెళ్లిళ్లు రిజిస్ట్రార్ ఆఫీసులోనే చేయించారు. ఆయన తండ్రి చనిపోయినప్పుడు అంత్యక్రియలు జరపలేదు. తన తదనంతరం కూడా ఇలాంటి క్రతువులేవీ జరపొద్దని.. రామ్మోహనరావు చెప్పేవారు.

**- సెంట్రల్ డెస్క్**



బస్సులో టిక్కెట్ కొంటున్న ఎమ్మెల్యే

## చార్జీల పెంపు పేదలపై కక్ష సాధింపే: నిమ్మల

పాలకొల్లు టౌన్, డిసెంబరు 15: "సీఎం జగన్ పాదయాత్రలో ఆర్టీసీ చార్జీలు పెంచబోమని చెప్పి... ఇచ్చిన మాట తప్పారు. ఆర్టీసీ చార్జీల పెంపు విద్యార్థులు, పేదలపై కక్ష సాధింపే" అని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే నిమ్మల ప్రయాణికులతో మాట్లాడారు. పెరిగిన బస్‌చార్జీల వలన కలిగే భారం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం భీమవరం వెళ్లే పల్లె వెలుగు బస్సులో పాలకొల్లు నుంచి శివదేవునిచిక్కాల వరకూ టికెట్ కొనుగోలు చేసి ప్రయాణించారు. మద్యం ధరలను పెంచేది మద్యం వినియోగదార్లను తగ్గించడానికే అని చెబుతున్న జగన్... ఆర్టీసీ చార్జీలు పెంచేది ప్రయాణికులను తగ్గించడానికేనా? అని నిమ్మల ప్రశ్నించారు.

## పదవుల్లోనూ, రేపుల్లోనూ సీఎం సామాజిక వర్గమే: యనమల

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): "నామినేటెడ్ పదవులు, రేప్‌లలోనూ సీఎం జగన్మోహన్‌రెడ్డి సొంత సామాజికవర్గానిదే పైచేయి. సన్న బియ్యం పంపిణీ, పెట్టుబడులు-ఉపాధి, రాజధానిపై అపోహలు, రైతు భరోసా, జీవో 2430, స్థానికులకు 75శాతం రిజర్వేషన్లు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50శాతం పదవులు... అన్నింటిపైనా జవాబులు తప్పుల తడకలే" అని మండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బలహీనవర్గాలకు అప్రధాన పదవులు, కీలక పోస్టులు.. సుమారు 300కు పైగా పదవులు సీఎం సొంత సామాజిక వర్గం.. రెడ్లకే ఇచ్చారని జీవోలే వెల్లడించాయన్నారు. 75 శాతం స్థానికులకే అంటే... తన సామాజికవర్గానికే అని సీఎం కొత్త భాష్యం చెప్పారని ఎద్దేవా చేశారు. తన మీడియాలో రాసేవన్నీ తప్పుడు రాతలే అని జగన్ స్వయంగా అసెంబ్లీలో ఒప్పుకున్నారని విమర్శించారు.

## 'తోక'ను కూడా పట్టలేరు

- చంద్రబాబు అవినీతి ఫినాయిల్ పేపర్‌కే పరిమితం : బుద్ధా



విజయవాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): "చంద్రబాబు అవినీతి అంటూ మీ ఫినాయిల్ పేపర్‌లో రాసుకుని సంబరాలు చేసుకుంటామంటే మీ ఇష్టం విజయసాయిరెడ్డి గారూ! అవినీతిని వెలికితీస్తానంటూ జగన్ తవ్వడం మొదలెట్టి ఏడు నెలలు కావొస్తోంది. వెనకటికి మీలాంటివాడే కొండని తవ్వి ఎలుకని పట్టుకున్నాడట. మీరు ఎలుక కాదు కదా దాని తోక కూడా పట్టుకోలేకపోయారు" అని ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ట్వీట్ చేశారు.

## బాబు నెగిటివ్‌గా ఆలోచిస్తారు: విజయసాయి

విశాఖపట్నం, అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): "చంద్రబాబు ప్రతి విషయాన్నీ నెగిటివ్‌గా ఆలోచించే మనిషి. అనుభవం ఉన్న వ్యక్తి రాష్ట్రాన్ని తిరోగమనం దిశగా పయనింపజేసేందుకు ప్రయత్నిస్తున్నారు" అని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విశాఖపట్నంలో విమర్శించారు.

### అసెంబ్లీ అంటే బాబుకు ఆట: ప్రభుత్వ చీఫ్‌విప్ గడికోట

అసెంబ్లీ సమావేశాలంటే చంద్రబాబుకు ఆటలా మారిందని ప్రభుత్వ చీఫ్‌విప్ గడికోట శ్రీకాంతరెడ్డి తాడేపల్లిలో విమర్శించారు.

## 'ఎవడ్రా హీరో'కి బేడీలు!

- రుణాలిప్పిస్తానంటూ బషీద్ మోసాలు... 11 చీటింగ్ కేసులు



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్నపాటి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు గ్యారెంటర్‌గా ఉండి రుణం ఇప్పిస్తానని చెప్పి మోసాలకు పాల్పడుతున్న సినీ నిర్మాత, రియల్ ఎస్టేట్ వ్యాపారి, నటుడు షేక్ బషీద్‌ను హైదరాబాద్ వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అరెస్ట్‌చేశారు. నిందితుడు గుంటూరు వేజెండ్ల ప్రాంతానికి చెందిన షేక్ బషీద్ అలియాస్ బాసిత్(46) 'ఎవడ్రా హీరో' చిత్ర హీరో కావడం గమనార్హం!. బీకాం చదివిన బషీద్ తొలుత గుంటూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవాడు. 2008లో హైదరాబాద్ వచ్చి ఎస్‌బీకే గ్రూప్ పేరుతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం, ముంబై, చెన్నై, బెంగళూరు, దుబాయ్‌లలో ఫైనాన్స్ సంస్థలను ప్రారంభించాడు. కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన పానకాలరావు అనే వ్యక్తి రూ.15 కోట్ల రుణం కావాలని ఆశ్రయించగా.. అతడి నుంచి బషీద్ రూ.65 లక్షలు వసూలు చేశాడు. గుంటూరుకు చెందిన ముల్పూరి గురవయ్య అనే వ్యక్తి రూ.10 కోట్ల రుణం కావాలని సంప్రదించగా రూ.32.50 లక్షలు వసూలు చేశాడు. రుణం మంజూరుపై అడిగిన వీరిద్దరినీ బషీద్ బెదిరించాడు. బాధితులిద్దరూ ఫిర్యాదుతో పోలీసులు అరెస్టు చేశారు.



## 'ఆత్మీయ' కలయిక

మాజీ మంత్రులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు(టీడీపీ), కామినేని శ్రీనివాస్(బీజేపీ), వైసీపీ నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు ఎంత ఆత్మీయంగా కలిసిపోయారో చూశారా? విశాఖపట్నంలోని హోటల్ గ్రాండ్ బేలో ఆదివారం స్నేహితుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి హాజరైన ఈ 'స్నేహితులు' ఇలా కనిపించి సందడి చేశారు.

**- మహారాణిపేట(విశాఖపట్నం)**

## ప్రజల్లోకి గాంధీజీ ఆశయాలు

- సంకల్ప యాత్ర పుస్తకావిష్కరణలో కన్నా

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల మాధ్యమం వచ్చాక దేశం కోసం త్యాగం చేసిన నాయకులను మరచిపోతున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్ముడి గురించి 'మన్ మే బాపూ' పేరుతో స్మరించుకుందామని ప్రధాని మోదీ సూచించడంతో మరోసారి దేశవ్యాప్తంగా గాంధీజీ ఆశయాలు, త్యాగాలను ప్రజల్లోకి బీజేపీ తీసుకెళ్లగలిగిందన్నారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో గాంధీజీ సంకల్పయాత్ర పుస్తకాన్ని బీజేపీ నేతలు సతీశ్ జీ, పురందేశ్వరి, సత్యకుమార్, జీవీఎల్ తదితరులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ గాంధీ ఆశయాలకు అనుగుణంగా మరుగుదొడ్లు మొదలుకొని పల్లెలను ప్రధాని మోదీ ఎలా అభివృద్ధి చేస్తున్నారో వివరించారు. ఎంపీ జీవీఎల్ నరసింహారావు మాట్లాడుతూ లౌకికం పేరుతో కాంగ్రెస్ హిందూ వ్యతిరేక రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. దగుల్బాజీ రాజకీయాలు చేస్తోన్న కాంగ్రెస్ అని వ్యాఖ్యానించారు.

## విలీనం పేరుతో సౌకర్యాల్లో కోతలేంటి?

- సీఎం హామీకి భిన్నంగా వ్యవహరిస్తే ఊరుకోం
- ఆర్టీసీ ఉన్నతాధికారి తీరుపై ఈయూ ధ్వజం
- పాత పెన్షన్ వర్తించేలా అసెంబ్లీలో బిల్లు పెట్టాలని వినతి

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామన్న పేరుతో కార్మికులకున్న సౌకర్యాల్లో యాజమాన్యం కోతలు విధిస్తోందని గుర్తింపు కార్మిక సంఘం ఈయూ మండిపడింది. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీకి భిన్నంగా ఆర్టీసీ ఉన్నతాధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదర్‌రావు ఆరోపించారు. విలీనంలో ఏమి జరుగుతోందో కార్మికులకు ఒక్క విషయం కూడా తెలియనివ్వకుండా ఒక ఉన్నతాధికారి వ్యవహరిస్తున్న తీరు 50వేల మందిలో గందరగోళం సృష్టిస్తోందని విమర్శించారు. ప్రభుత్వంలో ఏపీఎస్ఆర్టీసీ సిబ్బంది విలీనం గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో కార్మికుల్లో నెలకొన్న అనుమానాలు, యాజమాన్యం అనుసరిస్తోన్న తీరుపై గుర్తింపు కార్మిక సంఘం ఆదివారం సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. సంస్థ మనుగడ, కార్మికుల హక్కుల కోసం ఎనిమిది సంఘాలతో కలిసి ఏర్పడిన జేఏసీ సమ్మెకు సిద్ధపడితే... జూన్ 13న ముఖ్యమంత్రి జగన్ అసెంబ్లీకి పిలిపించి మాట్లాడారని గుర్తు చేసింది. ఆర్టీసీని విలీనం చేస్తామని, ఈ రోజు నుంచి మీరందరూ ప్రభుత్వ ఉద్యోగులేనని జగన్ మాటివ్వడంతో తాము సమ్మెకు వెళ్లకుండా ఆగిపోయినట్లు దామోదర్‌రావు చెప్పారు. ఆ తర్వాత విలీన కమిటీ ఏర్పాటు కావడం, సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వడంతో సంస్థను ప్రజా రవాణాశాఖ(పీటీడీ)గా మార్చి సిబ్బందిని అందులోకి చేర్చి ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని సీఎం సూచించారని దామోదర్ వివరించారు. పీటీడీ ఏర్పాటు, సిబ్బంది విలీనానికి సంబంధించి ఏర్పాటైన కమిటీలో ఎక్కడా కార్మిక సంఘాలకు చోటివ్వకుండా, తాము అడిగిన విధంగా పాత పెన్షన్ కాకుండా మరో సిఫారసు చేయడం సరికాదని ఆక్షేపించారు. కనీసం స్కేల్ ఫిక్సేషన్‌లో కూడా తమను సంప్రదించడంలేదని, ఆర్టీసీ సిబ్బందికి ఉన్న సౌకర్యాలన్నీ తొలగించేలా ఆర్టీసీ ఉన్నతాధికారి చేస్తుండటం కార్మికులు ఆందోళనబాట పట్టేందుకు ఆస్కారం కల్పిస్తోందన్నారు. అసెంబ్లీలో పెట్టబోతున్న ఆర్టీసీ విలీన బిల్లులో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తమకూ అన్నీ ఉండేలా చూడాలని ప్రభుత్వానికి పలిశెట్టి విన్నవించారు.

### మహిళల భాగస్వామ్యం పెంచుతాం

- సామాజిక, ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి పెద్దిరెడ్డి

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సామాజిక, ఆర్థికాభివృద్ధి కార్యకలాపాల్లో మహిళల భాగస్వామ్యం పెంచడం ద్వారా నూతన అభివృద్ధి నమూనాను ఆవిష్కరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. విద్యుత్ పొదుపు-మహిళల పాత్ర అనే అంశంపై రాష్ట్రస్థాయి మహిళా సదస్సు పోస్టర్‌ను ఆదివారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే సాధించలేనిది లేదని, వారి భాగస్వామ్యంతో ఏ కార్యక్రమమైనా దిగ్విజయమవుతుందన్నారు. ఇంధన సామర్థ్య రంగంలో మహిళల భాగస్వామ్యం దేశానికి ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తుందనడంలో సందేహం లేదన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు ఇచ్చే రుణాలను రూ.980 కోట్ల నుంచి రూ.1780 కోట్లకు పెంచినట్లు తెలిపారు. స్టార్ట్ ఆఫ్ విలేజ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రాజెక్టును శ్రీకాకుళం, విజయనగరం, పశ్చిమగోదావరి, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో ప్రారంభించినట్లు తెలిపారు.

### మాతృభాషలోనే బోధించాలి: డీటీఎఫ్

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మాతృభాషా మాధ్యమాన్ని కొనసాగించాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కె.నరహరి డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెడుతూ మాతృభాషను రద్దు చేయడం సరికాదన్నారు. విజయవాడ జక్కంపూడి కాలనీ ఎంపీపీఎస్ పాఠశాలలో ఆదివారం డీటీఎఫ్ 14వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థికి మాధ్యమాన్ని ఎంచుకునే అవకాశం ఉండాలని స్పష్టం చేశారు. ఆంగ్ల ప్రమాణాలు అందుకోలేని విద్యార్థుల డ్రాపవుట్ల సంఖ్య పెరిగిపోతుందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లోనూ ప్రాథమిక తరగతుల్లో మాతృభాషా మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రధానకార్యదర్శి ఎస్వీ రమణయ్య మాట్లాడుతూ ప్రాథమిక విద్య వరకు మాతృభాషా మాధ్యమాన్ని అమలు చేయాలని, ఉన్నతవిద్య, పాఠశాల విద్యలో ప్రవేశపెట్టిన రెగ్యులేటరీ కమిషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరారు.

### 21న అటవీ హక్కులపై సదస్సు

- ఐదు జిల్లాల కలెక్టర్లతో విశాఖలో నిర్వహణ

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అటవీ భూముల హక్కుల చట్టం పరిధిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారంపై ఈనెల 21న విశాఖలో సదస్సు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏజెన్సీ పరిధిలోని విశాఖ, ఉభయ గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల కలెక్టర్లతోపాటు ఆయా ప్రాంతాల్లోని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ)ల ప్రాజెక్టు అధికారులు ఈ సదస్సులో పాల్గొనాలని కోరింది. ఈ మేరకు కలెక్టర్లకు గిరిజన సంక్షేమ శాఖ లేఖలు రాసింది. అటవీభూముల హక్కుల చట్టం(ఆర్ఓఎఫ్ఆర్) పరిధిలో వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిష్కరించాలని గిరిజనులు నిరంతరం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ జోక్యం చేసుకొని, ప్రత్యేక శ్రద్ధపెట్టాలని ఆగస్టులోనే గిరిజన శాఖను ఆదేశించారు. అయితే, గిరిజనశాఖ ఈ దిశగా వెంటనే చర్యలు చేపట్టలేదు. ఈ విషయంపై సీఎంవో ఆరాతీసింది. సీఎం సమీక్షలో ఇచ్చిన ఆదేశాల అమలుపై ఇప్పటిదాకా ఎందుకు చర్యలు చేపట్టలేదని గిరిజన అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో గిరిజనశాఖ ఈ సదస్సుకు రూపకల్పన చేసినట్లు సమాచారం.

### బడ్జెట్‌కు సలహాలివ్వండి

- యలమంచిలి శివాజీకి కేంద్రం ఆహ్వానం
- 17న ఆర్థికమంత్రి సమావేశానికి హాజరు!

న్యూఢిల్లీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): బడ్జెట్ రూపకల్పనలో సలహాలు, సూచనలు ఇవ్వడానికి రావాల్సిందిగా రైతు నేత, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీని కేంద్ర ఆర్థిక శాఖ ఆహ్వానించింది. ఈ నెల 17వ తేదీన ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరగనున్న ప్రీ బడ్జెట్ సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. వ్యవసాయం, రైతుల అంశాలపై ప్రభుత్వానికి ఆయన సలహాలు ఇవ్వనున్నారు. 1988 నుంచి ప్రతి బడ్జెట్ సందర్భంగా పార్టీలకతీతంగా కేంద్ర ఆర్థిక శాఖ ఆయనను ఆహ్వానిస్తూనే ఉంది. గతంలో ఆయన ఇచ్చిన సలహాలను బడ్జెట్‌లో పొందుపర్చిన సందర్భాలు ఉన్నాయి. కేంద్రం అమలు చేస్తున్న కిసాన్ క్రెడిట్ కార్డు పథకం ఆలోచన కూడా ఆయన ప్రతిపాదించినదే.

### పొట్టి శ్రీరాములుకు ఘననివాళి



న్యూఢిల్లీ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు 67వ వర్ధంతి సందర్భంగా ఢిల్లీలోని ఏపీభవన్‌లో రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ జేకే మహేశ్వరి ఘననివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఏపీభవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అభయ్, రెసిడెంట్ కమిషనర్ భావన సక్సేనా, అధికారులు రవిశంకర్, లింగరాజు, రామారావు పాల్గొన్నారు.

## వారం అన్నారు.. ఆరు నెలలైంది

- సీపీఎస్ రద్దు ఇంకెప్పుడు?.. విజయనగరంలో ఉద్యోగుల మనోవేదన ర్యాలీ
- గోదావరి, ఉత్తరాంధ్ర నుంచి వేలాదిగా హాజరు

విజయనగరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను తక్షణమే రద్దు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సీపీఎస్‌ను రద్దు చేస్తామని పాదయాత్రలో జగన్ హామీ ఇచ్చారని, మరి అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా ఎందుకు రద్దు చేయడం లేదని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. 'మనోవేదన ర్యాలీ' పేరుతో ఆదివారం విజయనగరంలో తలపెట్టిన ర్యాలీకి ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల నుంచి వేలమంది తరలివచ్చారు. జడ్పీ కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్, గంటస్తంభం, కోట మీదగా గురజాడ కళాక్షేత్రం వరకూ ఈ ర్యాలీ సాగింది. సీపీఎస్ రద్దు కోసం చేసిన నినాదాలతో విజయనగరం హోరెత్తింది. ర్యాలీ అనంతరం గురజాడ కళాక్షేత్రం ప్రాంగణంలో నిర్వహించిన బహిరంగ సభలో రాష్ట్రస్థాయి ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. సీపీఎస్ రాష్ట్ర సంఘం నేత రొంగళి అప్పలరాజు మాట్లాడుతూ పాదయాత్రలో తమకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని సీఎం జగన్‌ను వారు డిమాండ్ చేశారు. 653, 654, 655 జీవోలను తక్షణమే రద్దుచేసి విశ్వసనీయతను నిలబెట్టుకోవాలన్నారు. బహిరంగ సభకు ఎల్.కోట మండలం గుల్జా పాఠశాలకు చెందిన పాల్ సుధాకర్ అనే ఉపాధ్యాయుడు వైఎస్ఆర్ వేషధారణలో వచ్చి ఆయన మాటలను అనుకరించారు. 'జగన్... నీ తండ్రిగా చెబుతున్నా! నా కీర్తికి కళంకం తేవద్దు. పాదయాత్రలో ఇచ్చిన హామీప్రకారం కాలయాపన చెయ్యకుండా సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దుచెయ్యాలి' అని చెప్పడం అందరినీ ఆకట్టుకుంది.

విజయనగరం పట్టణంలో ఉద్యోగుల మనోవేదన ర్యాలీ




## ఆ.. ఒక్కటీ అడగకండి!

- భూముల రీ సర్వేకు తాజా రూల్స్ ఒప్పుకోవు
- మరోసారి డీఐఎల్ఆర్ఎంపీ స్పష్టీకరణ
- ఈ దఫా కూడా చర్చకురాని ఏపీ ప్రతిపాదన

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): 'భూముల రీ సర్వేకు ఇప్పుడున్న నిబంధనలు అంగీకరించవు. కాబట్టి ఆ ఒక్కటీ అడగకండి. డీఐఎల్ఆర్ఎంపీ పద్దులో ఇతర ఏ ప్రాజెక్టులైనా పరిశీలన చేస్తాం. కానీ రీ సర్వే అంటే కొత్త మార్గదర్శకాల కింద తిరస్కరిస్తాం' అంటూ కేంద్ర భూవనరుల విభాగం తాజాగా పలు రాష్ట్రాలకు స్పష్టం చేసింది. భూముల రీ సర్వే కోరుతూ ఉత్తరాఖండ్‌తోపాటు మరో రెండు రాష్ట్రాలు సమర్పించిన ప్రతిపాదనలను ప్రాజెక్టు మంజూరు మరియు పరిశీలన కమిటీ(పీఎస్ఎంసీ) తిరస్కరిస్తూ ఇచ్చిన ఆదేశం ఇది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రీ సర్వే కోరుతూ రూ.1688 కోట్లతో సమర్పించిన ప్రతిపాదన తాజాగా ఢిల్లీలో జరిగిన పీఎస్ఎంసీ సమావేశ ఎజెండాలోనే లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. కేంద్ర భూవనరుల విభాగం డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్(డీఐఎల్ఆర్ఎంపీ) నిర్వహిస్తోంది. ఈ ప్రాజెక్టు పరిధిలో భూమి రికార్డుల ఆధునికీకరణ, డిజిటలైజేషన్, రీ సర్వేకు నిధులు ఇస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రీ సర్వే చేస్తామని, డీఐఎల్ఆర్ఎంపీ కింద నిధులు ఇవ్వాలని జూన్‌లోనే ఏపీ కోరింది. జూన్ 14న ఢిల్లీలో జరిగిన పీఎస్ఎంసీ సమావేశంలో ఆ ప్రతిపాదనకు ఆమోదం తెలపలేదు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఆ శాఖ అండర్ సెక్రెటరీ సర్వజిత్ కుమార్ జూన్ 25న రాష్ట్రానికి లేఖ రాశారు. రీ సర్వేకు మరోసారి నిర్దిష్ట ఫార్మాట్‌లో ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ప్రతిపాదనలు పంపించింది. రూ.1688 కోట్లు రీ సర్వే ప్రాజెక్టుకు కేటాయించాలని అభ్యర్థించింది. 1.22 లక్షల చదరపు కిలోమీటర్ల పరిధిలో (అటవీ భూమి కాకుండా) 3.17 కోట్ల ఎకరాలను సర్వే చేయాలని అధికారులు ప్రతిపాదించారు. వెబ్‌ల్యాండ్ డేటా ప్రకారం 2.36 కోట్ల భూమి కమతాలను సర్వే చేస్తారు. ఇందులో కార్స్ నెట్‌వర్క్, డీజీపీఎస్ రోవర్‌లు, ఇతర మౌలిక సదుపాయాల కోసం రూ.346 కోట్లు, క్షేత్రస్థాయి సర్వే, టైటిల్ విచారణకు (ఇందులో ఉద్యోగుల వేతనాలు, ఇతర ఖర్చులు కలిపి) రూ.1342 కోట్లు ఖర్చుకానుందని వివరించారు. రీ సర్వేకు సగటున ఒక చదరపు కిలోమీటర్‌కు రూ.1.10 లక్షల ఖర్చు కానుందని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనను కేంద్ర భూవనరుల విభాగ పరిధిలోని పీఎస్ఎంసీలో పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. రీ సర్వేకు అనుమతించాలా? వద్దా? అనేది ఈ సమావేశంలోనే ఖరారు చేస్తారు. ఇప్పటి వరకూ రెండుసార్లు ఈ కమిటీ సమావేశాలు జరిగినా ఏపీ ప్రతిపాదన ఎజెండాలోకి ఎక్కలేదు.

### కేంద్ర కేబినెట్ ఓకే అంటేనే..!

ప్రతిష్ఠాత్మకమైన టైటిల్ చట్టం అమలుకు రీ సర్వే ఉపయోగపడుతుందని, కాబట్టి తమ ప్రతిపాదనకు ఆమోదం తెలపాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశారు. ఇటీవల పీఎస్ఎంసీ సమావేశంలో త్రిపుర, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై చర్చించారు. జార్ఖండ్‌తోపాటు మరో రెండు రాష్ట్రాలు కోరినట్లుగా భూముల రీ సర్వేకు అనుమతించలేమని కేంద్ర భూవనరుల విభాగం అండర్ సెక్రెటరీ అసిల్ హల్దార్ స్పష్టంచేశారు. 'తాజాగా సవరించిన మార్గదర్శకాలు, నిబంధనల మేరకు భూముల రీ సర్వే అనే కాంపొనెంట్‌ను ఆమోదించలేం. కాబట్టి దాని గురించి లేవనెత్తకండి. ఇక భూరికార్డుల ఆధునికీకరణ, డిజిటలైజేషన్ గురించి వచ్చిన ప్రతిపాదనలను కమిటీ పరిశీలిస్తుంది' అని వెల్లడించారు. ఇప్పుడిదే అంశంపై ఆయా రాష్ట్రాలకు లేఖలు రాయనున్నారు. ఇదే నియమం ఏపీ ప్రతిపాదనకు కూడా వర్తింపచేసి, రీ సర్వేను తిరస్కరిస్తారా? అనే ఆందోళన ఇక్కడి అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది. రీ సర్వేకు సహకరించాలని ప్రధాని మోదీకి సీఎం జగన్ లేఖ రాశారని, కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందని అధికారవర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. అయితే, ఇది కార్యరూపం దాల్చాలంటే ఏపీ రీ సర్వే ప్రాజెక్టుకు నిధులు కేటాయించేలా కేంద్ర మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. అందుకు డీఐఎల్ఆర్ఎంపీ వద్ద రూ.1688 కోట్ల బడ్జెట్ ఉండాలి.

## సీఎం గారూ.. తక్షణమే తేల్చండి!

- సీపీఎస్‌పై కాలయాపన తగదు
- టక్కర్ నివేదిక ప్రకారం వెంటనే రద్దు
- ఏపీ జేఏసీ అమరావతి కమిటీ తీర్మానం

విజయవాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దుకు మంత్రుల కమిటీని నియమించిన ఆరు నెలల తర్వాత అధికారులతో మరో కమిటీ వేసి కాలయాపన చేయటం ఉద్యోగుల్లో తీవ్ర నిరాశ కలిగిస్తోందని ఏపీ అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. టక్కర్ ఇచ్చిన నివేదికను తక్షణమే పరిగణనలోకి తీసుకుని సీపీఎస్ రద్దుకు ముఖ్యమంత్రి జగన్ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో ఏపీజేఏసీ అమరావతి అత్యవసర సమావేశం జరిగింది. సీపీఎస్ రద్దు, ఉద్యోగుల పని ఒత్తిడి, పీఆర్సీ నివేదిక, కరువు భత్యం, ఉద్యోగుల హెల్త్‌కార్డులు వంటి ప్రధాన అంశాలపై ఈ సమావేశంలో చర్చించి తీర్మానాలు చేశారు. వీటిని ప్రభుత్వానికి పంపింది. అనంతరం బొప్పరాజు మాట్లాడుతూ నూతన ప్రభుత్వ మొదటి కేబినెట్ సమావేశంలోనే సీపీఎస్‌ను రద్దు చేయాలని విధాన నిర్ణయం తీసుకున్నందున కాలయాపన లేకుండా దీనిపై నిర్ణయం తీసుకోవాలన్నారు. టక్కర్ కమిటీ ఇచ్చిన నివేదికలో పొందుపరిచిన సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ఆయన కోరారు. నవరత్నాలు, నవశకం తదితర సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ఉద్యోగులు రాత్రింబవళ్లూ పనిచేస్తున్నారని, మొదటి స్థానం కోసం జిల్లా యంత్రాంగాలు ఉద్యోగులపై అంతులేని పనిభారం మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఒత్తిడి తగ్గించేలా సీఎం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సెప్టెంబరు 25న సబ్‌కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ఉద్యోగుల నెలవారీ చందాను పెంచడం ద్వారా ఉద్యోగుల హెల్త్‌కార్డులు పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని అధికారులు హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.వి.ఫణిపేర్రాజు మాట్లాడుతూ ఉద్యోగులకు 3నెలల కరువుభత్యాన్ని తక్షణమే చెల్లించాలన్నారు. కోశాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ పీఆర్సీ కమిటీ గడువు పెంచడంతో ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోందన్నారు.

## 500 డీఎడ్ కాలేజీలు క్లోజ్?!

- కన్వీనర్ కోటాలో 21% సీట్లే భర్తీ
- ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని ప్రభుత్వం
- కాలేజీలు నడపలేమంటున్న యాజమాన్యాలు

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(డీఎడ్)ను అందిస్తున్న కాలేజీల మనుగడ అగమ్యగోచరంగా తయారైంది. తాజా సమాచారం ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 500 డీఎడ్ కాలేజీలు మూతపడే అవకాశం కనిపిస్తోంది. దీనికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే కారణమని యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. కన్వీనర్ కోటాలో సీట్లు భర్తీకాక.. స్పాట్ అడ్మిషన్లకు అవకాశం లేక.. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాని స్థితిలో కాలేజీలను ఇకపై నడపలేమని యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. పొరుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని 'సెమిస్టర్' విధానాన్ని ప్రవేశపెట్టడంతో డీఎడ్ కోర్సుల్లో చేరే అభ్యర్థులు కరువయ్యారని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. డీసెట్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులకు మాత్రమే డీఎడ్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పించాలనే నిబంధన అడ్మిషన్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొంటున్నాయి. డీఎడ్‌కు ఇంటర్ విద్యార్హత పెట్టిన నేపథ్యంలో మార్కులు, సీనియారిటీ ప్రాతిపదికగా అడ్మిషన్లు ఇచ్చుకునేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి.

### భర్తీ నామమాత్రం

రాష్ట్రంలోని 728 డీఎడ్ కాలేజీల్లో 75వేల సీట్లున్నాయి. 2018-20 విద్యా సంవత్సరానికి 16 వేల(21%) సీట్లే భర్తీ అయ్యాయి. మరో 59 వేల సీట్లు మిగిలిపోయాయి. గతేడాది దాదాపు 70% డీఎడ్ సీట్లు భర్తీ అయ్యాయి. స్పాట్ అడ్మిషన్లకు కూడా అవకాశం కల్పించడంతో అడ్మిషన్లు బాగానే జరిగాయి. ఈసారి మాత్రం నిబంధనల కారణంగా అడ్మిషన్లు తగ్గిపోయాయి. ప్రైవేట్ డీఎడ్ కాలేజీల్లో కనిష్ఠంగా 50 సీట్ల నుంచి గరిష్ఠంగా 200 సీట్లు మంజూరయ్యాయి. కన్వీనర్ కోటాలో 75%, మేనేజ్‌మెంట్ కోటాలో 25% సీట్లు భర్తీచేయాలి. కానీ ఆ పరిస్థితి లేదని నిర్వాహకులు అంటున్నారు. 2016-18 విద్యాసంవత్సరంలో ఇంటర్ విద్యార్హతతోను, స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించడంతో సీట్లు భర్తీ అయ్యాయని మేనేజ్‌మెంట్లు చెబుతున్నాయి. 2015లో జారీ చేసిన జీవో 30 ప్రకారం స్పాట్ అడ్మిషన్లపై నిషేధం విధించారు. అయితే, 2016-17, 2017-18లో పలు కాలేజీలు స్పాట్ అడ్మిషన్లు చేసుకోగా ప్రభుత్వం వాటిని రాటిఫై చేసింది. కానీ, 2018-20 బ్యాచ్ విషయంలో మాత్రం పాఠశాల విద్యాశాఖ అనుసరించిన వైఖరి వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

### ఫీజులు పెండింగ్

డీఎడ్ ట్యూషన్ ఫీజుల విషయానికి వస్తే.. 2017-18లో రెండో క్వార్టర్, 2018-19లో మొదటి క్వార్టర్, 2019-20లో రెండో క్వార్టర్‌కు సంబంధించిన ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కాలేదని యాజమాన్యాలు చెబుతున్నాయి. వీటిపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో తాము కాలేజీలను ఎలా నిర్వహించాలో అర్థం కావడం లేదని చెబుతున్నాయి. కన్వీనర్ కోటా అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో సీట్లు భర్తీకాని పలు కాలేజీలు స్పాట్‌లో అడ్మిషన్లు చేసుకున్నాయని, వీటిని గతంలో మాదిరిగానే రాటిఫై చేయాలని మేనేజ్‌మెంట్లు కోరుతున్నాయి. లేనిపక్షంలో కాలేజీలను మూసివేయడం తప్ప మరో మార్గం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.



గ్రామంలోని ఆలయం వద్ద సమావేశమైన గ్రామస్థులు

## మా ఊరి జోలికి రావొద్దు

- యురేనియం సర్వేపై జనాగ్రహం
- ఆర్.కొత్తపల్లిలో గ్రామస్థుల సమావేశం
- ప్రాణం పోయినా గ్రామాన్ని వీడబోమని స్పష్టీకరణ

రుద్రవరం, డిసెంబరు 15: భూగర్భంలో యురేనియం నిల్వలను గుర్తించే సర్వేకు అధికారులు అనుమతించిన విషయం బహిర్గతం కావడంతో కర్నూలు జిల్లా వాసుల్లో ఆందోళన పెరిగింది. రుద్రవరం మండలం ఆర్.కొత్తపల్లె గ్రామస్థులు ఈ విషయంపై చర్చించేందుకు ఆదివారం గ్రామంలోని రామాలయం వద్ద సమావేశమయ్యారు. యురేనియం తవ్వకాల పేరిట తమ ఊరి జోలికి వస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. తమ ఊరు, తమ పొలాలు తమకు ప్రాణంతో సమానమని పలువురు వ్యాఖ్యానించారు. 'ఉన్న ఊరు కన్నతల్లితో సమానం. ప్రాణాలైన అర్పిస్తాం గానీ, గ్రామాన్ని వదిలే ప్రసక్తే లేదు' అని ఊరందరూ ముక్తకంఠంతో పేర్కొన్నారు. మండల కేంద్రానికి 2.5 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆర్.కొత్తపల్లె గ్రామం 400 ఏళ్ల క్రితం ఏర్పడింది. సుమారు 150 కుటుంబాలు ఈ ఊరిలో ఉంటున్నాయి. వ్యవసాయమే వీరి జీవనాధారం. తెలుగుగంగ కాలువ ఏర్పాటుతో ఇక్కడ పంటలు బాగా పండుతున్నాయి. అలాంటి భూములను ఎలా వదులుకుంటామని రైతులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో గుడి, బడి తదితర సౌకర్యాలన్నీ ఉన్నాయి. ఊరు, పొలాల మనుగడ ప్రశ్నార్థకంగా మారడంతో వారందరి ముఖాల్లో ఆందోళన కనిపిస్తోంది. 'ఊరిలో ప్రశాంత జీవితం గడుపుతున్నాం. ఇప్పుడు యురేనియం పేరిట వెళ్లగొట్టాలని చూస్తే ఒప్పుకోం' అని గ్రామస్థుడు బి.ఫకూర్ పేర్కొన్నారు.

### రేపు అమరావతికి రూర్కీ ఐఐటీ ప్రొఫెసర్లు

- పనులు ఏ మేరకు కుదించవచ్చో సూచించేందుకే!

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రూర్కీ ఐఐటీ ప్రొఫెసర్లు మంగళవారం అమరావతిని సందర్శించనున్నారు. విజిట్ షెడ్యూల్ సోమవారమే ఉండగా మంగళవారానికి వాయిదా వేశారు. రోడ్లు, నీటి సరఫరా, ప్రణాళిక, విద్యుత్, నీటి ప్రవాహాల ఇంజనీరింగ్ నిపుణులు ఈ బృందంలో ఉన్నారు. ఇప్పటి వరకు అమరావతిలో చేపట్టిన పనులను పరిశీలించి ఎంత వరకు పురోగతి ఉందో, ఏ మేరకు కుదించవచ్చో, ప్లాన్‌లో ఏ మేరకు మార్పులు చేయవచ్చో తేల్చుతారు. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానంతోనే ఈ బృందం వచ్చింది. అ ప్రాజెక్టులపై సీఆర్‌డీఏ, ఏడీసీ అధికారులతోనూ ప్రొఫెసర్లు చర్చిస్తారు. సుమారు నెల, నెలన్నర రోజుల్లో దీనిపై నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు.

### గనుల శాఖలో సస్పెన్షన్ కలకలం!

- అక్రమ లీజులిచ్చారన్న అభియోగంతో డీడీ, ఏడీపై వేటు

విశాఖపట్నం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లాలో గనుల శాఖకు చెందిన ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయడం అధికారవర్గాల్లో కలకలం రేపుతోంది. అక్రమంగా పర్మిట్లు ఇచ్చారన్న అభియోగంతో విశాఖ డిప్యూటీ డైరెక్టర్(ఇన్‌చార్జి)గా వ్యవహరిస్తున్న విజయనగరం ఏడీ (ఆర్‌వీఎస్) జీవీవీఎస్ చౌదరి, విశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.తమ్మినాయుడులను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ డైరెక్టర్ కె.రామ్‌గోపాల్ ఆదేశాలు జారీ చేశారు. వ్యక్తులు, సంస్థలు, కాంట్రాక్టర్లకు పర్మిట్లు ఇచ్చారన్న కారణంతో చర్యలు తీసుకున్నారు. విజయనగరం జిల్లా డీడీ కె.పూర్ణచంద్రరావుకు విశాఖ డీడీ బాధ్యతలను, ఏడీ(ఆర్‌వీఎస్) బాధ్యతలను విజయనగరం ఏడీ ఎస్‌వీ రమణారావులకు తాత్కాలికంగా అప్పగించారు. అనకాపల్లి ఏడీ వెంకటరావుకు విశాఖ ఏడీ బాధ్యతలను కట్టబెట్టారు.

## సీఏఏతో దేశానికి ప్రమాదం

- మోదీకి చంద్రబాబు, జగన్ వత్తాసు
- 19న రాష్ట్రవ్యాప్త నిరసనలు: వామపక్షాలు

విజయవాడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సరవణ చట్టం (సీఏఏ)తో దేశానికి ఎంతో ప్రమాదం పొంచి ఉందని వామపక్షాల నేతలు విమర్శించారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నామని ప్రకటించారు. విజయవాడ దాసరి భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వి. శ్రీనివాసరావు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకుడు డి.హరినాథ్ ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలే ఈ నిరసనలను ప్రోత్సహిస్తున్నాయని కేంద్రం ఆరోపించడాన్ని వారు ఖండించారు. సమస్యను పరిష్కరించడానికి మోదీ ముందుకు రావడం లేదన్నారు. ఈ విషయంలో చంద్రబాబు, జగన్.. మోదీకి వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో చంద్రబాబు, జగన్ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ ఢిల్లీలో మోదీ జపం చేస్తున్నారన్నారు. మోదీ, అమిత్‌షాకు వారు భయపడుతున్నారని అన్నారు. కేంద్రం తీసుకొచ్చిన చట్టంతో దేశంలోని 130 కోట్ల మంది తాము భారతీయులమేనని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. 1971 మార్చి 24 ముందు ఇక్కడే నివాసం ఉంటున్నామంటూ ప్రజలు కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా నిరూపించుకోవాలన్నారు. లేనిపక్షంలో వారంతా చొరబాటుదారులుగా మిగిలిపోయే ప్రమాదం ఉందన్నారు.

## సెర్చ్ అయింది.. సెలెక్షన్ ఎప్పుడు?

- ఏడు వర్సిటీల వీసీ పోస్టుల భర్తీకి అగచాట్లు.. నోటిఫికేషన్ ఇచ్చి.. సెర్చ్ కమిటీల ఏర్పాటు
- సిఫారసులు వచ్చినా గవర్నర్‌కు చేరని వైనం.. సీల్డు కవర్లను తొక్కిపెట్టిన సీఎంవో
- సీఎం జగనే చెప్పినా.. పట్టని అధికారులు.. రెగ్యులర్ వీసీల నియామకంలో తాత్సారం

అమరావతి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాలకు రెగ్యులర్ వైస్ చాన్సెలర్‌ల నియామకంలో రాష్ట్ర సర్కారు సాచివేత ధోరణిని అవలంబిస్తోంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఏడు వర్సిటీల వీసీ పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఆగస్టు 30న ఉన్నత విద్యాశాఖ నోటిఫికేషన్ ఇచ్చి, అక్టోబరులో రిటైర్డ్ ఐఏఎస్ ఆర్‌వీ విద్యానాథ అయ్యర్ చైర్మన్‌గా సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు అక్టోబరు 17 నుంచి నవంబరు తొలి వారం వరకు పలు వర్సిటీల్లో భేటీ అయి చర్చించాయి. కమిటీ సమావేశాలు ముగిసిన రోజే ముగ్గురి పేర్లతో కూడిన జాబితాలను సీల్డ్ కవర్‌లో ప్రభుత్వానికి పంపించాయి. నిబంధనల మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో) నుంచి ఈ జాబితాలను గవర్నర్ ఆమోదం కోసం పంపాలి. అయితే, ఇంతవరకు సీఎంవో నుంచి గవర్నర్‌కు సదరు జాబితాలు పంపించలేదని సమాచారం. దీంతో వీసీల నియామక ప్రక్రియ చతికిలపడిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం రాగానే వీసీ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని, నవంబరు 10 నాటికి ప్రక్రియ పూర్తిచేయాలని సీఎం ఆదేశించారు. కానీ, ఆరు నెలలైనా ఇంత వరకు వీసీల నియామకాన్ని చేపట్టలేదు. నోటిఫై చేసిన అన్ని వర్సిటీలకు ఒకేసారి వీసీల నియామకాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు చెప్పడం గమనార్హం.

### ఇక, వీటికి ఎప్పుడో?

ఆగస్టులో జారీ చేసిన నోటిఫికేషన్‌కు సంబంధించి వీసీల నియామకం ఇప్పటికీ పూర్తికాలేదు. అయితే, ద్రవిడ, శ్రీకృష్ణదేవరాయ వర్సిటీల వీసీ ఖాళీల భర్తీకి కూడా ఉన్నత విద్యాశాఖ నవంబరు 2న నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఈ వర్సిటీ వీసీల నియామకం ఎప్పటికి పూర్తిచేస్తారోననే విమర్శలు వస్తున్నాయి. ఇదిలావుంటే, నాగార్జున వర్సిటీ వీసీ ఎంపికకు అక్టోబరు 29న సెర్చ్ కమిటీ సమావేశమైంది. ఇంతలోనే, నవంబరు 4న ఇన్‌చార్జి వీసీని నియమించి పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. సదరు వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా ప్రొఫెసర్ కె.రామ్‌జీ కొనసాగుతున్న సమయంలోనే, ఆయన స్థానంలో మరో ఇన్‌చార్జి వీసీని నియమించడంలో రాజకీయ, సామాజిక కోణం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● సోమవారం 16 డిసెంబరు 2019





## ఉడకని చికెన్ వాపస్!

**పెర్త్:** వాహనాల్లో లోపాలుంటే..వాటిని వెనక్కు రప్పించి రిపేర్ చేసి ఇస్తుండడం చూస్తున్నాం. కానీ..ఆహారం సరిగ్గా ఉడకలేదని, వాటిని తిరిగి తీసుకుంటామని ప్రకటించడం పెర్త్ స్టేడియంలోని క్యాంటీన్ నిర్వాహకులకే చెల్లింది. ఆసీస్- కివీస్ టెస్ట్ ఆఖరిరోజు ఆట సందర్భంగా ఇది చోటు చేసుకుంది. ఆ క్యాంటీన్‌లో చికెన్‌తో వండిన సమోసా, ఇతర ఐటెమ్స్‌లో..చికెన్ సరిగ్గా ఉడకలేదట. ఈ విషయమై వాటిని కొనుగోలు చేసిన క్రికెట్ ఫ్యాన్ ఒకరు క్యాంటీన్‌లో ఫిర్యాదు చేయడంతో..కొన్నవాళ్లంతా వెనక్కి ఇచ్చేయాలంటూ నిర్వాహకులు బోర్డు ఏర్పాటు చేశారు. ఆ బోర్డుపై సోషల్‌మీడియాలో విమర్శలతోపాటు జోకులూ వెల్లువెత్తాయి.



సచిన్ ట్వీట్

## ఆ అభిమానిని కలవాలని ఉంది..

### ఒక్కసారిగా వార్తల్లోకెక్కిన చిరుద్యోగి

**చెన్నై:** గురుప్రసాద్.. 46 ఏళ్ల ఈ అసిస్టెంట్ స్టాక్‌బ్రోకర్ గతంలో ఓ స్టార్‌హోటల్లో సెక్యూరిటీ గార్డ్. కానీ శనివారం నాడు ఒక్కసారిగా అతడు మీడియా దృష్టిలో పడ్డాడు. అతడితో మాట్లాడేందుకు స్పోర్ట్స్ రిపోర్టర్లంతా ప్రయత్నించడంతో గురుప్రసాద్ మొబైల్ విరామం లేకుండా మోగుతూనే ఉంది. గురుప్రసాద్ ఇలా హఠాత్తుగా వార్తల్లో వ్యక్తిగా మారడానికి దిగ్గజ బ్యాట్స్‌మన్ సచిన్ టెండూల్కరే కారణం. 'చాలాకాలం కిందట చెన్నై తాజ్ కోరమాండల్ హోటల్‌లో ఓ అభిమానిని కలిశాను. నా ఎల్బో గార్డ్ విషయంలో అతడు చేసిన సూచన నన్ను ఆశ్చర్యపరిచింది. అతని సూచనల ప్రకారం నేను ఎల్బోగార్డ్‌ను మార్చుకున్నా కూడా. అతనిప్పుడు ఎక్కడున్నాడో తెలియదు. తెలిస్తే కలవాలని అనుకుంటున్నా' అన్నది సచిన్ ట్వీట్ సారాంశం. అయితే ట్విటర్‌ను ఉపయోగించని గురుప్రసాద్‌కు ఆ విషయం తెలియదు. ఫ్రాన్స్ నుంచి అతడి మేనల్లుడు ఫోన్ చేసి టెండూల్కర్ ట్వీట్ విషయం చెప్పేసరికి డైహార్డ్ క్రికెట్ ఫ్యాన్ అయిన గురుప్రసాద్ ఆనందానికి అవధుల్లేవు. ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళితే.. అప్పట్లో ఓ మ్యాచ్‌కోసం సచిన్, ద్రావిడ్ తాజ్‌లో బసచేసిన ఫ్లోర్‌లో గురుప్రసాద్ సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆ సమయంలో సచిన్ రూమ్ నుంచి బయటకువచ్చి లిఫ్ట్ వద్దకు వెళ్లబోతుండగా గురుప్రసాద్ ఆటోగ్రాఫ్ అడిగాడు. కానీ అప్పుడతడి వద్ద పేపర్ లేదు. దాంతో సెక్యూరిటీ బీట్ నోట్‌బుక్‌లోనే సచిన్ ఆటోగ్రాఫ్ తీసుకున్నాడు. టెండూల్కర్ ఆటోగ్రాఫ్ ఇస్తుండగా..' సర్ మీరేమనుకోనంటే క్రికెట్‌కు సంబంధించి ఓ సూచన చేయొచ్చా' అని అడిగాడు. టెండూల్కర్ ఓకే అన్నాడుట. దాంతో మీ ఎల్బోగార్డ్ వల్ల బ్యాటింగ్ సమయంలో అసౌకర్యానికి గురవుతున్నారని సచిన్‌కు చెప్పాడు. ఓ అభిమాని తన బ్యాటింగ్‌ను అంత తీక్షణంగా గమనిస్తుండడం చూసి సచిన్ ఆశ్చర్యపోయాడట. ఇక.. 18 ఏళ్ల తర్వాత సచిన్ గుర్తు చేసుకొని అతడిని కలవాలన్న ఆకాంక్షను ట్విటర్ ద్వారా వ్యక్తంజేశాడు. దీంతో సచిన్ తన ఇంటికి వస్తే తమిళ సంప్రదాయాలతో గౌరవిస్తానని గురుప్రసాద్ చెప్పాడు.



**1** విండీస్ తరఫున వేగంగా (38 ఇన్నింగ్స్) ఐదు శతకాలు పూర్తి చేసిన హెట్‌మయెర్. ఈ ఐదింట్లో ఎక్కువ బంతులు (85) తీసుకుంది ఇప్పుడే.



రిషభ్ పంత్ (71)

'వన్డే క్రికెట్ ఎలా ఆడాలో మాకు తెలుసు..' ఈ మ్యాచ్‌కు ముందు విండీస్ కెప్టెన్ పొలార్డ్ ఆత్మవిశ్వాసంతో చేసిన కామెంట్ ఇది. వారి వ్యూహానికి తగ్గట్టుగానే స్లో పిచ్‌పై శ్రేయాస్ అయ్యర్, రిషభ్ పంత్ అర్ధసెంచరీలతో భారత్ 287 పరుగుల భారీ స్కోరు సాధించినా డోంట్ కేర్ అన్నట్టుగా విండీస్ దూకుడు కొనసాగింది. ముఖ్యంగా హెట్‌మయెర్‌కు భారత బౌలర్లు వేసిన బంతులు కూడా 'హిట్ మి యార్' అన్నట్టుంది.. పిడుగుల్లాంటి సిక్సర్లతో విరుచుకుపడుతూ శతక ఇన్నింగ్స్‌తో అదరగొట్టాడు. అటు హోప్ తుదికంటా ఓపిగ్గా నిలిచి తనూ మూడంకెల స్కోరు చేయగా భారత్ 8 వికెట్ల తేడాతో చిత్తు కావాల్సి వచ్చింది.

హెట్‌మయెర్ (106 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్సర్లతో 139)

# విండీస్ విజృంభణ

## హెట్‌మయెర్, హోప్ శతకాలు

## తొలి వన్డేలో భారత్ ఓటమి

హోప్ (151 బంతుల్లో 102)

**2** భారత్‌పై రెండో వికెట్‌కు అత్యధిక భాగస్వామ్యం (218) అందించిన విండీస్ రెండో జోడీ హెట్‌మయెర్, హోప్.

### స్కోరుబోర్డు

**భారత్:** రోహిత్ శర్మ (సి) పొలార్డ్ (బి) జోసెఫ్ 36; రాహుల్ (సి) హెట్‌మయెర్ (బి) కాట్రెల్ 6; కోహ్లీ (బి) కాట్రెల్ 4; శ్రేయాస్ అయ్యర్ (సి) పొలార్డ్ (బి) జోసెఫ్ 70; పంత్ (సి) హెట్‌మయెర్ (బి) పొలార్డ్ 71; జాదవ్ (సి) పొలార్డ్ (బి) పాల్ 40; జడేజా (రనౌట్) 21; దూబే (సి) హోల్డర్ (బి) పాల్ 9; దీపక్ చాహర్ (నాటౌట్) 7; షమి (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 50 ఓవర్లలో 287/8. వికెట్ల పతనం:** 1-21, 2-25, 3-80, 4-194, 5-210, 6-269, 7-269, 8-282. **బౌలింగ్:** కాట్రెల్ 10-3-46-2; హోల్డర్ 8-0-45-0; హేడెన్ వాల్ష్ 5-0-31-0; పాల్ 7-0-40-2; జోసెఫ్ 9-1-45-2; చేజ్ 7-0-42-0; పొలార్డ్ 4-0-28-1.

**విండీస్:** హోప్ (నాటౌట్) 102; ఆంబ్రిస్ (ఎల్బీ) చాహర్ 9; హెట్‌మయర్ (సి) అయ్యర్ (బి) షమి 139; పూరన్ (నాటౌట్) 29; **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 47.5 ఓవర్లలో 291/2.**

**వికెట్ల పతనం:** 1-11, 2-229. **బౌలింగ్:** చాహర్ 10-1-48-1; షమి 9-1-57-1; కుల్దీప్ 10-0-45-0; దూబే 7.5-0-68-0; జాదవ్ 1-0-11-0; జడేజా 10-0-58-0.

**చెన్నై:** వన్డే ఫార్మాట్‌లో తిరుగులేని ఆధిపత్యంతో దూసుకెళుతున్న టీమిండియాకు వెస్టిండీస్ షాకిచ్చింది. హెట్‌మయెర్ (106 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్సర్లతో 139) తుఫాన్ ఇన్నింగ్స్‌తో అలరించగా షాయ్ హోప్ (151 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 102) అజేయ శతకంతో నిలిచాడు. దీంతో ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో విండీస్ 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. అలాగే మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంతో నిలిచింది. రెండో మ్యాచ్ బుధవారం విశాఖలో జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 287 పరుగులు చేసింది. రిషభ్ పంత్ (69 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 71), శ్రేయాస్ అయ్యర్ (88 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 70) అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. జాదవ్ (35 బంతుల్లో 40), రోహిత్ (56 బంతుల్లో 36) ఫర్వాలేదనిపించారు. కాట్రెల్, పాల్, జోసెఫ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో విండీస్ 47.5 ఓవర్లలో 2 వికెట్లకు 291 పరుగులు చేసి నెగ్గింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా హెట్‌మయెర్ నిలిచాడు.

**ద్విశతక భాగస్వామ్యం:** తుఫాన్ ముందు ప్రశాంతతా అన్నట్టు తొలి ఓవర్‌ను విండీస్ మేడిన్‌గానే ఆడింది. పేసర్ దీపక్ చాహర్ కళ్లు చెదిరే బంతులతో విరుచుకుపడుతూ ఓపెనర్ ఆంబ్రిస్ (9)ను ఐదో ఓవర్‌లోనే ఎల్బీగా అవుట్ చేశాడు. కానీ భారత్‌కు ఈ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. ఓపెనర్ హోప్ అండగా నిలవడంతో హెట్‌మయర్ టీ20 తరహా ఆటతీరుతో చెలరేగాడు. దాదాపు 25 ఓవర్లపాటు క్రీజులో నిలిచిన ఈ జోడీ రెండో వికెట్‌కు 218 పరుగులు చేసింది. బౌలర్లను మార్చినా పిచ్ ప్రమాదకరంగా లేకపోవడంతో హెట్‌మయర్ దూకుడు తగ్గలేదు. వరుస బౌండరీలతో చెలరేగుతూ 50 బంతుల్లో అర్ధసెంచరీని పూర్తి చేశాడు. ఇదే ఊపుతో చకచకా శతకం వైపు సాగాడు. మరోవైపు క్రీజులో పాతుకుపోయిన హోప్ కూడా 92 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లు కొంతమేర కట్టడిచేశారు. ఈ సమయంలో ఆచితూచి ఆడిన హెట్‌మయెర్ 85 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. ఇక తర్వాత గేరు మార్చిన అతడు 36వ ఓవర్‌లో వరుసగా రెండు సిక్సర్లతో అలరించాడు. అయితే అంతకుముందు ఓవర్‌లో తన క్యాచ్‌ను అయ్యర్ అందుకోలేకపోయినా 39వ ఓవర్‌లో హెట్‌మయెర్ తిరిగి అతడికే చిక్కాడు. తదనంతరం విజయానికి 58 పరుగులను హోప్, పూరన్ (29 నాటౌట్) మరో 13 బంతులుండగానే సునాయాసంగా సాధించారు. ఈక్రమంలో హోప్ 150 బంతుల్లో శతకం పూర్తి చేశాడు.

**ఆరంభంలో తడబాటు:** పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్నట్టు కనిపించినా టాస్ గెలవగానే విండీస్ ఫీల్డింగ్‌కు దిగి ఆశ్చర్యపరిచింది. కానీ బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలో పరుగులు కష్టమయ్యాయి. ముఖ్యంగా పేసర్ కాట్రెల్ చక్కటి లెంగ్త్ బంతులకు భారత్ తొలి ఓవర్‌నే మేడిన్‌గా ఆడాల్సి వచ్చింది. అలాగే వరుసగా అతడి 16 బంతుల్లో ఒక్క పరుగు కూడా తీయలేకపోయింది. దీనికి తోడు ఏడో ఓవర్‌లో కాట్రెల్ డబుల్ ఝలక్ ఇచ్చాడు. రెండో బంతికి ఓపెనర్ రాహుల్ (6) ఇచ్చిన సులువైన క్యాచ్‌ను హెట్‌మయెర్ అందుకున్నాడు. ఇక ప్రేక్షకుల హోరు మధ్యన క్రీజులోకి వచ్చిన కోహ్లీ (4) మిడాఫ్‌లో ఓ చక్కటి బౌండరీతో ఒత్తిడి పెంచే ప్రయత్నం చేశాడు. కానీ చివరి బంతి అనూహ్యంగా బ్యాట్ ఎడ్జ్‌కు తాకి వికెట్ల మీదికి రావడంతో బౌల్డ్ అయ్యాడు. దీంతో 25 పరుగులకు రెండు వికెట్లు కోల్పోయిన భారత్ ఇబ్బందుల్లో పడినట్టు అనిపించింది. అటు ఆచితూచి ఆడిన రోహిత్ (36) 19వ ఓవర్‌లో పొలార్డ్‌కు క్యాచ్ ఇచ్చాడు.

**అయ్యర్, పంత్ ఆదుకున్నారు..:** శ్రేయాస్ అయ్యర్-రిషభ్ పంత్ సమన్వయంతో ఆడి నాలుగో వికెట్‌కు ఏకంగా 114 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. పిచ్‌ను అర్థం చేసుకుంటూ ఓపిగ్గా ఆడిన పంత్ 28వ ఓవర్‌లో తన ట్రేడ్‌మార్క్ స్లాగ్ స్వీప్ షాట్‌తో భారత్‌కు తొలి సిక్సర్‌ను అందించాడు. అటు కట్ షాట్లతో అలరించిన అయ్యర్ 70 బంతుల్లో వరుసగా మూడో అర్ధసెంచరీ పూర్తి చేయగా పంత్ 49 బంతుల్లోనే వన్డేలో తొలి హాఫ్ సెంచరీని అందుకున్నాడు. అయితే ఈ జోడీని అల్జెరీ జోసెఫ్ విడదీశాడు. 37వ ఓవర్‌లో ఆఫ్ స్టంప్ మీదుగా వచ్చిన బంతిని అయ్యర్ ఫ్లిక్ చేయబోగా అది నేరుగా పొలార్డ్ చేతుల్లో పడింది. స్వల్ప వ్యవధిలోనే పొలార్డ్ బౌలింగ్‌లో పంత్ భారీ షాట్‌కు వెళ్లి డీప్ స్క్వేర్ లెగ్‌లో క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత స్లాగ్ ఓవర్లలో జాదవ్, జడేజా స్ట్రయిక్‌ను రొటేట్ చేసుకుంటూ స్కోరుబోర్డును పరిగెత్తించారు. 48వ ఓవర్‌లో వరుస బంతుల్లోనే ఈ ఇద్దరూ అవుట్ కాగా ఆరో వికెట్‌కు 59 పరుగులు వచ్చాయి.



ఎనిడ్ బేక్‌వెల్



అబిద్ అలీ

## అబిద్ అరంగేట్ర రికార్డు

### పాక్-లంక తొలి టెస్టు డ్రా

**రావల్పిండి:** పాకిస్థాన్ ఓపెనర్ అబిద్ అలీ అరుదైన రికార్డు నెలకొల్పాడు. వన్డేతో పాటు టెస్టు క్రికెట్‌లోనూ అరంగేట్ర మ్యాచ్‌లో సెంచరీలు చేసిన తొలి బ్యాట్స్‌మన్‌గా అబిద్ నిలిచాడు. శ్రీలంకతో ముగిసిన తొలి టెస్టులో అతను ఈ ఘనత సాధించాడు. 32 ఏళ్ల లేటు వయసులో టెస్టుల్లోకి ఎంట్రీఇచ్చిన అబిద్ ఈ ఏడాది మార్చిలో ఆస్ట్రేలియాపై ఆడిన తన మొదటి వన్డేలోనూ శతకం బాదాడు. కాగా, వర్షం నీడలా వెంటాడిన పాక్-లంక తొలి టెస్టు చివరికి డ్రాగా ముగిసింది. మొదటి మూడు రోజులు ఆటకు వరుణుడు తీవ్ర అంతరాయం కలిగించగా.. నాలుగో రోజు పూర్తి ఆట పూర్తిగా రద్దయింది. మూడో రోజు స్కోరు 282/6తో చివరి రోజైన ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన లంక 308/6 వద్ద డిక్లేర్ చేసింది. ధనంజయ డిసిల్వా (102 నాటౌట్) శతకంతో రాణించాడు. అనంతరం అబిద్ అలీ (109 నాటౌట్), బాబర్ ఆజమ్ (102 నాటౌట్) అజేయ సెంచరీలతో విజృంభించడంతో.. ఆట చివరకు పాక్ 252/2 స్కోరు చేయగా.. మ్యాచ్ డ్రా అయ్యింది.

**అలీ అదరహో:** ఈ ఏడాది మార్చిలో ఆస్ట్రేలియాపై అరంగేట్రం వన్డేలోనే అబిద్ (112) సెంచరీ కొట్టాడు. దీంతో తొలి వన్డేలోనే శతకం బాదిన 15వ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. కాగా, వన్డే, టెస్టుల్లో ఈ ఫీట్ చేసిన తొలి పురుష బ్యాట్స్‌మన్ అబిద్ కావడం విశేషం. అయితే మహిళల క్రికెట్‌లో ఇంగ్లండ్‌కు చెందిన ఎనిడ్ బేక్‌వెల్ 60,70వ దశకాల్లో శతకాలు సాధించి ఈ రికార్డు నెలకొల్పింది.





## హంపికి రెండో స్థానం

### గ్రాండ్ ప్రీ చెస్

**మొనాకో:** ఫిడే మహిళల గ్రాండ్ ప్రీ చెస్ టోర్నీలో తెలుగు గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి రన్నరప్‌గా నిలిచింది. 12 మంది మేటి క్రీడాకారిణుల మధ్య 11 రౌండ్లు జరిగిన టోర్నీలో హంపి మొత్తం 7 పాయింట్లతో రష్యా గ్రాండ్ మాస్టర్లు అలెగ్జాండ్రా కోస్టెనిక్, అలెగ్జాండ్రా గోర్యాచికినాతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచింది. టోర్నీ నిబంధనల ఆధారంగా ర్యాంకింగ్స్‌ను వర్గీకరించి.. కోస్టెనిక్‌ను విజేతగా ప్రకటించారు. హంపి రెండో స్థానంతో సరిపెట్టుకుంది.



## జడేజా రనౌట్‌పై డ్రామా..

తొలి వన్డేలో రవీంద్ర జడేజా రనౌట్ నిర్ణయం వివాదాస్పదమైంది. 48వ ఓవర్‌లో కీమో పాల్ వేసిన బంతిని జడేజా మిడ్ వికెట్ వైపు ఆడి సింగిల్ కోసం ప్రయత్నించాడు. అయితే రోస్టన్ చేజ్ నేరుగా విసిరిన బంతి నాన్ స్ట్రయిక్ ఎండ్‌లో వికెట్లను గిరాటేయగా అప్పటికి జడేజా తన బ్యాట్‌ను క్రీజులో పెట్టలేదు. అయితే మైదానంలో ఉన్న ఇద్దరు అంపైర్లు కూడా జడేజా రనౌట్ విషయం గమనించకపోగా, ఫీల్డర్లు కూడా అప్పీల్ చేయలేదు. కానీ భారీ స్ర్కీన్‌పై రీప్లేలో జడేజా రనౌటైనట్టు కనిపించింది. అలాగే తమ డ్రెస్సింగ్‌రూమ్ నుంచి సిగ్నల్ రావడంతో విండీస్ కెప్టెన్ పొలార్డ్ వెంటనే అంపైర్‌ను సంప్రదించాడు. దీంతో ఇరువురు అంపైర్లు కాసేపు చర్చించాక థర్డ్ అంపైర్‌కు రిఫర్ చేశారు. దీంతో జడేజాను అవుట్‌గా ప్రకటించారు. అయితే అంత సమయం వేచి చూశాక అవుటివ్వడంపై కోహ్లీ డ్రెస్సింగ్ రూమ్ నుంచి బౌండరీలైన్ దగ్గరికొచ్చి అసహనాన్ని వ్యక్తం చేయడం కనిపించింది. ఇదిలావుండగా రనౌట్‌పై ఆటగాళ్లు నేరుగా అప్పీల్ చేయకున్నా కూడా స్ర్కీన్‌పై చూసిన తర్వాత ఫోర్త్ అంపైర్ నిర్ణయాన్ని కోరడం ఎంతవరకు సమంజసమనే వాదన వినిపిస్తోంది.



## ధోనీ దబాంగ్ ప్లేయర్

**న్యూఢిల్లీ:** టీమిండియా మాజీ కెప్టెన్ ధోనీ అంటే తనకు ఎంతో ఇష్టమని బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ చెప్పాడు. ఏమాత్రం భయం లేకుండా ధోనీ ఆడే విధానం తనకు ఎంతో నచ్చుతుందని అన్నాడు. కేదార్ జాదవ్ నాకు వ్యక్తిగతంగా తెలుసు. ఇక నా ఫేవరెట్ క్రికెటర్ అంటే ధోనీనే. అతడు దబాంగ్ (బెదురులేని) ప్లేయర్' అని స్టార్ స్పోర్ట్స్ షోలో సల్మాన్ చెప్పాడు. తన సినిమా 'దబాంగ్ 3' ప్రమోషన్‌లో భాగంగా ఈ కార్యక్రమానికి వచ్చాడు.



బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ టైటిల్‌తో జపాన్ షట్లర్ కెంటో మొమోటా

## రన్నరప్ ఆంధ్రప్రదేశ్



**హైదరాబాద్, (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి):** జాతీయ ఫెడరేషన్ కప్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ రన్నరప్‌గా నిలిచింది. కాకినాడలోని ఏపీఎస్‌పీ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన పురుషుల ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ 3-4 స్కోరుతో మహారాష్ట్ర చేతిలో ఓడి రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణకు మూడో స్థానం దక్కింది. మహిళల ఫైనల్లో మధ్యప్రదేశ్ 4-1 స్కోరుతో కేరళపై గెలుపొంది.. టైటిల్ నెగ్గింది. పంజాబ్ మూడో స్థానం సాధించింది.

## నేడు విశాఖకు భారత్, విండీస్ ఆటగాళ్లు

### నెట్ ప్రాక్టీస్ రేపు

**విశాఖపట్నం (స్పోర్ట్స్):** ఏసీఏ వీడీసీఏ స్టేడియం వేదికగా ఈ నెల 18న (బుధవారం) భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య అంతర్జాతీయ వన్డే జరగనుంది. ఇందుకోసం ఇరుజట్ల ఆటగాళ్లు సోమవారం ఉదయం చెన్నై ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి మధ్యాహ్నం విశాఖ విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల్లో హోటల్‌కు వెళతారు. మంగళవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో నెట్ ప్రాక్టీస్ చేయనున్నారు.



టోక్యో ఒలింపిక్స్ ప్రారంభ, ముగింపు ఉత్సవాలకు ఆతిథ్యమిచ్చే నేషనల్ స్టేడియాన్ని ఆదివారం ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

## బంగ్లా చాలెంజర్

### విజేత లక్ష్యసేన్

**ఢాకా:** బంగ్లాదేశ్ బ్యాడ్మింటన్ చాలెంజర్ టోర్నీ టైటిల్‌ను భారత యువ షట్లర్ లక్ష్యసేన్ సొంతం చేసుకున్నాడు. అయితే, డబుల్స్‌లో రితూపర్ణ, అర్జున్ జోడీలు తుది పోరులో ఓడి రన్నరప్‌గా నిలిచాయి. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్యసేన్ 22-20, 21-18తో లియాంగ్ జున్ హో (మలేసియా)పై గెలిచాడు. డబుల్స్‌లో అర్జున్-ధ్రువ్ కపిల ద్వయం 19-21, 16-21తో మలేసియా జోడీ జి యంగ్ చాంగ్-కై ఉన్ టి చేతిలో పరాజయం పాలైంది. మహిళల డబుల్స్‌లో రితూపర్ణ-మనీషా జంట 20-22, 19-21తో మలేసియాకు చెందిన టాన్ పెర్లీ కూంగ్ లి-థినా మురళీధరన్ జోడీ చేతిలో ఓడింది.

## అండర్-23 చాలెంజర్ ట్రోఫీ

### చాంపియన్ ఇండియా-బి

**పుదుచ్చేరి:** మహిళల అండర్-23 టీ20 చాలెంజర్ ట్రోఫీని ఇండియా-బి టీమ్ కైవసం చేసుకుంది. ఫైనల్లో ఇండియా-బి 5 వికెట్ల తేడాతో ఇండియా-సిపై గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా-సి నిర్ణీత 20 ఓవర్లలో 96/5 స్కోరు చేసింది. ఇండియా-బి బౌలర్, తెలుగమ్మాయి అంజలీ శర్వాణి ఒక వికెట్ పడగొట్టడంతోపాటు రెండు కీలక క్యాచ్‌లతో సత్తా చాటింది. స్వల్ప లక్ష్యాన్ని ఇండియా-బి 18.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి ఛేదించింది. వృశాలి భగత్ 41 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది.



ట్రోఫీతో అంజలి

## ఆస్ట్రేలియా ఘన విజయం

- న్యూజిలాండ్‌తో టెస్ట్
- స్టార్క్, లియాన్‌కు నాలుగేసి వికెట్లు

**పెర్త్:** పేసర్ మిచెల్ స్టార్క్ (4/45), స్పిన్నర్ నాథన్ లియాన్ (4/63) చెరో నాలుగు వికెట్లతో విజృంభించడంతో.. న్యూజిలాండ్‌తో తొలి (డే/నైట్) టెస్ట్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా 296 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. మూడు టెస్ట్‌ల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 167/6తో నాలుగో రోజైన ఆదివారం ఆటను కొనసాగించిన ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌ను 217/9 వద్ద డిక్లేర్ చేసి కివీస్ ఎదుట 468 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో ఆసీస్ బౌలర్ల దెబ్బకు న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 171 పరుగులకే కుప్పకూలింది. వాట్లింగ్ (40) టాప్ స్కోరర్. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 416, న్యూజిలాండ్ 166 పరుగులు చేశాయి.


ఢిల్లీలోని జామియా మిలియా వర్సిటీలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు


సీఏఏకు వ్యతిరేకంగా గువాహటిలో ఆల్ ఆర్టిస్ట్ ఆఫ్ అసోం సభలో మాట్లాడుతున్న నటి బర్షా రాణి బైశ్య

# జామియా రణరంగం

(మొదటి పేజీ తరువాయి)

ఆదివారం సాయంత్రం చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఆందోళనకారులు మూడు బస్సులకు, వందకు పైగా ద్విచక్రవాహనాలకు నిప్పు పెట్టారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగం చేశారు. విశ్వవిద్యాలయం లోపలికి ప్రవేశించి 50 నుంచి 100 మంది దాకా విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. అయితే పోలీసులు దీన్ని ధ్రువీకరించలేదు. విద్యార్థులు 200 నుంచి 300 మంది దాకా వస్తారని అంచనా వేసి ఆమేరకు తాము సన్నద్ధమయ్యామని.. కానీ, స్థానిక గూండాలు నిరసన ప్రదర్శనలోకి చొరబడి వాహనాల దహనానికి పాల్పడ్డారని.. ఆపడానికి ప్రయత్నిస్తే రాళ్లు విసిరారని.. పోలీసులు చెబుతున్నారు. పరిస్థితిని అదుపు చేసేందుకే తాము చర్యలు తీసుకున్నామని వివరిస్తున్నారు. అగ్నిమాపక శాఖకు చెందిన ఇద్దరికి, ఆరుగురు పోలీసులకు రాళ్లదాడిలో గాయాలయ్యాయని.. ఒక ఫైరింజన్ ధ్వంసమైందని వెల్లడించారు. అయితే, విద్యార్థులు మాత్రం తాము శాంతియుతంగానే నిరసన తెలిపినట్టు స్పష్టం చేస్తున్నారు. వర్సిటీ ప్రాంగణంలోకి పోలీసులు అనుమతి లేకుండా, బలవంతంగా ప్రవేశించారని.. తమ విద్యార్థులను, అధ్యాపకులను కొట్టి క్యాంపస్ వీడి వెళ్లాలని ఆజ్ఞాపించారని.. జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ చీఫ్ ప్రొక్టర్ వసీమ్ అహ్మద్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. వర్సిటీ సమీపంలో ఆందోళనకు దిగిన కొందరు వ్యక్తులు లాఠీచార్జి మొదలవగానే వర్సిటీ ప్రాంగణంలోకి పరుగెత్తారని.. వారి కోసమే పోలీసులు లోపలికి వెళ్లారని కొందరు చెబుతున్నారు. కానీ.. పలువురు విద్యార్థులు రెండు చేతులూ పైకెత్తి వర్సిటీలోంచి బయటకు వస్తుండగా పోలీసులు వారి వెనుక ఉన్న దృశ్యాలు మీడియాలో ప్రచారమయ్యాయి. కాగా.. జరిగిన హింసను ఖండిస్తూ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ట్వీట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్ ముస్లిం వర్సిటీ వద్ద కూ డా పౌరసత్వ చట్టానికి వ్యతిరేకం గా జరిగిన నిరసన ప్రదర్శన హిం సాత్మకంగా మారింది. వర్సిటీలోకి ప్రవేశించిన పోలీసులపై విద్యార్థులు రాళ్లు రువ్వగా.. పోలీసులు బాష్పవాయు ప్రయోగం చేశారు.

### బెంగాల్‌లో హింస.. ఉపశమిస్తున్న ఈశాన్యం..

పౌరసత్వ చట్టంపై బెంగాల్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ముర్షీదాబాద్, హౌరా, నార్త్24 పరగణా, మాల్డా జిల్లాల్లో అక్కడక్కడా ఆందోళనలు జరిగాయి. ఈ జిల్లాల్లో ముందస్తు జాగ్రత్తగా ఇంటర్నెట్, ఎస్సెమ్మెస్ సేవలను తాత్కాలికంగా నిలిపివేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్రపతి పాలన విధించడం తప్ప మరో మార్గం ఉండదని బీజేపీ నేత ఒకరు వ్యాఖ్యానించారు. మరోవైపు.. ఈశాన్యభారతంలో పరిస్థితి క్రమేపీ అదుపులోకి వస్తోంది. అసోంలోని గువాహటి, డిబ్రూగఢ్ తదితర ప్రాంతాల్లో ఆదివారం పగటిపూట కర్ఫ్యూని సడలించారు. వివిధ ప్రాంతాల్లో చిక్కుకున్నవారిని గమ్య స్థానాలకు చేర్చేందుకు అసోం పర్యాటక శాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఇటీవల జరిగిన పోలీసు కాల్పుల్లో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు ఆదివారం మరణించారు. దీంతో ఆందోళనల మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. సీఏఏను వెనక్కితీసుకునేలా ఆదేశించాలంటూ సుప్రీం కోర్టును ఆశ్రయించాలని అసోం గణపరిషత్(ఏజీపీ) నిర్ణయించింది.

### ముస్లింలూ.. భయం వద్దు: రిజ్వి

జమ్ము, డిసెంబరు 15: మైనారిటీలకు పౌరసత్వ సవరణ చట్టం వ్యతిరేకం కాదని జాతీయ మైనారిటీ కమిషన్ చైర్మన్ సయ్యద్ ఘయోరుల్ హసన్ రిజ్వి అన్నారు. భారతీయ ముస్లింలు చొరబాటుదారులు, శరణార్థులు కాదని మీడియా సమావేశంలో చెప్పారు. దేశంలోని ముస్లింలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. కాగా, ఈ బిల్లు పార్లమెంటు ఆమోదం పొందడాన్ని కశ్మీరీ పండిత్‌లు స్వాగతించారు. పౌరసత్వ సవరణ చట్టం తీసుకురావడంపై దేశం మొత్తం మోదీకి మద్దతు తెలుపుతోందని 'పనున్ కశ్మీర్' సంస్థ కన్వీనర్ అగ్నిశేఖర్ అన్నారు.

## హింస వెనుక విపక్షాలు

- మా నిర్ణయం 1000 శాతం కరెక్ట్
- పౌరసత్వ చట్టంపై ప్రధాని మోదీ

దుమ్కా (జార్ఖండ్), డిసెంబరు 15: పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్‌లో మతపరమైన పీడనకు గురై శరణార్థులుగా వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించాలన్న తమ నిర్ణయం 1000 శాతం సరైనదని ప్రధాని మోదీ అన్నారు. వారి జీవితాలను మెరుగుపరిచి, వారికి గౌరవం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. దీని కోసం తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళనలు, హింస వెనుక ప్రతిపక్షాల హస్తం ఉందని ఆరోపించారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఎంత రెచ్చగొట్టినా ఈశాన్య రాష్ట్రాల ప్రజలు హింసను తిరస్కరించారన్నారు. ఆదివారం దుమ్కా (జార్ఖండ్) ఎన్నికల సభలో మోదీ ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా మన దౌత్య కార్యాలయాల వద్ద 'భారత్ బచావో' ప్రదర్శనలు నిర్వహించాలన్న కాంగ్రెస్ నిర్ణయంపై మండిపడ్డారు. ఎప్పుడూ పాకిస్థాన్ చేసే పనిని ఈసారి కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. పార్లమెంటులో తీసుకున్న నిర్ణయాలన్నీ సరైనవేనని ఆ పార్టీ చర్యలు నిరూపిస్తున్నాయని వ్యాఖ్యానించారు.



## అవసరమైతే సీఏఏలో మార్పులు

- కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి

రాంచీ, డిసెంబరు 15: ఈశాన్య రాష్ట్రాల ఆందోళన దృష్ట్యా అవసరమైతే పౌరసత్వ సవరణ చట్టంలో కొన్ని మార్పులు చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ బిల్లు పార్లమెంటు ఆమోదం పొంది, చట్టంగా రూపుదాల్చిన తర్వాత దాని గురించి తొలిసారిగా శనివారం ఆయన జార్ఖండ్‌లో ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడారు. "మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా, ఆయన మంత్రులు శుక్రవారం నన్ను కలిశారు. పౌరసత్వ సవరణ చట్టంలో కొన్ని మార్పులు చేయాల్సి ఉందని వారు పట్టుబట్టడంతో క్రిస్మస్ తర్వాత కలవాలని కోరాను. మేఘాలయ సమస్యలకు పరిష్కారం కనుగొంటామని వారికి హామీ ఇచ్చాను" అని చెప్పారు. తాము పౌరసత్వ సవరణ బిల్లు తేవడంతో కాంగ్రెస్‌కు కడుపునొప్పి వచ్చిందని వ్యాఖ్యానించారు.

### మా పౌరుల వివరాలివ్వండి: బంగ్లా

ఢాకా, డిసెంబరు 15: భారత్‌లో అక్రమంగా నివసిస్తోన్న తమ దేశీయుల వివరాలు తెలపాలని తాము కోరామని బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఏకే అబ్దుల్ మోమెన్ అన్నారు. ఆ జాబితాను తమకు ఇస్తే వారిని తిరిగి బంగ్లాదేశ్‌కు రప్పిస్తామని చెప్పారు. సొంత దేశానికి వచ్చే హక్కు వారికి ఉందని వ్యాఖ్యానించారు.

### పాక్‌లో తీవ్రస్థాయిలో మత వివక్ష

ఐక్యరాజ్య సమితి నివేదికలో వెల్లడి

ఇస్లామాబాద్, డిసెంబరు 15: మత స్వేచ్ఛ విషయంలో పాకిస్థాన్ నిజ స్వరూపాన్ని ఐక్యరాజ్య సమితి బట్టబయలు చేసింది. ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ నేతృత్వంలోని తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ ప్రభుత్వ అతివాద ధోరణులతో అక్కడి ముస్లిమేతరులు.. ముఖ్యంగా హిందువులు, క్రైస్తవులు తీవ్ర వేధింపులకు గురవుతున్నారని సమితి ఎకనమిక్ అండ్ సోషల్ కౌన్సిల్ ఇటీవల విడుదల చేసిన నివేదిక తేల్చింది. భారత్ తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై దాయాది దేశం ఆక్రోశం వెళ్లగక్కుతున్న నేపథ్యంలో దీనికి ప్రాధాన్యం సంతరించుకుంది. సమితి నివేదికలో ఏముందంటే.. 'ముస్లిం పురుషులను పెళ్లాడేందుకు ఏటా వందలాది మైనార్టీ మహిళలు, బాలికలను ఇస్లాంలోకి మారేలా ఒత్తిడి చేస్తున్నారు. ఈ ఏడాది మే నెలలో ఓ హిందూ వెటర్నరీ డాక్టర్ దైవ దూషణ చేసినట్లు వదంతులు వచ్చాయి. క్షణాల్లోనే కొందరు అతడి క్లినిక్‌తో పాటు హిందువులకు చెందిన మరి కొన్ని దుకాణాలకు నిప్పంటించారు. ఇలాంటి తీవ్రమైన నేరాల్లోనూ పోలీసులు, కోర్టులు అచేతనంగా ఉంటున్నాయి. ఆఖరుకు పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు, సహధ్యాయులు వివక్ష చూపుతూ.. మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారు' అని వివరించింది.

## ఉల్లితో కోటీశ్వరుడు!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నాడు. ఇప్పటికే ఉన్న అప్పులకు తోడు మరికొంత అప్పు చేసి రూ.15 లక్షల పెట్టుబడితో 20 ఎకరాల్లో ఉల్లి సాగు చేశాడు. అతడి సాహసం ఫలించింది. మల్లికార్జున సాగు చేసిన 20 ఎకరాల్లో 240 టన్నుల (దాదాపు 20 ట్రక్కుల లోడు) ఉల్లి దిగుబడి రాగా.. అదే సమయంలో ధర ఆకాశాన్నంటడంతో అతడి పంట నిజంగానే పండినట్టయింది. క్వింటాలుకు రూ.7 వేలు చొప్పున విక్రయించగా.. అతడికి రూ.1.68 కోట్లు వచ్చాయి. దీంతో అతడు ఇప్పుడు పెద్ద సెలబ్రిటీ అయిపోయాడు. 'పంట సరిగ్గా పండకపోయినా, ఉల్లి ధరలు పడిపోయినా.. నేను అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉండేవాడిని. కానీ, ఉల్లిపాయలు నా అదృష్టాన్ని మార్చేశాయి' అని మల్లికార్జున ఆనందంగా చెబుతున్నాడు. వచ్చిన డబ్బుతో తన అప్పులన్నీ తీర్చేశానని.. ఇప్పుడొక ఇల్లు కట్టుకోవడానికి ప్రణాళికలు రచిస్తున్నానని మెరిసే కళ్లతో చెప్పాడు.



## నిర్భయ నిందితులను నేనే ఉరితీస్తా

- మహిళ అపరకాళి అనే మాటకు మరింత బలం
- రక్తాక్షరాలతో కేంద్రానికి షూటర్ వర్తికాసింగ్ లేఖ

లఖ్‌నవు, న్యూఢిల్లీ, డిసెంబరు 15: నిర్భయ నిందితులను ఉరితీసే అవకాశం తనకివ్వాలంటూ మహిళా షూటర్ వర్తికా సింగ్ రక్తాక్షరాలతో కేంద్రానికి లేఖ రాశారు. ఇందుకు తనకు అనుమతివ్వాలని కేంద్రహోంమంత్రి అమిత్ షాను కోరారు. మన దేశంలో మహిళలను అపరకాళిగా భావిస్తారని, నిందితులను ఉరితీసే అవకాశం తనకిస్తే ఆ భావన మరింత బలపడుతుందని, ప్రపంచానికీ అవగతం అవుతుందని పేర్కొన్నారు. మహిళలపై ఘోరాలకు పాల్పడితే తమను ఓ మహిళే ఉరికొయ్యకు వేలాడదీస్తుందన్న సంగతి రేపిస్టులకు తెలియాలన్నారు. ఆదివారం ఆమె ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. తన రక్తంతో రాసిన లేఖను స్పీడ్ పోస్టు ద్వారా అమిత్‌షాకు పంపానని, ట్విటర్‌లోనూ పోస్ట్ చేశానని తెలిపారు. ఈ విషయంలో తనకు మహిళా సైనికులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, సంస్థలు మద్దతు పలకాలని కోరారు. కాగా నిర్భయ నిందితులను ఉరితీసేందుకు అవకాశమివ్వాలంటూ చాలామంది లేఖలు రాస్తున్నారని ఢిల్లీ తిహాడ్ జైలు అధికారులు పేర్కొన్నారు. రేపిస్టులను నేరం చేసిన ఆరునెలల్లోగా ఉరితీయాలనే డిమాండ్‌తో పదిరోజులకు పైగా నిరాహార దీక్ష చేస్తున్న ఢిల్లీ మహిళా కమిషన్ చీఫ్ స్వాతి మాలీవాల్ ఆరోగ్యం విషమించింది. ఆదివారం అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆస్పత్రికి తరలించారు. ఎమర్జెన్సీవార్డులో ఆమెకు ఫ్లూయిడ్స్ ఎక్కిస్తున్నారు. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు పేర్కొన్నారు.

### నిర్భయ నిధుల్లో 3శాతమే ఖర్చు

న్యూఢిల్లీ: నిర్భయ నిధులను రాష్ట్రాలు ఖర్చుచేయడం లేదని కేంద్రం వెల్లడించింది. మహిళల భద్రత కోసం వినియోగించేలా 2013లో నిర్భయ నిధిని ఏర్పాటు చేసింది. రూ.1,649 కోట్ల నిర్భయ నిధుల్లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు రూ.147 కోట్లు మాత్రమే ఖర్చుచేసినట్లు ఇటీవల పార్లమెంటు సమావేశాల్లో మహిళా శిశు సంక్షేమ మంత్రి స్మృతీ ఇరానీ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రానికి రూ.103కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఇందులో రాష్ట్రం ఇప్పటివరకు రూ.3కోట్లనే ఖర్చుచేసింది. కర్ణాటక 7శాతం నిధులను, తమిళనాడు 3శాతం నిధులను ఖర్చుచేశాయి. ఆరు రాష్ట్రాలు.. మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, సిక్కిం, త్రిపుర సహా కేంద్ర పాలిత ప్రాంతమైన డామన్-డయ్యూలో ఒక్క పైసా వినియోగించలేదు. అన్ని రాష్ట్రాలకన్నా ఢిల్లీకి అత్యధికంగా రూ.390కోట్లను కేటాయించగా.. రూ.19.41కోట్లు మాత్రమే వినియోగించింది. అయితే, ఈ విషయాన్ని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కొట్టిపారేశారు. తమకు కేంద్రం నుంచి 390 కోట్లు రాలేదన్నారు.

## సావర్కర్ సిద్ధాంతాలకు సీఏఏ వ్యతిరేకం

- సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లించే యత్నం: ఉద్ధవ్



నాగ్‌పూర్, డిసెంబరు 15: పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్‌లలో పీడనకు గురవుతున్న మైనారిటీలను కొత్త పౌరసత్వ చట్టం ద్వారా దేశంలోకి అనుమతించడంపై బీజేపీని మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే విమర్శించారు. సింధూ నది నుంచి కన్యాకుమారి వరకు ఒకే దేశంగా ఉండాలని కోరుకున్న వీర్ సావర్కర్ సిద్ధాంతాలకు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) వ్యతిరేకమని ఆయన అన్నారు. సావర్కర్ కలను నెరవేర్చాల్సింది పోయి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయన సిద్ధాంతాలకు తిలోదకాలు వదిలి, మైనారిటీలను దేశంలోకి అనుమతించాలని చూస్తోందని, ఇది నిజంగా సావర్కర్‌ను అవమానించడమేనన్నారు. ఆదివారం నాడిక్కడ మీడియాతో ఉద్ధవ్ మాట్లాడారు. మహిళలకు భద్రత లేకపోవడం, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం వంటి సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే సీఏఏ వంటి కొత్త సమస్యలను బీజేపీ తెరపైకి తీసుకువస్తోందని ఆరోపించారు.

## తక్షణ న్యాయం కాదు.. సత్వర న్యాయం కావాలి

### తరచూ వాయిదాల్లేని విచారణ బాధ్యత న్యాయవ్యవస్థదే

- మహిళలు, పిల్లలపై పెరుగుతున్న నేరాలు
- వివక్ష లేకుండా అత్యాచారాల నిరోధం
- వీటిని రాజకీయం చేయొద్దు: వెంకయ్య



గాంధీనగర్, డిసెంబరు 15: దేశంలో మహిళలపై అత్యాచారాలు, నేరాలు నానాటికీ పెచ్చరిల్లడంపై ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. అయితే ఈ కేసుల్లో తక్షణ న్యాయం కుదరదని.. సత్వర న్యాయం జరగాలని సూచించారు. ఈ బాధ్యత న్యాయ వ్యవస్థపైనే ఉందని స్పష్టం చేశారు. ఆదివారమిక్కడ రాష్ట్ర పోలీసు అకాడమీలో గుజరాత్ పోలీసులకు ఆయన రాష్ట్రపతి గౌరవ పురస్కారాన్ని (కలర్ అండ్ స్టాండర్డ్), ప్రత్యేక జెండా, చిహ్నం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ.. అత్యాచార కేసుల విచారణలో తరచూ వాయిదాలు లేకుండా.. బాధితులకు న్యాయం అందించాలని సూచించారు. ఎలాంటి వివక్ష లేకుండా అత్యాచార నేరాలను నియంత్రించాలని.. వాటికి రాజకీయ రంగు పులమరాదని పిలుపిచ్చారు. దేశరాజధానిలో నిర్భయ గ్యాంగ్‌రేప్ దుర్ఘటన జరిగి ఏడేళ్లు పూర్తవుతున్నా దోషులకు శిక్ష అమలుకాని వైనంపై సర్వత్రా విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆ ప్రస్తావన లేకుండా వెంకయ్య మాట్లాడారు. 'మహిళలు, పిల్లలపై ఘోరనేరాలు పెరుగుతుండడం నన్ను బాధిస్తోంది. దేశవ్యాప్తంగా అక్కడక్కడా ఇలాంటి నేరాల గురించి వింటున్నాం. దీనికి పార్టీల నాయకత్వాలు రాజకీయ రంగు పులమొద్దని కోరుతున్నాను. అత్యాచారం మహిళలపై క్రూర నేరం. ఎలాంటి వివక్ష లేకుండా దీనిని అదుపుచేయాలి. తర తమ భేదాల్లేకుండా.. వచ్చిన ప్రతి ఫిర్యాదునూ పోలీసులు రిజిస్టర్ చేయాలి. వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేసి.. ప్రాసిక్యూషన్ ప్రక్రియను ప్రారంభించాలి' అని పిలుపిచ్చారు. న్యాయ విచారణ కూడా వీలైనంత త్వరగా పూర్తిచేయాలని.. దోషులకు త్వరగా శిక్ష విధించాలని న్యాయవ్యవస్థకు నా విజ్ఞప్తి. తక్షణ న్యాయం సాధ్యం కాదు కాబట్టి.. విచారణ తరచూ వాయిదాలు వేయకుండా చూడాల్సిన బాధ్యత దానిపై ఉంది. అప్పుడే మనుషుల్లో నేర ప్రవృత్తిని నియంత్రించగలం' అని పేర్కొన్నారు. మహిళలపై నేరాలకు సంబంధించి జస్టిస్ వర్మ కమిటీ 2013లో ఇచ్చిన నివేదికను తప్పకుండా అమలు చేయాలని ఉపరాష్ట్రపతి సూచించారు.

## వైద్యులపై దాడుల నిరోధ బిల్లు వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబరు 15: వైద్యులు, ఇతర ఆరోగ్య సిబ్బందిపై దాడులను అరికట్టడానికి కేంద్ర ఆరోగ్యశాఖ రూపొందించిన బిల్లు నిలిచిపోయింది. ఈ విషయంలో ప్రత్యేక చట్టం అవసరం లేదని పేర్కొంటూ కేంద్ర హోంశాఖ ఈ బిల్లును వాయిదా వేసింది. హెల్త్ సర్వీసెస్ పర్సనల్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ బిల్లు-2019 విధుల్లో ఉన్న వైద్యులు, ఇతర ఆరోగ్య నిపుణులపై దాడి చేసినవారికి పదేళ్ల వరకూ జైలుశిక్ష విధించాలని ప్రతిపాదించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టాలని భావించింది. దీనికి సంబంధించిన ముసాయిదా బిల్లుకు కేంద్ర న్యాయశాఖ ఆమోదం తెలిపింది. అయితే ఒక నిర్దిష్ట వృత్తిలో ఉన్నవారిని రక్షించడానికి ప్రత్యేకంగా చట్టం ఉండదని, దీనికోసం ఐపీసీ, ఐఆర్‌పీసీ సరిపోతాయని హోంశాఖ నిర్వహించిన అంతర్గత చర్చల్లో అభిప్రాయానికి వచ్చినట్లు ఆ శాఖ ఉన్నతాధికారి వివరించారు. ఈ బిల్లును అమలుచేస్తే కాలక్రమంలో పోలీసులు, న్యాయవాదులు తదితరులు సైతం తమ ప్రయోజనాల పరిరక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ప్రియుడి మర్మాంగం కోసిన వైద్యురాలికి పదేళ్ల జైలు

బెంగళూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. చివరకు వేరొక అమ్మాయిని వివాహమాడిన ప్రియుడి మర్మాంగాన్ని కోసేసిన కేసులో ఓ మహిళా డాక్టర్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష పడింది. బెంగళూరులోని కోరమంగల పోలీస్ స్టేషన్ పరిధిలో 2008లో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన కేసును విచారించిన బెంగళూరు 61వ సీసీహెచ్ కోర్టు న్యాయమూర్తి విద్యాధర శిరహట్టి శుక్రవారం ఈ మేరకు తీర్పు వెలువరించారు. డాక్టర్ సైదా అమీనా నహీం (32) కోరమంగల 8వ బ్లాక్-బి మెయిన్‌లో డెంటల్ క్లినిక్ నిర్వహించేది. అక్కడే ఆమెకు మైసూరుకు చెందిన డాక్టర్ మీర్ అర్షద్‌అలీతో ప్రేమలో పడింది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. కానీ.. మీర్ కుటుంబం వ్యతిరేకించింది. దాంతో తనకు కేన్సర్ ఉందని, పెళ్లి చేసుకోలేనని మీర్.. సైదా అమీనాను నమ్మించాడు. కొన్ని నెలల తర్వాత కుటుంబ పెద్దలు సూచించిన మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. తీవ్ర మానసిక వేదనకు గురైన అమీనా 2008 నవంబరు 29న మీర్ అర్షద్ దంపతులను క్లినిక్‌కు ఆహ్వానించింది. వారితో ఆత్మీయంగా మాట్లాడి మత్తు పానీయాలు ఇచ్చి స్పృహ కోల్పోయేలా చేసింది. అనంతరం మీర్ మర్మాంగాన్ని కోసి పరారైంది. ఈ కేసులో న్యాయస్థానం అమీనాకు పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.2 లక్షల జరిమానా కూడా విధించింది.






*Printed and Published by* ***Koganti Venkata Seshagiri Rao*** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107,* ***Editor : K. Srinivas,*** *RNI No:3470/1960,* ***Managing Director : Vemuri Radha Krishna, Founder :*** *K.L.N. Prasad.*

epaper.andhrajyothy.com